అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 31-1-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 343 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

బీజేపీతో ప్రమాదం

మోడీని నిలువరించడం కాంగ్రెస్‌కే సాధ్యం

వంద లక్షల కోట్ల అప్పును మిగిల్చిన ఘనుడాయన

- తమకు పోటీగా బీజేపీ మాత్రమే ఉండాలనే ఆరాటంలో బీఆర్ఎస్
- కాంగ్రెస్, కమలం ఒక్కటే అనడం సిగ్గుమాలిన చర్య
- ఫిబ్రవరి 2న ఇంద్రవెల్లిలో పార్లమెంటు ఎన్నికల శంఖారావం
- ఎంపీ అభ్యర్థులను నిర్ణయించే అధికారం ఖర్గేకు అప్పగిస్తూ టీపీసీసీ తీర్మానం
- మార్చి 3 వరకు దరఖాస్తులు :టీపీసీసీ అధ్యక్షులు, సీఎం రేవంత్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్, పక్కన డిప్యూటీ సీఎం భట్టి, షబ్బీర్ అలీ, తదితరులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశంలో మోడీని నిలువరించడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని టీపీసీసీ అధ్యక్షులు, సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీతో ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మతం పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ సర్కారు అధికారంలోకి వచ్చాక రూ.100 లక్షల కోట్లు అప్పు చేసి, ప్రపంచంలోనే ఇండియాను దివాళాతీసే దేశంగా నిలబెట్టారని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రేవంత్ అధ్యక్షతన టీపీసీసీ ఎన్నికల కమిటీ సమావేశమైంది. తాజా రాజకీయ పరిస్థితులు, పార్లమెంటు ఎన్నికలు, ప్రచారం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఎంపీ అభ్యర్థులను నిర్ణయించే అధికారాన్ని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు కట్టబెడుతూ సమావేశం తీర్మానం చేసింది. సోనియాగాంధీ రాష్ట్రం నుంచి పోటీ చేయాలనీ, ప్రజాస్వామికవాదులందరూ ఆమె ఏకగ్రీవ ఎన్నికకు సహకరించాలని కోరింది. ఏఐసీసీ ఇంచార్జి దీపాదాస్ మున్షి, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరీ, మన్సూర్ అలీఖాన్, విష్ణునాథ్, కార్యనిర్వాహక అధ్యక్షులు, మంత్రులు, సభ్యులు, తదితరులు ఈ భేటీకి హాజరయ్యారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని మోడీ నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను కూడా అమలు చేయకుండా పక్కన పడేశారని విమర్శించారు. 'విభజన హామీలను అమలు చేయాలంటూ బీఆర్ఎస్ నేత కేసీఆర్ అడగలేదు... మోడీ అమలు చేయలేదు' ఎద్దేవా చేశారు. గిరిజన యూనిర్సిటీ విషయంలో కేంద్రం నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రతిపేదవాని బ్యాంకు ఖాతాల్లో రూ15 లక్షలు వేస్తామనీ, ప్రతిఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామనీ, రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామనీ, 2022 నాటికల్లా పేదవారికి పక్కా ఇండ్లు నిర్మిస్తామంటూ ఇలా అనేక హామీలు ఇచ్చిన బీజేపీ దేశ ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడాన్ని పక్కనబెట్టి, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం, ప్రభుత్వాలను కూల్చడం వంటి చర్యలకు ఆ పార్టీ పాల్పడుతున్నదని విమర్శించారు. ప్రపంచంలో అత్యధికంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న దేశంగా ఇండియా అవతరించడం మోడీ ఘనతేనని ఎద్దేవా చేశారు. రైతులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకుని ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాలను కూల్చడంలో బీజేపీ రికార్డు సృష్టించిందని అన్నారు. దేశ ప్రజల మీద వంద లక్షల కోట్ల అప్పులు మోపారని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు జరిగితే మోడీ అక్కడికి వెళ్లలేదని విమర్శించారు. 'తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ సచ్చింది. దీనికి మనుగడ లేదు' అని ఎద్దేవా చేశారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటయ్యాయంటూ బిల్లా-రంగాలు (కేటీఆర్, హరీశ్‌రావు) అంటున్నారని విమర్శించారు. బీజేపీ సిద్ధాంతంతో పోరాటం చేస్తున్న కాంగ్రెస్.... బీజేపీతో ఎలా స్నేహం చేస్తుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే మూసీలో వేసినట్టేనన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే హామీలు నెరవేరుతాయని చెప్పారు. ఈ ...11లో

ప్రజాస్వామ్యం ఖూనీ

మతోన్మాదం పెచ్చరిల్లుతోంది



- అధికారపార్టీ రాజకీయ అస్త్రాలుగా ఈడీ, సీబీఐ
- ప్రతిపక్షాలను భయపెట్టడానికి, వేధించడానికే దర్యాప్తు సంస్థలు
- విలేకరుల సమావేశంలో సీతారాం ఏచూరి
- ముగిసిన సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని అధికారం నుంచి గద్దె దించే పోరాటానికి నాయకత్వం వహిస్తామని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. తిరువనంతపురంలోని ఈఎంఎస్ అకాడమీలో మూడు రోజుల పాటు జరిగిన సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశాలు మంగళవారం ముగిశాయి. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఎత్తుగడలు, దేశంలో రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై సమావేశాల్లో చర్చించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర కార్యాదర్శి, పొలిట్ బ్యూరో సభ్యులు ఎంవి గోవిందన్ మాస్టార్, పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ బేబిలతో కలిసి ఏచూరి మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బీజేపీ ఖూనీ చేస్తోందని విమర్శించారు. "ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పరిస్థితి ఉంది. కేరళలో ఎల్‌డీఎఫ్, కాంగ్రెస్ మధ్య ప్రత్యక్ష పోరు. ఇక్కడ బీజేపీకి సీట్లు రావు. అదే తమిళనాడులో డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ...11లో

ప్రతిపక్షాలపై కేంద్ర ఏజెన్సీల దాడి ఆపాలి

ప్రజా సమస్యలపై చర్చించాలి



అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాల డిమాండ్

- సభ సజావుగా జరిగేందుకు సహకరించాలి : ప్రభుత్వం
- నేడు పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం

వివరాలు 3లో..

పంచాయతీలకే తాగునీటి నిర్వహణ

- అందని గ్రామాలపై సర్వే
- నియోజకవర్గానికి రూ.కోటి
- కృష్ణా, గోదావరితో పాటు కొత్త రిజర్వాయర్ల వినియోగం
- కనెక్టివిటీ లేని గ్రామాలకు తారురోడ్లు
- సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి 12లో..



ఈడీ దాడి



నేడు జార్ఖండ్ సీఎం విచారణ

- మంగళవారం మధ్యాహ్నం వరకూ హైడ్రామా
- 30 గంటలకు పైగా కనిపించకుండా పోయిన హేమంత్ సోరెన్
- ఎట్టకేలకు రాంచీలోని తన అధికారిక నివాసంలో ప్రత్యక్షం
- సంకీర్ణ ప్రభుత్వ కూటమిలోని పార్టీల ఎమ్మెల్యేలతో సమావేశం

రాంచీ : జార్ఖండ్ సీఎం, జేఎంఎం చైర్‌పర్సన్ హేమంత్ సోరెన్‌ను విచారించటానికి ఈడీ సిద్ధమైంది. ముందుగా పంపిన సమన్ల ఆధారంగానే ఆయనను నేడు ప్రశ్నించటానికి సిద్ధమైనట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ విచారణ సందర్భంగా ఈడీ ఆయనను అరెస్టు చేయొచ్చనే వార్తల నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం వరకూ హైడ్రామా చోటు చేసుకున్నది. మనీలాండరింగ్ కేసులో ఆయన అరెస్టు కావచ్చనే వార్తలు గుప్పుమన్నాయి. ఇలాంటి తరుణంలో హేమంత్ సోరెన్ కనిపించకుండా పోయారు. 30 గంటల పాటు ఆయన జాడ తెలియలేదు. ఆ తర్వాత ఆయన మధ్యాహ్నం సమయంలో జార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీలోని తన అధికారిక నివాసంలో ప్రత్యక్షమయ్యారు. అధికార కూటమిలోని జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీలకు చెందిన ఎమ్మెల్యేలతో పాటు క్యాబినేట్ మంత్రులతో తన నివాసంలో సమావేశమయ్యారు. ఆయన భార్య

● హేమంత్ భార్యకు సీఎం పగ్గాలు?

కల్పనా సోరెన్ సైతం ఈ సమావేశంలో ఉన్నారు. సీఎం బాధ్యతలను ఆమె చేపట్టవచ్చనే ఊహాగానాలు సైతం వెలువడ్డాయి.

భద్రత కట్టుదిట్టం.. పలు ఆంక్షలు

తాజా పరిస్థితుల నేపథ్యంలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర పోలీసులు అలర్ట్ అయ్యారు. హేమంత్ సోరెన్ నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆంక్షలను విధించారు. ఆయన ఇంటి ముందు మంగళవారం పది గంటల వరకు గుమిగూడటాన్ని ...11లో

భూ పోరాట నాయకులకు బేడీలు

కరీంనగర్ జైలు నుంచి జగిత్యాలకు కోర్టుకు తరలింపు

పోలీసుల చర్యపై ప్రజాసంఘాల ఆగ్రహం



జగిత్యాల జిల్లాలో పేదలకు ఇండ్లు, స్థలాలు ఇవ్వాలని.. గుడిసెలు వేయించి భూపోరాటం చేస్తున్న నాయకులపై అక్రమ కేసులు పెట్టి రిమాండ్ చేసిన పోలీసులు.. మంగళవారం వారికి నేరస్థులకు వేసినట్టు బేడీలు వేసి కోర్టుకు తరలించారు. ఈ ఘటనపై ప్రజాసంఘాలు, సీపీఐ(ఎం) నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల చర్యలను ఖండించారు.

నవతెలంగాణ - కరీంనగర్

జగిత్యాల జిల్లాలో సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి 15 రోజుల కిందట కరీంనగర్ జిల్లా జైలులో పెట్టారు. మంగళవారం జగిత్యాల కోర్టు పేషీ నిమిత్తం నాయకులు లెల్లెల బాలకృష్ణ, జి.తిరుపతి నాయక్, రమేష్ తదితర నాయకులను బేడీలు వేసి తీసుకెళ్లారు. ఇది చాలా దుర్మార్గమని కరీంనగర్ సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్ ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయ శాస్త్ర చట్టం ప్రకారం.. నిందితులను క్రిమినల్ ఖైదీగా నిర్ధారించిన వారికి మాత్రమే బేడీలు వేసి కోర్టులకు తరలించాలని నిబంధనలు ఉన్నాయన్నారు. కానీ, ప్రజల కోసం నిత్యం పని చేసే ప్రజా సంఘాల నాయకులకు బేడీలు వేయటం చట్ట విరుద్ధమన్నారు. పేదల ప్రాథమిక హక్కుగా ఇల్లు కావాలని అనేక ఉద్యమాలు చేస్తున్నారని.. ఎక్కడా బేడీలు వేసి కోర్టుకి హాజరు పరిచిన చరిత్ర లేదన్నారు. ప్రజాస్వామ్యం మా జన్మహక్కు అని గొప్పలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలలు పూర్తి కాకముందే ప్రజా సంఘాల నాయకులను అణచివేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోందన్నారు. దీన్ని ప్రజాస్వామ్యవాదులందరూ తీవ్రంగా ఖండించాలని కోరారు. వెంటనే బేషరతుగా నాయకులకు క్షమాపణలు చెప్పి విడుదల చేయాలని, బేడీలు వేసిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రాజెక్టుల అప్పగింతపై కేంద్రం దుందుడుకు చర్యలు


రేపు కేఆర్ఎంబీ, ఈఎన్సీల మధ్య చర్చ



- ముదురుతున్న వివాదం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాబాద్

నాగార్జునసాగర్ డ్యామ్, శ్రీశైలం డ్యామ్‌ల అప్పగింత వివాదం కొనసాగుతుండగానే కేంద్ర జలశక్తి శాఖ మరో ముందడుగేసింది. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో ఈ రెండు ప్రాజెక్టులపై వివాదం నెలకొన్న నేపథ్యంలో ఫిబ్రవరి ఒకటిన అప్పగింతపై హైదరాబాద్‌లో కీలక భేటి జరగనుంది. దీంతో రాజకీయవర్గాల్లో మరోసారి చర్చకు దారితీసింది. రెండు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్సీ)లతోపాటు కృష్ణా నదీ ...11లో



'కీపింగ్ ఆఫ్ ద గుడ్ ఫైట్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి, పక్కన తులసీ చందు, విద్యాసాగర్, నాగేశ్వర్, హరగోపాల్, మాడభూషి శ్రీధర్, పార్థసారధి

రాముడు నియంతృత్వాన్ని అంగీకరించడు

అయోధ్యలో ప్రాణప్రతిష్ట వెనుక వెయ్యేండ్ల ప్రణాళిక


- దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ
- రాజ్యాంగమే ప్రత్యామ్నాయం
- సత్యాన్వేషణ జరగాలి
- సమీకరించడం, ఉద్యమించడం ప్రజల హక్కు
- పోరాటాలు మాని పార్లమెంటరీ వ్యవస్థపై వ్యామోహం వల్ల ప్రమాదం
- ప్రబీర్ పుర్కాయస్థ 'కీపింగ్ అప్ ద గుడ్ ఫైట్' పుస్తకావిష్కరణలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాముడు నియంతృత్వాన్ని అంగీకరించబోడని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్‌రెడ్డి అన్నారు. అయోధ్యలో రాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ట వెనుక వెయ్యేండ్ల ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం ఆవిష్కరించిందన్నారు. ఇది అర్థం చేసుకోకపోతే నిజం మాత్రమే తెలుసుకుంటారనీ, సత్యాన్ని తెలుసుకోలేరని చెప్పారు. అందుకే సత్యాన్వేషణ జరగాలని సూచించారు. ప్రబీర్ పుర్కాయస్థ రచించిన 'కీపింగ్ అప్ ద గుడ్ ఫైట్ ఫ్రం ద ఎమర్జెన్సీ టు ద ప్రజెంట్ డే'అనే పుస్తకాన్ని సుదర్శన్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. మొదటి ప్రతిని మాడభూషి శ్రీధర్‌కు ఇచ్చారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి ప్రత్యామ్నాయ ఆలోచన రాజ్యాంగమేనని అన్నారు. రాజ్యాంగ పీఠికలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఉన్నాయని చెప్పారు. రాజ్యాంగం అన్ని మతాలు, కులాలు, ప్రజలందరినీ సమానంగా గౌరవిస్తుందన్నారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో హక్కులు ప్రజలవి, బాధ్యతలు ప్రభుత్వాలవని వివరించారు. ఇప్పుడు ప్రజలకు హక్కులు కనిపించడం లేదన్నారు. ప్రతి మనిషీ ఎమర్జెన్సీ పరిస్థితులను తప్పకుండా ఎదుర్కొంటారని ప్రబీర్ పుర్కాయస్థ పుస్తకంలో రాశారని అన్నారు. సమీకరించడం, ఉద్యమించడం రాజ్యాంగ హక్కని చెప్పారు. ప్రజాపోరాటాలను మాని పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల మితిమీరిన వ్యామోహం ప్రదర్శించడం వల్ల ప్రమాదం వచ్చిందన్నారు. పోరాటాలను ...10లో

ఈ యేడాది రెండు బడ్జెట్లు..

- లోక్‌సభ ఎన్నికలకు ముందొకటి..ఆ తర్వాత మరోటి..
- మొదటిది ఓటాన్ అకౌంట్..రెండోది పూర్తిస్థాయి బడ్జెట్
- ప్రతిపాదనలు పూర్తి...కసరత్తులు ముమ్మరం



3లో..

డిస్కంల్లో తాత్కాలిక డైరెక్టర్ల నియామకం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల్లో (డిస్కంలు) తాత్కాలిక డైరెక్టర్లను నియమిస్తూ సీఎమ్‌డీలు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో సుదీర్ఘకాలంగా నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న డైరెక్టర్లను తొలగిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రిజ్వీ సోమవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనితో ఆయా సంస్థల సీఎమ్‌డీలు డైరెక్టర్లను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదేసమయంలో కొత్త డైరెక్టర్ల నియామకాల కోసం నోటిఫికేషన్లు కూడా ఇచ్చారు. అయితే ఆ ప్రక్రియ పూర్తయ్యేదాకా పరిపాలన స్తంభించకుండా, సంస్థల్లో చీఫ్ ...11లో

ఎమ్మెల్సీల ప్రక్రియపై స్టేటస్‌కో

హైకోర్టు మధ్యంతర ఆదేశాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకాల వివాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం దాసోజు శ్రవణ్ కుమార్, కుర్ర సత్యనారాయణలను నియమించాలని సిఫార్సు చేస్తే అందుకు గవర్నర్ నిరాకరించారు. ఇద్దరిని నియమించాలన్న ప్రతిపాదనలను తిరస్కరించారు. ఈ నేపథ్యంలో గవర్నర్ చర్యను సవాల్ చేస్తూ వారిద్దరూ వేసిన ...11లో

13 నెలలైనా 'డబుల్' ఇండ్లు ఇవ్వరా?

- ఏడేండ్లుగా ఎదురుచూపులు
- టోకెన్లు ఇచ్చి ఏడాది దాటింది
- ఇక మాకు ఓపికలు లేవు
- గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తాలో రెండు గంటలపాటు లబ్ధిదారుల రాస్తారోకో



నవతెలంగాణ- గజ్వేల్

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో పేదలను గుర్తించి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని 13 నెలలుగా అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ ప్రదక్షిణలు చేయించుకున్నారు. దాంతో ఇండ్ల లబ్దిదారుల ఓపిక నశించి మంగళవారం రోడ్డెక్కారు. రెండు గంటల పాటు గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో లబ్దిదారులు రోడ్డుపై బైటాయించారు. పిల్లాపాపలతో ఎర్రటి ఎండలో రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఉదయం 10.30లకు ప్రారంభమైన రాస్తారోకో 12.30 గంటల వరకు కొనసాగింది. ఏడేండ్లుగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం ఎదురు చూస్తున్నామని, ఇక మాకు ఓపిక నశించిందని లబ్దిదారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావంతో గజ్వేల్ అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందిన కేసీఆర్ ఐదువేల ఇండ్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చి చివరకు జీ ప్లస్ వన్ పద్ధతిలో 1250 ఇండ్లను గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సంగాపూర్ వద్ద 2016లో నిర్మించారు. సుమారు 4 వేల దరఖాస్తులు రాగా నాలుగైదు సార్లు ప్రత్యేక అధికారులు ఇంటింటి సర్వే చేశారు. చివరకు 1400 మంది లబ్దిదారులను అధికారులు గుర్తించారు. 2016లోనే చివరి దశలో ఇండ్ల నిర్మాణం పూర్తయింది. లబ్దిదారుల ఎంపిక కూడా పూర్తయింది. అయినా ఇండ్లు కేటాయించలేకపోయారు. 2018లో మరోసారి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే, సీఎం కేసీఆర్ లబ్దిదారులకు ఇండ్లు కేటాయించకుండా మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు అందులో నివాసం కల్పించారు. అప్పటి కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి రాత్రికిరాత్రి మల్లన్నసాగర్ నిర్వాసితులను డీసీఎం, బస్సుల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు తరలించారు. ప్లాట్లు కేటాయించిన తర్వాత మల్లన్నసాగర్ నిర్వాసితులు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఖాళీ చేస్తారని అప్పట్లో చెప్పారు. పూర్తిస్థాయిలో ప్లాట్లు, ప్యాకేజీ రాలేదని మల్లన్నసాగర్ నిర్వాసితులు మొరపెట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే 13 నెలల క్రితం ప్రస్తుత కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆధ్వర్యంలో 1150 మందికి డ్రా పద్ధతిలో ఇండ్లు కేటాయించారు. 15 రోజుల్లోపే మల్లనసాగర్ నిర్వాసితులను ఖాళీ చేయించి ఇండ్లు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీ నెరవేరలేదు. ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఇండ్ల పంపిణీ వాయిదా పడింది. ఎన్నికలు ముగిసిన తర్వాత ఇప్పటివరకు ఇండ్లు కేటాయించలేదు. లబ్దిదారులకు ఇల్లు ఇవ్వాలని అనేకసార్లు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించారు. జిల్లా కలెక్టర్ దృష్టికి అనేకసార్లు ప్రజావాణిలో దరఖాస్తులు కూడా అందజేశారు. ఇండ్లల్లో ఉన్న మల్లన్నసాగర్ నిర్వాసితులు పూర్తిస్థాయి ప్యాకేజీ వచ్చిన తర్వాత బయటకు వెళ్తామని చెప్పడంతో స్థానిక లబ్దిదారులు ఓపిక నశించి మంగళవారం రాస్తారోకోకు దిగారు. 13 నెలలుగా టోకెన్లు పట్టుకొని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం దక్కకపోవడంతో రోడ్డెక్కాల్సి వచ్చిందని వాపోయారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, ఏసీపీ రమేష్ బాబు సంఘటనా స్థలానికి చేరుకొని లబ్దిదారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వారి మాటలను పట్టించుకోకుండా రెండు గంటల పాటు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ బన్సీలాలు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్మించిన ఇండ్లల్లో మల్లన్నసాగర్ నిర్వాసితులు ఉన్నారని, త్వరలో వారికి ప్లాట్లు కేటాయిస్తామన్నారు. సర్వే చేసి నెలరోజులలోపు డ్రా పద్ధతిలో లబ్దిదారులకు ఇండ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అయినా లబ్దిదారులు రాస్తారోకో విరమించలేదు. ఏసీపీ రమేష్‌బాబు జోక్యం చేసుకొని మాట్లాడుతూ.. రాస్తారోకోతో ప్రజలకు ఇబ్బందులు వస్తాయని, రెవెన్యూ అధికారులతో చర్చించి లబ్దిదారులకు ఇండ్లు కేటాయించేలా ప్రయత్నం చేస్తామన్నారు. 13 నెలలుగా అధికారులు ఇదే ముచ్చట చెబుతున్నారని లబ్దిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు గంటలపాటు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ తూప్రాన్ మధ్య వాహనాలు నిలిచిపోయాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆర్డీఓ బన్సీలాల్, ఏసీపీ రమేష్ బాబు కొందరు లబ్దిదారులతో మాట్లాడి నెల రోజుల్లో ఇండ్లు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. దాంతో లబ్దిదారులు అధికారుల మాట విని రెండు గంటల తర్వాత రాస్తారోకో విరమించారు.

పొన్కల్ పీఏసీఎస్ చైర్మెన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- వైస్ చైర్మెన్‌కు తాత్కాలిక బాధ్యతలు


నవతెలంగాణ-జన్నారం

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని పొన్కల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. 13 మంది సభ్యులు ఉన్న పాలకమండలిలో బీఆర్ఎస్‌కు చెందిన చైర్మెన్ శీలం రమేష్‌పై 10 మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇన్‌చార్జి అధికారి జె.నర్సయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 10 మంది ఓట్లు వేశారు. దీంతో శీలం రమేష్ చైర్మెన్ పదవి కోల్పోయారు. వైస్ చైర్మెన్ మహిపాల్‌రెడ్డిని తాత్కాలిక చైర్మెన్‌గా నియమించినట్టు జె.నర్సయ్య తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు చైర్మెన్ నియామకానికి ఓటింగ్ నిర్వహించనున్నట్టు ప్రకటించారు.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	63,270	▲	200
22 క్యారెట్లు	58,000	▲	200
కిలో వెండి	78,800	▲	300



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	109
రిటైల్ (లైవ్)	రూ.	131
స్కిన్‌తో	రూ.	190
స్కిన్‌లెస్	రూ.	216

'ఆయిల్‌పామ్' అధోగతి

- ఉద్యానవన శాఖకు పట్టని పామాయిల్ రైతు
- అవగాహన సదస్సులు.. క్షేత్రస్థాయి పర్యటనలు శూన్యం
- రైతులు ఫోన్ చేసినా స్పందించని అధికారగణం
- వ్యవసాయమంత్రి సొంత జిల్లాలోనూ నిర్లక్ష్యం..?



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

దేశంలో నూనె గింజల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం సంబంధిత పంటలకు ప్రోత్సాహకాలు ఇస్తోంది. దీనిలో భాగంగా రెండు, మూడేండ్లుగా పామాయిల్ రైతులకు రాయితీలు కల్పిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఈ పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో రైతులను గైడ్ చేయడం, నూతన రైతులను సాగు దిశగా నడిపించాల్సిన ఉద్యానవన శాఖ అధికారుల్లో పలుచోట్ల నిర్లక్ష్యం కొనసాగుతోందని రైతులంటున్నారు. ఉద్యాన అధికారులు, ఆయిల్‌ఫెడ్ కంపెనీ సిబ్బందికి ఇచ్చిన టార్గెట్ ప్రకారం పామాయిల్ సాగు విస్తీర్ణం పెంచడం మినహా ఆ తర్వాత పర్యవేక్షణ లోపిస్తుందనే ఆరోపణలున్నాయి. స్వయంగా పామాయిల్ రైతు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం జిల్లాలోనే ఈ పరిస్థితి ఉంటే రాష్ట్రవ్యాప్తంగా ఎంత నిర్లక్ష్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. మంత్రి దమ్మపేట మండలంలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. ఆయిల్‌పామ్‌పై ఆయన మంత్రి కానప్పటి నుంచే దృష్టి సారించారు. రైతుల ఉన్నతి కోసం కృషి చేస్తున్నారు.

లక్ష్యమే కానీ పర్యవేక్షణ లేదు..!

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 73వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.50 లక్షల ఎకరాల్లో ఈ పంట సాగవుతుంటే దీనిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే అత్యధికంగా 55వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 18వేల ఎకరాల్లో ఈ పంట సాగవుతోంది. ఆయిల్‌పామ్ విస్తీర్ణత కోసం ప్రభుత్వం గతంలోనే రూ.వెయ్యి కోట్లకు పైగా కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 26కు పైగా జిల్లాల్లో రెండు లక్షల ఎకరాల వరకు సాగు లక్ష్యంగా పెట్టుకోగా.. ఆ దిశగా అధికారుల కృషి బాగానే ఉంది. టార్గెట్ ప్రకారం మొక్కలు వేయిస్తున్న అధికారులు వాటి పర్యవేక్షణ విషయంలో ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని రైతుల నుంచి ఆరోపణలున్నాయి. ఈ విషయంలో భద్రాద్రి కొత్తగూడెం కొంత మెరుగైన పనితీరు చూపుతున్నా.. ఖమ్మం జిల్లాలో మాత్రం నిర్లక్ష్యం ఉందని రైతులు వాపోతున్నారు. రాష్ట్రంలోనే అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల్లో సగం పంట సాగవుతోంది.

ఈ రెండు డివిజన్లలో చాలా మంది రైతులు మామిడి, ఇతరత్రా పంటలను తొలగించి ఆయిల్‌పామ్ సాగు వైపు మళ్లారు. ఈ రెండు నియోజకవర్గాలే కాక ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. దీనికి అధికారుల ప్రోత్సాహం కన్నా ఇతర పంటల్లో ఆశించిన దిగుబడులు రాకపోవడం, ధరలు, ప్రకృతి విపత్తులు.. రకరకాల కారణాలున్నాయి. రైతుల మక్కువను గమనించి అశ్వారావుపేట మండలం నారంవారిగూడెంలో 63 ఎకరాల విస్తీర్ణంలో 8లక్షలకు పైగా మొక్కలను పెంచేలా నర్సరీని అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో మొక్క రూ.193 ధర ఉంటే దానిని రాయితీపై రూ.20కే ఇస్తున్నారు. కానీ రవాణా ఖర్చులు మాత్రం రైతు భరించాల్సి వస్తోంది.

ఇవికాక డ్రిప్ పరికరాలు, గెలలు కత్తిరించే యంత్రాలు, ఇతర ప్రాసెసింగ్ పరికరాలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సహకాలు ఇస్తున్నా.. చీడపీడల నివారణ, యాజమాన్య పద్ధతుల విషయంలో అధికారుల్లో నిర్లక్ష్యం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు.

సాగు తప్ప బాగుపట్టని అధికారులు..

టార్గెట్ ప్రకారం రైతుల చేత సాగు చేయిస్తున్న అధికారులు ఆయిల్‌పామ్ మొక్కలు ఏపుగా పెరిగేందుకు వీలుగా అనువైన యాజమాన్య పద్ధతులను తెలపడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడం లేదు. రైతుల ఫిర్యాదులపై సకాలంలో స్పందించడం లేదు. ఫోన్ చేసినా జవాబు ఉండటం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. రైతువేదికల్లో నూతన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ఆయిల్‌పామ్ సాగుతో ఎలా లాభాలు గడించొచ్చో చెబుతున్నారే కానీ దాని ద్వారా ఎదురయ్యే లోటుపాట్లపై మాత్రం వివరించడం లేదు. కాండం మొదలు కుళ్లు తెగులు (గానోడెర్మా), చెదలు, ఎలుకల నియంత్రణ, నీటి పరిమాణము, మైక్రో స్పింక్లర్ల ద్వారా నీరు ఇచ్చే విధానం, ఎరువుల వాడకం, కలుపు మొక్కల నివారణ, సాగు నీటి యాజమాన్యం, ఏ వయస్సు మొక్కకు ఎంత నీరు అవసరం.. తదితర వివరాలేవీ చెప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఫలితంగా రైతులు మిడిమిడి జ్ఞానంతో చేస్తున్న కొన్ని పనుల వల్ల భారీ నష్టాలను చవిచూడాల్సి వస్తుందని అంటున్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలు శూన్యం

వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు నిరంతరం క్షేత్రస్థాయి పరిశీలన జరిపి చీడపీడల వ్యాప్తి, యాజమాన్య పద్ధతులపై సలహాలు సూచనలు చేస్తేనే రైతులకు ఆశించిన ఫలితాలు లభిస్తాయి. కానీ ఖమ్మం జిల్లా ఉద్యానశాఖ, పలు జిల్లాల్లో ఆశించిన మేర రైతులకు అధికారులు, ఆయిల్‌ఫెడ్ కంపెనీ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని రైతులంటున్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలో ఓ ఔత్సాహిక రైతు 26 ఎకరాల్లో రూ.లక్షలు వెచ్చించి ఆయిల్‌పామ్ సాగు చేశారు. దాదాపు ఐదారు నెలలైనా ఆ రైతు వ్యవసాయ క్షేత్రాన్ని అధికారులు ఒక్కసారి కూడా చూడలేదు. ఫలితంగా పురుగులో ఎలుకలో తెలియదు కానీ కాండం దెబ్బతిని మొక్కలు నేలకొరుగుతున్నాయి. దీనిపై అధికారులకు ఫోన్ చేసినా నేరుగా సంప్రదించినా ఉపయోగం లేదు.

వాట్సప్ గ్రూప్‌లు పెట్టి సలహాలు ఇవ్వాలి

వాట్సప్ గ్రూపులు పెట్టి రైతులకు ఎప్పటికప్పుడూ సలహాలు సూచనలు ఇవ్వాలని రైతులు కోరతున్నారు. చీడపీడల వ్యాప్తికి సంబంధించిన ఫొటోలు పెట్టి వాటి నియంత్రణ చర్యలను వివరించాలంటున్నారు. అలాగే వర్షపాతం, వాతావరణ పరిస్థితులు, సూర్యరశ్మి తదితర అంశాలు, యాజమాన్య పద్ధతులపైనా సలహాలు కోరుతున్నారు.

నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది..

జిల్లాలో నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్తున్నాం. రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులకు ఎలాంటి లోటు రాకుండా చూస్తున్నాం. కొందరు సరైన యాజమాన్య పద్ధతులను అవలంబించడంలో విఫలమవుతున్నారు. అందుకే ఇలాంటి సమస్యలు వస్తున్నాయి.

అనసూయ, ఖమ్మం జిల్లా ఉద్యాన అధికారి

నేడు సీఐటీయూ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు



- మహా ప్రదర్శన, బహిరంగసభ
- హాజరుకానున్న బీవీ రాఘవులు, తపన్‌సేన్
- అరుణారుణమైన నగరం

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలకు హన్మకొండ నగరం ముస్తాబైంది. ఈ సమావేశాల్లో భాగంగా బుధవారం ఉదయం 11.00 గంటలకు హన్మకొండలోని వేయిస్తంభాల దేవాలయం నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు భారీ ర్యాలీని నిర్వహించనున్నారు. ఈ ర్యాలీని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ ప్రారంభిస్తారు. అనంతరం జరగనున్న బహిరంగసభలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఐటీయూ మాజీ ప్రధాన కార్యదర్శి బీవీ రాఘవులు, సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ప్రసంగించనున్నారు. బహిరంగసభకు సంఘం జిల్లా అధ్యక్షులు టి. ఉప్పలయ్య అధ్యక్షత వహిస్తారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు కాజీపేట ఫాతిమానగర్‌లోని బాలవికాసలో వర్కింగ్ కమిటీ సమావేశాలు జరగనున్నాయి. 170 మంది పాల్గొనే ఈ సమావేశాలు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.హన్మకొండ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న వర్కింగ్ కమిటీ సమావేశాలకు ఆహ్వానసంఘం నేతృత్వంలో ఏర్పడ్డ పలు కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదిన్నర ఏండ్లలో అనుసరిస్తున్న విధానాల మూలంగా కార్మికుల ఇబ్బందులపై ఈ సమావేశాల్లో చర్చించనున్నారు. పార్లమెంటు ఎన్నికలతోపాటు ప్రయివేటీ కరణ, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని, కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, 4 కార్మిక కోడ్‌లు, ఎంవీ యాక్టు, విద్యుత్ సవరణ చట్టాలను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, స్కీమ్ వర్కర్లను ఉద్యోగులు గా గుర్తిం చడం, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడం, ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయడం, ధరల నియంత్రణ తదితర సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న జరిగే సమ్మె విజయవం తానికి ఈ సమావేశాల్లో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. ఈ సమావేశాల విజయవంతానికి జిల్లావ్యాప్తంగా వాల్‌రైటింగ్‌తో పాటు, లక్ష తోరణాలు ఏర్పాటు చేశారు. 5 వేల పోస్టర్లు, 60 వేల కరపత్రాలతో ప్రచారం చేశారు. కాగా, ఈ సమా వేశాల ఏర్పాట్లకై ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా పింగిళి సంపత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జూలపల్లి సంపత్‌రావు, ప్రధాన కార్యదర్శి రాగుల రమేశ్, కోశాధికారి టి. ఉప్పలయ్యను నియమించారు.

నర్సంపేట చైర్‌పర్సన్‌పై వీగిన అవిశ్వాసం

14 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా..



నవతెలంగాణ-నర్సంపేట

వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనీపై అవిశ్వాసం వీగిపోయింది. ఇటీవల బీఆర్ఎస్‌కు చెందిన 13మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్ గుంటి రజనీపై అవిశ్వాసం ప్రకటిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ పీ.ప్రావీణ్యకు నోటీసిచ్చారు. మున్సిపల్ చట్టం-19 ప్రకారం కలెక్టర్ ఉత్తర్వుల మేరకు అధికారులు మంగళవారం అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రీ సైడింగ్ అధికారిగా ఆర్డీవో కృష్ణవేణి వ్యవహరించారు. మొత్తంగా 24 మంది కౌన్సిలర్లు ఉండగా 16మంది బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు, ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఇద్దరు ఇండిపెండెంట్లు ఉన్నారు. కాగా నిర్ణీత 11 గంటల నుంచి 11:30 వరకు కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం వాయిదా వేస్తున్నట్టు ప్రీసైడింగ్ అధికారి తెలిపారు. తదుపరి 2:30 వరకు కూడా కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో జీవో 835, రూల్ 10(3) ప్రకారం చైర్‌పర్సన్ గుంటి రజనీపై అవిశ్వాసం వీగిపోయినట్టు ప్రీ సైడింగ్ అధికారి ప్రకటించారు.

హైడ్రామా నడుమ రాజీనామా..

నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనీపై అవిస్వాసం వీగిపోయినట్టు ప్రకటించిన కొద్దిసేపట్లోనే బీఆర్ఎస్‌కు చెందిన 14 మంది కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. మంగళవారం చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ఉత్కంఠ భరితంగా సాగింది. చైర్‌పర్సన్ రజనీపై బీఆర్ఎస్‌కు చెందిన వైఎస్ చైర్మెన్ మునిగాల వెంకట్ రెడ్డితో పాటు 13 మంది కౌన్సిలర్లు పలు ఆరోపణలు చేస్తూ జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాసంపై నోటీసులిచ్చారు. తదుపరి బీఆర్ఎస్ అంతర్గత సమావేశాల్లో పలుమార్లు బుజ్జగింపు పర్వం సాగింది. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆ పార్టీ చైర్‌పర్సన్ గుంటి రజనీకి వ్యతిరేకంగా అవిశ్వాసంలో పాలుపంచుకోవద్దని విప్ జారీ చేశారు. చైర్‌పర్సన్ రజనీతో పాటు మరో ఇద్దరు క్యాంప్‌నకు వెళ్లారు. ఇది పార్టీ నిర్ణయానికి వ్యతిరేకమని క్యాంప్ నుంచి తిరిగి రావాలని బీఆర్ఎస్ నాయకులు ఆదేశించారు. ఒక వైపు చైర్‌పర్సన్‌కు అనుకూలంగా విప్ జారీ చేయడం, మరో వైపు క్యాంప్‌నకు వెళ్లిన చైర్‌పర్సన్, ఇద్దరు కౌన్సిలర్‌లపై చర్యలు ఉంటాయని బీఆర్ఎస్ ప్రకటన హైడ్రామాకు దారి తీసింది. అవిశ్వాసం నెగ్గాలంటే 17 మంది కౌన్సిలర్లు హాజరై ప్రకటించాల్సి ఉంది. ఆ పార్టీకి చెందిన 14 మంది మాత్రమే అవిశ్వాసానికి అనుకూలంగా ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు కౌన్సిలర్లు అవిశ్వాసానికి దూరంగా ఉన్నట్టు ముందే ప్రకటించారు.

ప్రతిపక్షాలపై కేంద్ర ఏజెన్సీల దాడి ఆపాలి

- ప్రజా సమస్యలపై చర్చించాలి
- అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాల డిమాండ్
- సభ సజావుగా జరిగేందుకు సహకరించాలి : ప్రభుత్వం
- నేడు పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ముందు అఖిలపక్ష సమావేశం మంగళవారం జరిగింది. పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరిగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని ప్రభుత్వం కోరింది. కాంగ్రెస్, టీఎంసీ, ఆర్జేడీ, ఎస్పీలతో సహా కనీసం సగం మంది ప్రతిపక్ష నాయకులు "కేంద్ర ఏజెన్సీల దుర్వినియోగం" అంశాన్ని లేవనెత్తారు. జేఎంఎం అధ్యక్షుడు, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ వంటి నాయకులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడిని ఎత్తి చూపారు. దీని తరువాత బీహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్, హర్యానా కాంగ్రెస్ నేత భూపీందర్ సింగ్ హుడాపై కేంద్ర ఏజెన్సీ దాడిని ప్రతిపక్ష నేతలు ప్రశ్నించారు.

అసోంలో రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రపై "హింసాత్మక దాడి", రాష్ట్ర ప్రభుత్వ ఆంక్షలకు అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ లేవనెత్తారు. "దేశంలో 'అలిఖిత నియంతృత్వం' ఉంది. దేశ రాజ్యాంగ చట్టం ప్రమాదంలో ఉంది. మేం దాని గురించి నిజంగా ఆందోళన చెందుతున్నాం.



ఏజెన్సీల తీరుపై మేం కేంద్ర ప్రభుత్వం నుంచి సమాధానాలు కోరుతున్నాం" అన్నారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలూ ప్రసాద్ వంటి ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వంటి దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నదని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలను సంప్రదించిన తర్వాత తాను ఈ అంశాలను లేవనెత్తానని తివారీ చెప్పారు.

ప్రజా సమస్యలపై చర్చించాలి: ఎలమారం కరీం

సీబీఐ, ఈడీ, ఐటీ వంటి కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించుకుని వివిధ రాష్ట్రాల్లో బీజేపీ చేస్తున్న రాజకీయ విధ్వంసక ఎత్తుగడలపై చర్చించేందుకు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్షాలు సమయం ఇవ్వాలని సీపీఐ(ఎం) రాజ్యసభ పక్షనేత ఎలమారం కరీం డిమాండ్ చేశారు.

రాష్ట్రాల అధికారాలపై కేంద్రం దాడి, దేశాన్ని సమూలంగా మార్చడం, రైతులు, కార్మికుల ఆందోళనలు, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్‌పైనా చర్చించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం వివక్షకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 8న ఢిల్లీలో కేరళ ప్రభుత్వం ధర్నా చేస్తున్నదని కరీం తెలిపారు. పార్లమెంట్‌పై దాడి గురించి ప్రభుత్వం మౌనం వీడాలని సీపీఐ ఎంపీ పి.సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో శాంతియుత జీవితం ఎప్పుడు ఉంటుందో ప్రభుత్వం చెప్పగలదా? అని ఆయన ప్రశ్నించారు.

చర్చకు సిద్ధం: కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

ప్రతి అంశంపైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. 'ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌ను సమర్పించే ఈ ముఖ్యమైన సెషన్‌లో ప్రతిపక్ష ఎంపీలందరి సహకారం మేం కోరాం. నినాదాలు చేయవద్దని, ప్లకార్డులు తీసుకురావద్దని ప్రతిపక్ష ఎంపీలను మళ్లీ అభ్యర్థిస్తాం' అని అన్నారు.

ప్రభుత్వం ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశానికి వివిధ పార్టీల నేతలు హాజరయ్యారు. కేంద్ర రక్షణ మంత్రి, లోక్‌సభ ఉపనేత రాజ్‌నాథ్ సింగ్, రాజ్యసభ నేత పీయూష్ గోయల్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి, సహాయ మంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, మురళీధరన్ ఈ సమావేశానికి ప్రభుత్వం తరపున ప్రాతినిధ్యం వహించారు. పార్లమెంట్‌లో జరిగిన ఈ సమావేశంలో అనుప్రియ పటేల్ (అప్నాదళ్), కె.సురేష్, ప్రమోద్ తివారీ (కాంగ్రెస్), సుదీప్ బందోపాధ్యాయ, సుఖేదు శేఖర్ రాయ్ (టీఎంసీ), టీఆర్ బాలు, తిరుచ్చి శివ (డీఎంకే), రాహుల్ షెవాలే (శివసేన), ఎలమారం కరీం, పిఆర్ నటరాజన్ (సీపీఐ(ఎం), సంతోష్ కుమార్ (సీపీఐ), అమరేంద్ర ధారి సింగ్ (ఆర్జేడీ), ఎస్.టి.హసన్ (ఎస్పీ), రామ్‌నాథ్ ఠాకూర్ (జేడీయూ), జయదేవ్ గల్లా, కనకమేడల రవీంద్రకుమార్ (టీడీపీ), భీశెట్టి సత్యవతి (వైసీపీ), నామా నాగేశ్వరరావు, కే. కేశవరావు (బీఆర్ఎస్), సస్మిత్ పాత్ర (బీజేడీ), వైకో (ఎండీఎంకే), హస్నైన్ మసూది (నేషనల్ కాన్ఫరెన్స్) తదితరులు పాల్గొన్నారు. అఖిల పక్ష సమావేశానికి మొత్తం 30 పార్టీల నుంచి 45 మంది నేతలు హాజరయ్యారు.

ఒత్తిడితోనే నితీష్ వెళ్లిపోయారు

- మాకు ఆయన అవసరం లేదు
- మోడీ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచింది

పాట్నా : ఇండియా కూటమి నుండి వైదొలిగి బీజేపీతో చేతులు కలిపిన బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఒత్తిడి కారణంగానే ఆయన ఇండియా కూటమి నుండి వెళ్లిపోయారని, ఆయన అవసరం తమకు లేదని అన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా బీహార్‌లోని పూర్నియా జిల్లాలో మంగళవారం జరిగిన బహిరంగ సభలో రాహుల్ ప్రసంగిస్తూ నితీష్‌పై చలోక్తులు విసిరారు. ప్రమాణస్వీకారం అనంతరం తన శాలువాను తీసుకునేందుకు నితీష్ మళ్లీ రాజ్‌భవన్‌కు వెళ్లారంటూ జోక్ చేశారు. దశాబ్ద కాలంలో నితీష్ ఐదుసార్లు విధేయతలు మార్చుకున్నారని గుర్తు చేస్తూ 'నితీష్ రావడం చూసి గవర్నర్ ఆశ్చర్యపడ్డారు. మళ్లీ రాజ్‌భవన్‌కు ఎందుకొచ్చారని ఆయన్ని ప్రశ్నించారు' అని వ్యంగ్యంగా అన్నారు.

బీహార్‌లో మహా కూటమి సామాజిక న్యాయం కోసం



పోరాడుతుందని రాహుల్ చెప్పారు. ఈ విషయంలో తమకు నితీష్ అవసరం లేదని అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వంపై కూడా రాహుల్ నిప్పులు చెరిగారు. 2020లో ఆమోదించిన వ్యవసాయ బిల్లులను చీకటి చట్టాలుగా వర్ణించారు. రైతుల నుండి భూములు లాక్కొని అదానీ వంటి బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టారని విమర్శించారు. వ్యవసాయ చట్టాలను ప్రతిఘటించి అలుపెరుగని పోరాటం చేసిన అన్నదాతలను అభినందించారు. దేశంలో కులగణన ఆవశ్యకతను రాహుల్ నొక్కి చెప్పారు. 'మన సమాజంలో వెనుకబడిన తరగతులు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు ఉన్నారు. ఓబీసీల జనాభా అధికంగా ఉంది. అయితే ఓబీసీలు ఎంత మంది ఉన్నారని నేను ప్రశ్నిస్తే మీ దగ్గర సమాధానం లేదు' అని అన్నారు. రైతులను ఉద్దేశించి రాహుల్ ప్రసంగిస్తూ అన్నదాతల భూమిని పరిరక్షించే విషయంపై రాజకీయ నాయకులు మాట్లాడితే వారిపై మీడియా రాత్రింబవళ్లు దాడి చేస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘిస్తోందని, ఈ అంశాన్ని తాను పార్లమెంటులో లేవనెత్తగలనని, అయితే ప్రధాని ఏమైనా చేస్తారని మాత్రం గ్యారంటీ ఇవ్వలేనని అన్నారు. ఎరువులు, విత్తనాలు పొందడానికి రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో కోటీశ్వరులకు చెందిన 14 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం రైతుల రుణాలను రద్దు చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు 72 వేల కోట్ల రూపాయల మేర రైతు రుణాలను మాఫీ చేశామని గుర్తు చేశారు. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించామని రాహుల్ గుర్తు చేశారు.

నేడు స్టాఫ్ నర్సులకు నియామక పత్రాల అందజేత

అందుబాటులోకి రానున్న 6,956 మంది సేవలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రులు, గురుకుల విద్యాలయాలు, తదితర ప్రభుత్వ సంస్థల్లో 6,956 మంది స్టాఫ్ నర్సుల సేవలు అందుబాటులోకి రాను న్నాయి. బుధవారం హైదరాబాద్ ఎల్.బీ.స్టేడియంలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన నున్నారు. 7,094 ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రక్రియ చేపట్టినప్పటికీ ఆర్థోపెడిక్ ఛాలెంజ్‌డ్ కేటగిరీలో అభ్యర్థులు లేకపోవడంతో 138 పోస్టులు భర్తీ కాలేదు. దీంతో 6,956 మందికి నియామక పత్రాలను అందజేయనున్నారు. వీరిలో 5,571 మంది రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ సంచాలకుల పరిధిలో, 736 మంది తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో, మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీ పరిధిలో 253 మంది, తెలంగాణ మైనార్టీల రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలో 117 మంది, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలో 109 మంది, ఎంఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ, రీజినల్ క్యాన్సర్ సెంటర్ పరిధిలో81 మంది తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ (గురుకులం) పరిధిలో 68 మంది, తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషనల్ సొసైటీ పరిధిలో 13 మంది, వికలాంగులు, సీనియర్ సిటీజన్స్ సంక్షేమ శాఖ పరిధిలో ఎనిమిది మంది సేవలందించనున్నారు. వీరికి ప్రాథమిక వేతనం రూ.36,750తో పాటు డీఏ, హెచ్‌ఆర్‌ఏ తదితర అలవెన్సులుంటాయి. వీరి వేతనాల కోసం ప్రభుత్వం ప్రతి నెల రూ.35 కోట్లు వ్యయం చేయాల్సి ఉంటుంది. వీరి రాకతో రాష్ట్రంలోని 26 వైద్య కళాశాలలు, ఇతర స్పెషాలిటీ,జిల్లా, ఏరియా ఆస్పత్రులతోపాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఖాళీలు భర్తీ అవుతాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

45.97 శాతం బీసీలు

తాజా నియామకంలో వెనుకబడిన తరగతులకు చెందిన వారు 45.97 శాతం ఉన్నారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు 30.64, షెడ్యూల్డ్ తెగలకు చెందిన అభ్యర్థులు 12.81 శాతం ఉన్నారు. కొత్తగా నియమితులైన స్టాఫ్ నర్సుల్లో 88.16 మంది మహిళలు కాగా, 11.83 శాతం మంది మాత్రమే పురుషులున్నారు.



మహాత్మునికి సీఎం నివాళి

నవతెలంగాణ-మెహిదీపట్నం

మహాత్మా గాంధీ 76వ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహాత్మునికి నివాళులు అర్పించారు. మంగళవారం హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపు ఘాట్‌కు చేరుకున్న సీఎం.. మహాత్ముని స్మారక చిహ్నానికి పూలతో శ్రద్ధాంజలి ఘటించారు. బాపూఘాట్ ఆవరణలో గల గాంధీజీ విగ్రహానికి పూలు వేసి నివాళు లర్పించారు. అనంతరం సర్వమత ప్రార్థనల్లో సీఎం పాల్గొన్నారు. సీఎం వెంట రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా, ఇతర అధికారులు ఉన్నారు.

ఈ యేడాది రెండు బడ్జెట్లు..

లోక్‌సభ ఎన్నికలకు ముందొకటి.. ఆ తర్వాత మరోటి...

- మొదటిది ఓటాన్ అకౌంట్.. రెండోది పూర్తిస్థాయి బడ్జెట్
- ప్రతిపాదనలు పూర్తి... కసరత్తులు ముమ్మరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వమైనా, రాష్ట్ర ప్రభుత్వాలైనా యేడాదికి ఒకసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టటం ఆనవాయితీ. కానీ ఈసారి తెలంగాణ ప్రభుత్వం రెండు బడ్జెట్లను ప్రవేశపెట్టనుంది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఇలా రెండు పద్దులకు రూపకల్పన చేయాల్సి వస్తోంది. కేంద్ర ప్రభుత్వం సైతం లోక్‌సభ ఎన్నికలకు ముందు ఒక పద్దు, ఆ తర్వాత మరో పద్దును ప్రవేశపెట్టనుంది. అదే తరహాలో రేవంత్ సర్కార్ కూడా ఎన్నికలకు ముందు ఓటాన్ అకౌంట్‌ను, ఎలక్షన్ల తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్‌ను శాసనసభకు సమర్పించనుంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ ఫిబ్రవరిలో రానుంది. ఈ క్రమంలో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టటం సాధ్యం కాదు. అయితే వివిధ శాఖల నుంచి ప్రతిపాదనలను పూర్తి స్థాయిలో తీసుకుని, అందుకనుగుణంగానే పద్దును రూపొంది స్తున్నారు. కానీ ఎన్నికల నేపథ్యంలో జీతాలు, భత్యాలు, ఇతరత్రా నిర్వహణ ఖర్చుల (ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు) కోసం ఓటాన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టి, శాసనసభ అనుమతి తీసుకోనున్నారు. ఎన్నికల తర్వాత మరోసారి అన్ని శాఖల పద్దులను క్రోడీకరించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు.

గ్యారెంటీలన్నీ అప్పుడే...

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ప్రస్తుతానికి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిధి రూ.10 లక్షలకు పెంపు అమలవుతున్న సంగతి తెలిసిందే. మిగతా గ్యారెంటీల అమలు ఎన్నికల తర్వాతే ఉంటుందంటూ ఉన్నతాధికారులు చెబుతున్నారు. వాటిని అమలు చేయాలంటే నిధులు సమకూర్చుకోవాలి, నియమ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుంది. ఆ తర్వాత అధికార యంత్రాంగమంతా క్షేత్రస్థాయిలోకి దిగి, లబ్దిదారులను ఎంపిక చేయాలి. ఇప్పటికే ప్రజా పాలన పేరిట దరఖాస్తులను స్వీకరించినప్పటికీ వాటి పరిశీలనకు మరింత సమయం పట్టే అవకాశముంది. అందువల్ల మిగతా గ్యారెంటీలన్నీ అమలు కావాలంటే లోక్‌సభ ఎన్నికలు అయ్యేంత వరకూ వేచి చూడక తప్పదని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే గెలిచిన వంద రోజుల్లోగా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామంటూ కాంగ్రెస్ హామీనిచ్చింది. కానీ లోక్‌సభ ఎన్నికల నాటికి ఈ గడువు పూర్తయితే... వాగ్దాన భంగం కలుగుతుందనే చర్చ కొనసాగుతున్నది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ ఇప్పటికే ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని పట్టుబడుతోంది.

లోక్‌సభ ఎన్నికల కోడ్, ఓటాన్ అకౌంట్ పేరిట హామీలను విస్మరించకూడదంటూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేసి తీరతామంటూ చెబుతున్న ప్రభుత్వం... అందుకోసం ఎలాంటి వ్యూహాన్ని అమలు చేయబోతున్నదో చూడాలి. ఆర్థిక వేత్తలు, నిపుణులు మాత్రం...'కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలు' అనేవి అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించినవి కాబట్టి, అవి 'ఆన్ గోయింగ్' పరిధిలోకి వస్తాయి...' అని చెబుతున్నారు. అందువల్ల ఆయా పథకాలకు నిధులు కేటాయిస్తే, వాటిని అమలు చేయ టానికి ఎలాంటి ఇబ్బందులూ ఉండబోవని అభిప్రాయ పడుతున్నారు. అయితే ఇది పూర్తిగా ప్రభుత్వ నిర్ణయం మీదనే ఆధారపడ ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

గద్దర్ విగ్రహం ఏర్పాటుకు సర్కారు అనుమతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా గాయకులు గద్దర్ విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు తెల్లాపూర్ మున్సిపాల్టీ చేసిన తీర్మానాన్ని హెచ్‌ఎండీఏ ఆమోదించింది. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం, తెల్లాపూర్‌లో విగ్రహం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తూ రాష్ట్ర పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.



బీజేపీ పాలనలో కార్మికులకు తీవ్ర అన్యాయం

- సెస్ యాక్టు సవరణతో కార్మిక సంక్షేమ నిధికి గండి
- సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు

నవతెలంగాణ - మట్టెవాడ

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక చర్యలతో అన్ని రంగాల కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ మంగళవారం వరంగల్ జిల్లా ఉర్సుగుట్ట వద్ద రామ సురేందర్ భవన్‌లో గౌరవ అధ్యక్షులు వంగూరి రాములు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాయబాబు మాట్లాడుతూ.. 1979 అంతరాష్ట్ర వలస కార్మికుల చట్టం, 1996 భవన నిర్మాణ కార్మికుల సమగ్ర కేంద్ర చట్టాన్ని రక్షించాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని తదితర డిమాండ్లతో దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. సెస్ యాక్ట్‌ను 2020లో సవరణ చేయటం వల్ల కార్మిక సంక్షేమ నిధికి గండి పడిందన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా లబ్ది పొందుతున్న భవన నిర్మాణ కార్మికుల పొట్టగొట్టిందన్నారు. ఫిబ్రవరి 16న ఆల్ ట్రేడ్ యూనియన్స్ చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ భాగస్వామ్యం అవుతుందని చెప్పారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 54 రకాల భవన నిర్మాణ కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని, దీనివల్ల కార్మిక హక్కులు హరించబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక మోడీ ప్రభుత్వాన్ని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గద్దె దించడానికి విస్తృత ప్రచారం నిర్వహించాలని, ఫిబ్రవరి 16న సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే, 2023లో ఫెడరేషన్ తీసుకున్న కర్తవ్యాల అమలుపై వివరించారు. చేపట్టిన కార్యక్రమాలపై వివిధ జిల్లాల ప్రతినిధులు చర్చలు జరిపి నివేదికను ఆమోదించారు. ఈ వర్క్‌షాప్‌లో ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముదాం శ్రీనివాస్, రాష్ట్ర కోశాధికారి ఎలుక సోమయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.లక్ష్మయ్య, బి.శ్రీనివాసులు, వి.గాలయ్య, టి.ఉప్పలయ్య, గార కోటేశ్వరరావు, జె.వెంకన్న, రాష్ట్ర సహాయ కార్యదర్శిలు అనంతగిరి రవి, సీఐటీయూ వరంగల్ జిల్లా కార్యదర్శి ముక్కర రామస్వామి, నారాయణ, కె.జంగయ్య, గౌరిగి సోములు, యు.నరసింహారావు, ఎద్ల రమేష్, ఎస్.రేణుక, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సారూ..కనీస వేతనాలను సవరించండి

సమాన పనికి సమాన వేతనం ఇప్పించేలా చూడండి

- డీసీఎల్ పోస్టులు భర్తీ చేయాలి.. కార్మిక శాఖను బలోపేతం చేయాలి :
- సీఎం రేవంత్‌రెడ్డికి సీఐటీయూ బృందం వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో 15 ఏండ్లుగా 75 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలను సవరించలేదనీ, మీరైనా సవరించి కార్మికులకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని సీఐటీయూ రాష్ట్ర బృందం కోరింది. సమాన పనికి సమాన వేతనం ఇప్పించేలా చూడాలని విజ్ఞప్తి చేసింది. కార్మిక శాఖలోని డీసీఎల్‌తో పాటు ఇతర పోస్టులను భర్తీ చేసి కార్మిక శాఖను బలోపేతం చేయాలని విన్నవించింది. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితో కలిసి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. సీఎం పదవిని చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న కీలక



సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. 15 ఏండ్లుగా కనీస వేతనాలను సవరించకపోవడం వల్ల కార్మికుల కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం కనీస వేతనాలు పెంచుతూ విడుదల చేసిన జీఓలను కూడా పారిశ్రామికవేత్తల ఒత్తిడితో అమలు చేయకుండా పెండింగ్‌లో పెట్టిన విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కార్మిక వర్గానికి తీవ్ర నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను తెలంగాణలో అమలు చేయబోమని చెబుతూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. 2012లో ఐదు రంగాలకు రూ.18 వేల కనీస వేతనంతో ఇచ్చిన ఫైనల్ నోటిఫికేషన్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి - సమాన వేతనం ఇవ్వాలని విన్నవించారు. నూతన పెన్షన్ స్కీమ్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ సమస్యలు, స్కీమ్ వర్కర్లలో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, ఐకేపీ, ఉపాధి హామీ తదితర స్కీమ్ ఉద్యోగుల జీతాలు పెంచాలని సీఎంని కోరారు.

గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీలు, జీహెచ్‌ఎంసీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల నుంచి బిల్ కలెక్టర్ల వరకు ప్రభుత్వమే నేరుగా వేతనాలివ్వాలనీ, జీవో నెంబర్ 51ని సవరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, పశుమిత్రలు, స్కూల్ స్వీపర్లు తదితరుల డిమాండ్లు వినతిపత్రంలో ప్రస్తావించామని చెప్పారు.

వైద్యారోగ్య శాఖలోని కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనీ, 142, 317 జీఓలను సవరించాలని కోరారు. యూనివర్సిటీ నాన్‌టీచింగ్ సిబ్బంది వేతనాలు పెంచాలని కోరారు. ఆర్టీసీని విస్తరించడంతో పాటు ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి కార్మికుల సొంతింటి కలను నెరవేర్చాలనీ, విద్యుత్ రంగంలో ఆర్టిజన్స్ అందరికీ కన్వర్షన్ ఇవ్వాలని విన్నవించారు. భవన నిర్మాణ రంగం మాదిరిగా ట్రాన్స్‌పోర్ట్, హమాలీ, బీడీ తదితర రంగాల కార్మికులకు వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పవర్‌లూమ్ కార్మికులకు, సెక్యూరిటీ గార్డులు, గిగ్ కార్మికులు, తదితరులకు చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్మికుల సమస్యలు విన్న తర్వాత సీఎం సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత కార్మిక శాఖ అధికారులతో చర్చించి న్యాయం చేస్తామని సీఎం హామీనిచ్చారని తెలిపారు.

సంపాదకీయం

కర్రపెత్తనం

మారణహోమాలు, మాయోపాలు సృష్టించి కుర్చీని కాపాడుకోవడమే తన లక్ష్యంగా పెట్టుకున్న మోడీ ఏ రాష్ట్రంలో ఎలాంటి చిచ్చుకు తెరలేపుతాడో, ఏ రాష్ట్రంపై ఎప్పుడు తన ప్రతాపాన్ని చూపిస్తాడో ఊహించడం కాస్త కష్టమే. అందుకే 'అప్రమత్తంగా లేకుంటే నేడు మణిపూర్‌లో జరుగుతున్న హింసే రేపు కేరళలోనూ జరగవచ్చు' అని ఆర్థిక రాజకీయవేత్త పరకాల ప్రభాకర్ అన్న మాటల్లో ఏ మాత్రం అతిశయోక్తి లేదనిపిస్తుంది. కాబట్టే అప్రమత్తంగా ఉండమంటూ కొచ్చి వేదికగా ఆయన దేశాన్ని హెచ్చరించి వుంటారు. ఇటీవల కేరళ ఆర్థిక వ్యవస్థపై మోడీ ప్రభుత్వం చూపిస్తున్న నిరంకుశత్వమే దీనికి నిదర్శనం.

> అధికారం కోసం దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను, లౌకికత్వాన్ని మోడీ ప్రభుత్వం నాశనం చేస్తుందనేది జగమెరిగిన సత్యం. మనది ఫెడరల్ వ్యవస్థ. కేంద్రం, రాష్ట్రాల మధ్య సామరస్యం ఉంటేనే ఇది బతికి బట్టకడుతుందని మన రాజ్యాంగ నిర్మాతలు ఆనాడే చెప్పారు. రాష్ట్రాలు లేని కేంద్రం కేవలం ఓ మిథ్య. కానీ ఈ విషయాలన్నీ మరిచి రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నారు మన మోడీగారు. ఈ విధానాల ఫలితంగా రాష్ట్రాలు తమ హక్కులను కోల్పోతున్నాయి. దేశంలో శాంతి కనుమరుగైపోతోంది.

రాజును ప్రశ్నిస్తే నాలుక చీల్చేస్తాడు. ఇక ఎదురు తిరిగితే... మరణం తథ్యం. కోటగుమ్మానికి తల వేలాడదీస్తాడు. ఇది రాజరికంలో అనుసరించిన విధానాలు. కానీ నేటి మన రాజు నాలుకలు చీల్చకుండానే, తలలు నరక్కుండానే ప్రజాస్వామ్యాన్ని జీవచ్ఛవం చేసే కృషి సీరియస్‌గా చేస్తున్నాడు. రాజ్యాంగ విలువలను గంగలో కలిపేసి తనను ప్రశ్నిస్తున్న రాష్ట్రాలపై కక్షసాధింపుకు కాలు దువ్వుతున్నాడు. కాదు.. కాదు.. ఆయా రాష్ట్రాల ప్రజల గొంతు కోస్తున్నాడు. గత పదేండ్లుగా ప్రజలు దీన్ని గమనిస్తూనే ఉన్నారు. అసలు రాజ్యాంగాన్నే తమకు అనుకూలంగా మార్చేసుకోవాలని చూస్తున్న మన పెద్దమనిషి దాని విలువలు కాపాడతాడనుకోవడం భ్రమే అవుతుంది.



మొన్నటికి మొన్న ప్రధాని మోడీ రాష్ట్ర ప్రభుత్వాలను తనకు డబ్బు ఇవ్వడానికి ఏటీఎంలుగా మార్చుకున్నారని తమిళనాడు సీఎం స్టాలిన్ మీడియా ముందు వాపోయారు. అంతేకాదు విపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు నిధులు రాకుండా ఆపేస్తున్నారని కూడా చెప్పారు. పైగా కేంద్ర ప్రభుత్వ నిధులన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలకే మళ్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తమిళనాడులో భారీ ప్రకృతి విపత్తు వచ్చి ప్రజలు అల్లాడిపోయారు. సాయం కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం నోరు తెరిచి అడిగినా రాజుగారు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదంటే కక్షసాధింపులు ఏ స్థాయికి చేరాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనేలేదు. అయినా మన రాజుగారికి దేవుడిపై ఉన్నంత ప్రేమ ప్రజలపై ఎందుకుంటుందీ..! అందుకే మణిపూర్ ప్రజలు మాడిపోతున్నా, తమిళనాడు ప్రజలు మునిగిపోతున్నా ఆయన హాయిగా రాముని ప్రచారంలో తరించాడు.

ఇక తాజాగా కేరళ అభివృద్ధికి కేంద్రం అడ్డుకట్ట వేస్తుందని లెక్కలతో సహా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నవ కేరళ నిర్మాణానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే అందుకు కేంద్రం అనుసరిస్తున్న విధానాలు అడ్డంకిగా మారాయి. న్యాయంగా ఆ రాష్ట్రానికి రావాల్సిన రుణ పరిమితిని కూడా తగ్గించేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 280 ప్రకారం ఏర్పడిన ఆర్థిక సంఘం సిఫార్సులను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పక్కనపెట్టేసి కేరళ అభివృద్ధికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేస్తోంది. అందుకే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు మంత్రి వర్గం, ఎమ్మెల్యేలు జంతర్‌మంతర్ వద్ద ఫిబ్రవరిలో భారీ ధర్నాకు సిద్ధం కాబోతున్నారు.

ఈ విధంగా మన రాజుగారు తన ఆధీనంలో లేని ఆయా రాష్ట్రాలను ఎలాగైనా చెప్పుచేతల్లోకి తెచ్చుకోవాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు. మొన్నటి వరకు అందుకు రాజ్‌భవన్‌లను వేదికగా మార్చుకున్నాడు. గవర్నర్లను ఉపయోగించి చేసిన కొన్ని అక్కసు పనులనూ చూశాం. వీసీల నియామకంలో జరిగిన వార్‌నూ చూశాం. చివరకు కోర్టు మొట్టికాయలు వేస్తే తప్ప, దారికి రాలేదు. అలాగే ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని ఎన్ని ఇబ్బందులు పెట్టాడో కళ్లారా కన్నాం. ఈ నిరంకుశత్వాన్ని భరించలేక సుమారు ఎనిమిది రాష్ట్రాల ముఖ్యమంత్రులు మోడీపై మండిపడ్డారు. వారి ధాటిని తట్టుకోలేక కాస్త తోకముడిచినట్టు అగుపించినా తన ప్రతాపాన్ని ఏదో ఒక రూపంలో చూపిస్తూనే ఉన్నాడు.

ఏదిఏమైనా తన అధికారం కోసం దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను, లౌకికత్వాన్ని మోడీ ప్రభుత్వం నాశనం చేస్తుందనేది జగమెరిగిన సత్యం. మనది ఫెడరల్ వ్యవస్థ. కేంద్రం, రాష్ట్రాల మధ్య సామరస్యం ఉంటేనే ఇది బతికి బట్టకడుతుందని మన రాజ్యాంగ నిర్మాతలు ఆనాడే చెప్పారు. రాష్ట్రాలు లేని కేంద్రం కేవలం ఓ మిథ్య. కానీ ఈ విషయాలన్నీ మరిచి రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నారు మన మోడీగారు. ఈ విధానాల ఫలితంగా రాష్ట్రాలు తమ హక్కులను కోల్పోతున్నాయి. దేశంలో శాంతి కనుమరుగైపోతోంది. ఈ నిరంకుశత్వం ఇలాగే కొనసాగితే రాబోయే కాలంలో రాష్ట్రాల స్వయంప్రతిపత్తికి పెను ప్రమాదం తప్పదు. ఈ నియంతృత్వ రాజు నుండి దేశాన్ని, రాజ్యాంగాన్ని తద్వారా రాష్ట్రాల హక్కులను, మన ఫెడరల్ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు ప్రజలదే.

చావుబతుకుల మధ్య ప్రపంచీకరణ - దావోస్ సందేశమిదేనా?


ఎం కోటేశ్వరరావు
8331013288

వాణిజ్య, రాజకీయ, మేధావులు, సమాజంలోని ఇతర నేతల ప్రమేయంతో ప్రపంచ పరిస్థితిని మెరుగుపరిచేందుకు, ప్రపంచ, ప్రాంతీయ, పరిశ్రమల అజెండాలకు ఒక రూపమిచ్చేందుకు ప్రపంచ ఆర్థిక వేదికను ఏర్పాటు చేసినట్లు ఐదు దశాబ్దాల క్రితం స్థాపకులు పేర్కొన్నారు. తొలుత ఐరోపా యాజమాన్య వేదికగా 1971లో ప్రారంభమైన ఈ స్వచ్ఛంద సంస్థ తరువాత 1987లో ప్రపంచ ఆర్థిక వేదికగా పేరు మార్చుకుంది. ఈ ఏడాది జనవరి 15 నుంచి 19 వరకు జరిగిన 54వ వార్షిక సమావేశాలలో పాల్గొన్నవారి వివరాలు చూస్తే అది ఎవరికి ప్రాతినిధ్యం వహిస్తుందో అర్థం చేసుకోవటం కష్టమేమీ కాదు. ప్రపంచంలోని వివిధ రంగాలలో వెయ్యి బడా కంపెనీల ప్రతినిధులు ఈ సంస్థ సభ్యులు. హాజరైన వారిలో 925 మంది కంపెనీల సిఇఓలు కాగా వారిలో 254 మంది ఒక్క అమెరికా నుంచే వచ్చారు. వీరుగాక వాణిజ్య సంస్థల ప్రతినిధులుగా మరో 799 మంది, 225 మంది అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, 60 మంది వివిధ దేశాల నేతలు, మరో 851 మంది ఇతరులు వెళ్లారు. గతంలో చంద్రబాబు నాయుడు, కేటీఆర్, తాజాగా ఎనుముల రేవంత్‌రెడ్డి వెళ్లి వచ్చిన తరువాత పెట్టుబడుల మీద ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. అంటే అది వాణిజ్య, పరిశ్రమల ప్రతినిధుల క్లబ్, దాని సమావేశాలు జరిగే స్విడ్జర్లాండ్‌లోని దావోస్ ఒక విహార కేంద్రం. ఈ క్లబ్‌లో వ్యక్తులుగా సభ్యులుగా చేరాలంటే ఏడాదికి 52వేల డాలర్లు (మన కరెన్సీలో రూ.43లక్షలు), పరిశ్రమల భాగస్వామిగా 2.63లక్షలు (రూ. 2.18 కోట్లు), వ్యూహాత్మక భాగస్వామిగా 6.20లక్షల (రూ.5.21 కోట్లు) డాలర్ల వంతున చెల్లించాలి.

ఐదు దశాబ్దాల తరువాత జరిగిన సమావేశ తీరుతెన్నులు, స్పందనల్ని చూస్తే వేదిక స్థాపక లక్ష్యం నెరవేరిందా అంటే అవునని చెప్పటం కష్టం. అంతర్జాతీయ అస్థిరతకు దోహదం చేసే తీవ్రమైన వాతావరణంలో దావోస్ వార్షిక సమావేశాలు జరుగుతున్నట్లు పోప్ ఫ్రాన్సిస్ తన సందేశంలో పేర్కొనటం గమనించాల్సిన అంశం. మరింత నైతికపరమైన ప్రపంచీకరణ కోసం పని చేయాలని అది తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ ఏడాది భౌగోళిక రాజకీయాలు అస్థిరంగా ఉండటమే కాదు, దాదాపు 50దేశాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ సందర్భంగా తప్పుడు సమాచార ముప్పు ఉందని, వాటిలో మనదేశం తొలిస్థానంలో ఉన్నట్లు సమావేశాల సందర్భంగా విడుదల చేసిన సర్వే హెచ్చరించింది. మరోవైపు అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ మరోసారి గద్దెనెక్కనున్నారని అనేకమంది

> ప్రపంచీకరణ అంతం గురించి మిశ్రమ అభిప్రాయాలు వెల్లడవుతున్నప్పటికీ దానికి వ్యతిరేకమైన, నిరాశాజనక అభిప్రాయాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రపంచీకరణను ముందుకు తీసుకుపోవాలని, ప్రపంచ వాణిజ్య నిబంధనలను పాటించాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నది ప్రస్తుతం ఒక్క చైనా మాత్రమే. ధనిక దేశాలు తమ కోసం ఆ విధానాన్ని ముందుకు తెచ్చినప్పటికీ గరిష్ఠంగా లబ్దిపొందింది చైనా మాత్రమే. మిగిలిన దేశాలన్నీ రక్షణ పేరుతో అడ్డు గోడలు కడితే అది చైనాకూ నష్టమే గనుక ఎలాంటి ఆటంకాలు లేని ప్రపంచీకరణ కావాలని చైనా కోరుతోంది. అది తనకు నష్టదాయకం అని భావించినపుడు వ్యతిరేకిస్తుందన్నది వేరే చెప్పనవసరం లేదు.

భావిస్తున్నప్పటికీ అమెరికా నుంచి కూడా ఉత్సాహంగా ప్రతినిధులు రాలేదు. అమెరికా, ఇతర ధనిక దేశాల విధానాలు ఎలా ఉంటాయో తెలియని స్థితిలో చైనా, భారత్ వంటి దేశాల నేతలు కూడా హాజరు కాలేదు. ఈ ఏడాది జరిగిన సమావేశాల తీరుతెన్నుల గురించి మాట్లాడుతూ "సమస్యలను గుర్తించటానికి దావోస్ ఒక మంచి ప్రదేశం తప్ప వాటిని పరిష్కరించటానికి అంత మంచిది కాదు" అని మార్క్ మలోచ్ బ్రౌన్ అనే బ్రిటీష్ ప్రముఖుడు చేసిన వ్యాఖ్య వర్తమాన ప్రపంచ కార్పొరేట్ రంగం, పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభానికి, ప్రారంభ లక్ష్యాలకు అసలు ఈ సంస్థ ఎంత దూరంగా ఉందో అర్థం పడుతున్నది. ఇంకా అనేకమంది భిన్నమైన అభిప్రాయాలను, అంచనాలను కూడా వెల్లడించారు. గడచిన మూడున్నర దశాబ్దాలలో ప్రతి దేశం లేదా కొన్ని దేశాల కూటములు రక్షణాత్మక చర్యలకు ఎక్కువగా పూనుకుంటున్నాయి తప్ప ప్రపంచీకరణ లక్ష్యానికి అనుగుణంగా పని చేయటం లేదు. ఈ కారణంగా దానికి భిన్నమైన పరిణామాలు జరగటం ఆందోళన కలిగిస్తోందని గతేడాది ప్రపంచబ్యాంకు చెప్పింది. ఐరోపాలో అభివృద్ధి గిడసబారింది, దిగుమతి చేసుకొనే దేశాల్లో పరిస్థితులు బాగోలేవు గనుక చైనా వస్తువులు ఎగుమతి సమస్యలను ఎదుర్కొంటున్నాయి. అయితే ఎలక్ట్రిక్ వాహనరంగంలో అగ్రదేశాలకు సవాలు విసురుతున్నది. రష్యా నుంచి వచ్చే చౌక గ్యాస్ మీద ఆధారపడి నిర్మితమైన జర్మనీ ఆర్థిక వ్యవస్థ ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా సమస్యలను ఎదుర్కొంటున్నది. రక్షణాత్మక చర్యలు, ప్రతిచర్యల్లో భాగంగా సరఫరా గొలుసులు ఏమౌతాయో తెలియదు. రక్షణాత్మక చర్యల్లో భాగం పెంచిన వడ్డీ రేట్లు అంతే వేగంగా తగ్గుతాయని ఎవరూ భావించటం లేదు.



అమెరికా-చైనాల మధ్య 2018 నుంచి వాణిజ్యపోరు కొనసాగుతున్నప్పటికీ అనేక మంది భావించినట్లు అది తీవ్రం కాలేదు గాని స్థిరపడిందని చెప్పవచ్చు. ఎవరికి ఉండే సమస్యలు వారికి ఉండటమే కారణం. తాము సృష్టించిన ఉక్రెయిన్ సంక్షోభం నుంచి పశ్చిమ దేశాలు ఎలా బయటపడాలో అర్థంకాని స్థితిలో ఉన్నాయి. ఇదే సమయంలో మధ్య ప్రాచ్యంలో పెట్టిన పితలాటకంతో తలెత్తిన సంక్షోభం ఎంతకాలం కొనసాగుతుందో, ఏమలుపులు తిరుగుతుందో తెలియటం లేదు. దాని ప్రభావం ప్రపంచం మీద పడే సూచనలు కనిపిస్తున్నాయి. పాలస్తీనా రాజ్య ఏర్పాటు అనే అంతిమ పరిష్కారం కుదరాలని అరబ్బుదేశాలు కోరుతున్నాయి. గాజాపై ఇజ్రాయిల్ దాడులను నిలిపివేసేంతవరకు ఎర్రసముద్రంలో హౌతీలు నౌకలపై దాడులను కొనసాగిస్తూనే ఉంటారని దవోస్ సమావేశాల్లో ఇరాన్, ఎమెన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఎక్కువ దూరం ప్రయాణించాల్సి రావటంతో చమురు, గ్యాస్ రవాణాకు టాంకర్ల కొరత ఏర్పడే అవకాశం ఉందని సౌదీ అరామకో కంపెనీ సిఇవో చెప్పాడు. చమురు ధరలు పెరుగుతాయనే హెచ్చరికలు సరేసరి. ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలు ధనికదేశాల ఇబ్బందులను మరింత పెంచేవిగా ఉన్నాయి. ఎర్ర సముద్రం బదులు ఆసియా నుంచి ఐరోపాకు సరకులు ఎగుమతి కావాలంటే ఆఫ్రికా ఒక చివరి అంచు గుడ్‌హోప్ అగ్రం నుంచి చుట్టి రావాలంటే ఒక ఓడకు కనీస ఏడు రోజులు అదనంగా పట్టటంతో పాటు అదనంగా మిలియన్ల డాలర్ల ఖర్చు అవుతుంది. ఇప్పటికే అది కనిపిస్తోంది. ఈ పూర్వరంగంలో జరిగిన దావోస్ సమావేశాలు ఏ ఒక్క సమస్యకూ పరిష్కారాన్ని సూచించలేకపోయాయి. ప్రపంచమంతటా ఇప్పుడు కృత్రిమ మేధ గురించి చర్చ జరుగుతున్నది. దీన్లో మంచి చెడూ రెండూ ఉన్నాయి. దాన్ని జనం కోసం ఉపయోగిస్తే మంచి జరుగుతుంది, కార్పొరేట్ల లాభాల కోసం అమలు జరిపితే ఉద్యోగులకు జరిగే మంచేమిటో తెలియదు గానీ నలభై శాతం వరకు ఉద్యోగాలు పోతాయని ఐఎంఎఫ్ వంటి సంస్థలు హెచ్చరించాయి. పర్యావరణాన్ని కాపాడే హరిత ఇథనం, కృత్రిమ మేథకు ఐదేండ్ల క్రితం ఐదు వందల కోట్ల డాలర్లు ఖర్చు చేస్తే గతేడాది 1.8లక్షల కోట్లకు పెరిగింది, ఈ దశాబ్ది చివరికి నాలుగు లక్షల కోట్ల డాలర్లు అవసరం కావచ్చని అంచనా.

వలసవాదం రూపం, పేరు మార్చుకుంది. దేశాలను స్వాధీనం ఆక్రమించుకోవటం కుదరదు గనుక రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచీకరణ పేరుతో మార్కెట్లను ఆక్రమించుకొనేందుకు పూనుకున్నారు. అర్జెంటీనాలో ఇటీవలే అధికారానికి వచ్చిన జేవియర్ మిలై అనే పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేకి దావోస్ ప్రధాన వేదిక మీద దహనకాండకు దివిటీలు పట్టుకు వచ్చిన దుండగుడి మాదిరి ప్రవర్తించినట్లు వార్తలు వచ్చాయి. రాజ్య జోక్యం చేసుకోవాలని ప్రతిపాదించే వారిమీద విరుచుకుపడ్డాడు. స్వేచ్ఛా

> గతేడాది సమావేశాల్లో జీవనవ్యయ సంక్షోభం, ప్రకృతి పరమైన ముప్పు, భౌగోళిక ఆర్థిక వైరుధ్యాల వంటి అంశాలు ప్రధాన చర్చనీయాంశాలుగా ఉంటే ఈ ఏడాది ప్రపంచం ఎదుర్కొంటున్న ముప్పుల్లో తప్పుడు సమాచారవ్యాప్తి అని పదిహేను వందల మంది వివిధ రంగాల ప్రముఖులతో జరిపిన సర్వే ఒక ముఖ్యాంశం.

వాణిజ్య పెట్టుబడిదారీ విధానమే ఆకలి, దారిద్ర్యాలను అంతం చేస్తుందని చెప్పాడు. ఏడు దశాబ్దాల తరువాత "ప్రపంచీకరణ అంతరించిందా అన్నది దావోస్‌లో పెద్ద వెతుకులాట" అన్న శీర్షికతో అల్ జజీరా మీడియా ఒక విశ్లేషణ ప్రచురించింది. గతంలో పెట్టుబడి నిర్ణయాల మీద వాణిజ్య ఖర్చు అనే అంశం ప్రధానంగా ఉండేది. అలాంటిది ఇప్పుడు భౌగోళిక రాజనీతి, జాతీయ భద్రత, ప్రభుత్వాల విధాన నిర్ణయాలను బట్టి నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తోంది. టింగ్‌లాంగ్ డెయ్ అనే ప్రపంచీకరణ నిపుణుడు మాట్లాడుతూ ప్రపంచీకరణ ఇంకా చావలేదు గానీ బతికేందుకు పోరాడుతోంది అన్నాడు. వస్తు, సేవల స్వేచ్ఛా వాణిజ్యం తీవ్రమైన పరిమితులకు లోనౌతుంది. పశ్చిమ దేశాలలో స్వేచ్ఛ పెరగవచ్చుగానీ చైనా, రష్యా, వంటి దేశాలతో పెట్టుబడులు, ఎగుమతి దిగుమతులు పరీక్షలకు గురౌతాయి అన్నాడు.

> ప్రపంచీకరణ అంతం గురించి మిశ్రమ అభిప్రాయాలు వెల్లడవుతున్నప్పటికీ దానికి వ్యతిరేకమైన, నిరాశాజనక అభిప్రాయాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రపంచీకరణను ముందుకు తీసుకుపోవాలని, ప్రపంచ వాణిజ్య నిబంధనలను పాటించాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నది ప్రస్తుతం ఒక్క చైనా మాత్రమే. ధనిక దేశాలు తమ కోసం ఆ విధానాన్ని ముందుకు తెచ్చినప్పటికీ గరిష్ఠంగా లబ్దిపొందింది చైనా మాత్రమే. మిగిలిన దేశాలన్నీ రక్షణ పేరుతో అడ్డు గోడలు కడితే అది చైనాకూ నష్టమే గనుక ఎలాంటి ఆటంకాలు లేని ప్రపంచీకరణ కావాలని చైనా కోరుతోంది. అది తనకు నష్టదాయకం అని భావించినపుడు వ్యతిరేకిస్తుందన్నది వేరే చెప్పనవసరం లేదు.

ప్రపంచీకరణ అంతం గురించి మిశ్రమ అభిప్రాయాలు వెల్లడవుతున్నప్పటికీ దానికి వ్యతిరేకమైన, నిరాశాజనక అభిప్రాయాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రపంచీకరణను ముందుకు తీసుకుపోవాలని, ప్రపంచవాణిజ్య నిబంధనలను పాటించాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నది ప్రస్తుతం ఒక్క చైనా మాత్రమే. ధనిక దేశాలు తమ కోసం ఆ విధానాన్ని ముందుకు తెచ్చినప్పటికీ గరిష్ఠంగా లబ్దిపొందింది చైనా మాత్రమే. మిగిలిన దేశాలన్నీ రక్షణ పేరుతో అడ్డుగోడలు కడితే అది చైనాకూ నష్టమే గనుక ఎలాంటి ఆటంకాలు లేని ప్రపంచీకరణ కావాలని చైనా కోరుతోంది. అది తనకు నష్టదాయకమని భావించినపుడు వ్యతిరేకిస్తుందన్నది వేరే చెప్పనవసరం లేదు. ఈ ఏడాది దావోస్ సమావేశాల పట్ల పెద్దగా ఆసక్తి కనపరచలేదు. జీ7 ధనిక దేశాల కూటమిలో తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్న జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ షుల్జ్ ఒక్కడే హాజరయ్యాడు. మిగిలిన వారంతా ముఖం చాటేయటానికి కారణం అక్కడ తేలేదేమీ ఉండదని స్పష్టంగావటమే. మొత్తం మీద చూస్తే అమెరికా ప్రతినిధులే ఎక్కువగా ఉన్నప్పటికీ గతంతో పోల్చితే చాలా తక్కువ మంది వచ్చారు. చైనాలో వేతనాలు, ఇతర ఉత్పత్తి ఖర్చులు పెరుగుతున్నందున యాపిల్ వంటి కంపెనీలు కొంతమేరకు తమ ఉత్పత్తి కేంద్రాలను వియత్నాం, భారత్‌లకు తరలిస్తున్నాయి (ఇది ప్రపంచీకరణ ఇంకా కొనసాగటానికి నిదర్శనం అని చెప్పేవారు ఉన్నారు) తప్ప అమెరికా లేదా ఐరోపా దేశాలకు కాదు. అక్కడ చౌకధరలకు ఉత్పత్తి చేయలేవన్నది స్పష్టం. చైనాతో పోల్చితే వేతనాలు తక్కువగా ఉండటం, స్థిరమైన విధానాలను అమలు జరిపే కమ్యూనిస్టు ప్రభుత్వం ఉన్న కారణంగా విదేశీ పెట్టుబడులు భారీఎత్తున వియత్నాం చేరుతున్నాయి. తమ దేశాన్ని 2050 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తామని, అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆ దేశ నేతలు చెబుతున్నారు. ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషన్ రాయబారి ఎమి మహమ్మద్ మాట్లాడుతూ పరిగణనలోకి తీసుకోవాల్సిన అసలైన ప్రశ్న ప్రపంచాన్ని మార్చటం అన్న సమస్య కాదు, ప్రతిరోజూ మనం ప్రపంచాన్ని మారుస్తూనే ఉన్నాం, ఆ మార్పు మంచికి దోహదం చేస్తున్నదా అన్నదే ప్రశ్న అన్నాడు. గతేడాది సమావేశాల్లో జీవనవ్యయ సంక్షోభం, ప్రకృతిపరమైన ముప్పు, భౌగోళిక ఆర్థిక వైరుధ్యాల వంటి అంశాలు ప్రధాన చర్చనీయాంశాలుగా ఉంటే ఈ ఏడాది ప్రపంచం ఎదుర్కొంటున్న ముప్పుల్లో తప్పుడు సమాచారవ్యాప్తి అని పదిహేను వందల మంది వివిధ రంగాల ప్రముఖులతో జరిపిన సర్వే ఒక ముఖ్యాంశం.

హైకోర్టు నిర్మాణానికి అగ్రియూనివర్సిటీ భూములు-వివాదమెందుకు?


టి.నాగరాజు
9490098292

రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీల భూములు యథేచ్ఛగా అన్యాక్రాంతమవుతున్నాయి. రాష్ట్ర రాజధాని ఉస్మానియా భూములను అనేక అవసరాలకు ప్రభుత్వం వాడుతోంది. ప్రయివేటు వ్యక్తులూ కబ్జాలు చేస్తున్నారు. ఉస్మానియావర్సిటీ భూములే కాదు, తెలంగాణ, కాకతీయ, హెచ్.సి.యు భూములు కూడా ఆక్రమణకు గురవుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం రాజేంద్రనగర్‌లో అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను హైకోర్టు నిర్మాణం కోసం వంద ఎకరాలు కేటాయించింది. నూతన హైకోర్టు నిర్మాణానికి ఎవరైనా మద్దతు ఇవ్వాల్సిందే కానీ ప్రభుత్వం రాష్ట్ర వ్యవసాయ అభివృద్ధి కోసం 1964లో ఏర్పాటు చేసిన యూనివర్సిటీ ప్రయోజనాలు కాకుండా మరో కోణంలో ఆలోచిస్తోంది. హైకోర్టు నూతన భవనం నిర్మాణం కోసం కనీసం యూనివర్సిటీ అభిప్రాయం కూడా తీసుకోలేదు. వంద ఎకరాల భూమిని హైకోర్టు కోసం కేటాయిస్తూ జీవో నెం 55 తీసుకొచ్చింది. ఈ జీవో ప్రకారం ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ నుండి 42.5, కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన యూనివర్సిటీ నుండి 57.5 మొత్తంగా వంద ఎకరాల భూమిని తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయాన్ని, జీవోను వ్యతిరేకిస్తూ విద్యార్థులు గత 15 రోజుల నుండి ఆందోళన చేస్తున్నారు.

ఎందుకీవివాదం?


నూతన హైకోర్టు భవన నిర్మాణానికి భూమి అవసరమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముఖ్యమంత్రికి లేఖ రాయడంతో ఆయన తక్షణమే నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం కనీసం యూనివర్సిటీ అధికారులను లేదా బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ అభిప్రాయాలను కూడా తీసుకోకుండా కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీలకు గత ప్రభుత్వం వైస్ ఛాన్సలర్స్‌లను నియమించింది. కానీ ఈ యూనివర్సిటీకి ఐఎఎస్ అధికారి,వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు వైస్‌ఛాన్సలర్‌గా ఉన్నారు. కానీ అక్కడి పరిస్థితి, విద్యార్థుల అభిప్రాయం తెలుసుకోకుండా ఆయన భూములిచ్చేందుకు సంతకం చేశారు. గతంలో కూడా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సందర్భంలో ఫ్లైఓవర్ కోసం యూనివర్సిటీ భూములను తీసుకోవాలని చూస్తే అప్పటి వి.సి రఘువీర్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మార్చారు. కానీ ప్రస్తుత వి.సి. ప్రభుత్వ అధికారి కావడం వల్లే ఇలా అంగీకరించారనే వాదన వినిపిస్తోంది ఈ భూములను హైకోర్టు కోసం కేటాయించి రియల్టర్లకు లాభాలు కట్టబెట్టేందుకేననే అభిప్రాయం కూడా బలంగా వినిపిస్తోంది. అందుకే మెట్రోరైలు నిర్మాణం కూడా ఇలానే వెళ్ళేలా మార్చారనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయం కోసం పరిశోధనలు నిలిచిపోతాయని, నూతన వంగడాలు, విత్తనాలు అభివృద్ధి లేకుండా పోతుందని, రాష్ట్రంలో ఉన్న ఏకైక వ్యవసాయ యూనివర్సిటీ భూములు తీసుకుని నష్టం చేయవద్దని, హైకోర్టు నిర్మాణానికి వేరే బంజరు భూములు తీసుకోవాలని విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు.

బయోడైవర్సిటీకి పెను ప్రమాదం

హైకోర్టుకు కేటాయించిన భూములలో అగ్రి-బయోడైవర్సిటీ పార్కు, అగ్రి ఫారెస్ట్రీ రీసెర్చ్ సెంటర్, మెడిసినల్ అండ్ ఆరోమాటిక్ ప్లాంట్స్ రీసెర్చ్ స్టేషన్, సీతాకోకచిలుక పార్కు, యూనివర్సిటీ డ్రోన్ అకాడమీ భాగాలుగా ఉన్నాయి. దీని వల్ల ఇవి నష్టపోయే అవకాశం ఉంది. అంతేకాదు గత ప్రభుత్వం కూడా యూనివర్సిటీ భూమిలోనే పెట్రోల్ బంక్, పోలీసు కార్యాలయం (ఎసిపి ఆఫీస్), ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సైతం యూనివర్సిటీ భూమి తీసుకుని నిర్మాణం చేసింది. ఇలా వరుసగా యూనివర్సిటీ భూములు తగ్గుతూ వస్తున్నాయి. తాజాగా హైకోర్టు నిర్మాణ ప్రతిపాదిత ప్రణాళిక వల్ల యూనివర్సిటీలో 2.5 లక్షల చెట్లను నరికివేయాలి, వీటి విలువ రూ.6 లక్షల కోట్ల పర్యావరణ విలువ ఉంటుంది. ఇక్కడ చెట్లు అడవిలా ఉన్న పరిశోధన కోసం యూనివర్సిటీ ఈ చెట్లను పెంచుతున్నారు. వరి, మొక్కజొన్న, పత్తి వంటి 217 రకాల ప్రధాన పంటలకు యూనివర్సిటీ అనేక అభివృద్ధికర పరిశోధనలు చేశారు. దేశంలో మరెక్కడా కనిపించని స్వదేశీ జర్మ్ ప్లాజం ఈ యూనివర్సిటీ వృక్ష జాతుల్లో ఉంది. అనేక అంతరించిపోతున్న వృక్ష జాతులకు నిలయంగా ఉంది. ఇక్కడ జరిగే పరిశోధనలు నేరుగా రైతులకు ఎలాంటి పంటలు అవసరమో తెలుపుతున్నాయి. ఈ నిర్ణయం వల్ల అవి నిలిచిపోతాయి. ఇదే కాదు ఇక్కడ ఉన్న అగ్రి బయోడైవర్సిటీ పార్కులో ఉన్న 313 జాతులకు చెందిన 439 వృక్ష జాతులు, 80 రకాల చెట్లు, 206 రకాల మూలికలు, 56 రకాల పొదలు, 52 రకాల పర్వతరోహకులు, 39 రకాల గడ్డి జాతులు,143 రకాల ఔషధ మొక్కలు,16 రకాల క్షీరదాలు,139 రకాల పక్షి జాతులు,42 రకాల హెర్పెటోఫౌనా, 151 రకాల అకశేరుకాలు, కలిగిన మొత్తం 348 రకాల జంతు జాతులున్నాయి. అలాగే స్థానికంగా అంతరించిపోతున్న సెరోపెజియా బుల్బోజా అనే వృక్షం 215 ఏండ్ల తర్వాత ఇక్కడ సేకరించబడింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల బయోడైవర్సిటీ కోల్పోయే ప్రమాదం ఉంది.

అసలు హైకోర్టు మార్చాల్సిన అవసరముందా?

ప్రస్తుతం ఉన్న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు పాత బస్తీలోని పదిహేనెకరాల్లో మూసీనది పక్కన ఏడో నిజాం నిర్మించిన శతాబ్ద కాలం నాటి భవనంలో నిర్వహిస్తున్నారు. ఆధునిక కాలంలో నూతన ఆవిష్కరణలతో హైకోర్టు కావాలని డిమాండ్ ఉన్నప్పటికీ ఉన్న భవనం రాష్ట్ర అవసరాలకు సరిపోతుంది.ఎన్నికల ముందు నవంబర్‌లో రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ భూమి కోసం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అప్పటి ప్రభుత్వం కూడా వేరే చోట హైకోర్టు నిర్వహించాలని ఆలోచన చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థుల పరిశోధన కోసం, భవిష్యత్ తెలంగాణ వ్యవసాయ రంగం అవసరాలకు విస్తరించేందుకు ఉపయోగపడే భూమిని కేటాయిస్తోంది. ప్రస్తుతం ఉన్న భవనంలోనే 1500 కార్లు పార్కింగ్ ఉండేలా మల్టీలెవలింగ్ పార్కింగ్ నిర్మిస్తే మరో వందేండ్లు అయినా ఈ భవనం సరిపోతుంది అనే వాదనలు కూడా ఉన్నాయి. గతంలో సుప్రీం కోర్టు బెంచ్ హైదరాబాద్‌లో ఉండాలనే డిమాండ్ కూడా సుప్రీంకోర్టు కొట్టివేసింది. సుప్రీంకోర్టు కూడా చాలా కేసులు ఇంటినుంచి ఆన్‌లైన్‌లో వర్చువల్ పద్ధతిలో వాదించొచ్చనే అనే అభిప్రాయం కలిగి ఉంది. ముఖ్యమైన కేసులకు మాత్రమే కోర్టుకు హాజరు కావాలని కూడా చెప్పింది. ఈ ప్రకారం చూస్తే ప్రస్తుతం ఈ భవనమే సరిపోతుంది. హైకోర్టు మార్చాలంటే బార్ అసోసియేషన్ అభిప్రాయం కూడా అవసరమే. గతంలోనే ఇలాంటి విషయాల పట్ల తెలంగాణ రాష్ట్ర బార్ అసోసియేషన్ మెజార్టీ వ్యతిరేకించిన సందర్భాలు కూడా ఉన్నాయి. హైకోర్టు నూతన నిర్మాణానికి రూ. వెయ్యి కోట్లు ఖర్చు చేసే బదులు రాష్ట్రంలో 120 కింద కోర్టులను ప్రాథమిక సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేయవచ్చు. హైకోర్టు అనేది నగరంలో ఇప్పుడున్న కోర్టులకు అందుబాటులో ఉండాలి. కానీ నూతనంగా నిర్మించేది నగర శివారు దూరమవుతుంది. కొత్త భవనం అవసరమనే భావన ఉన్నా, వ్యవసాయ అభివృద్ధిలో కీలకమైన పాత్ర పోషించిన, పోషిస్తున్న యూనివర్సిటీ భూములను తీసుకోవడం పరిష్కారం కాదు. బయో డైవర్సిటీకి నష్టం చేసే చర్యలను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కూడా నిలిపివేస్తుంది. అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి పున:పరిశీలన చేసి జీ.వో నెం 55 వెనక్కి తీసుకోవాలి. రాష్ట్రంలో ఉన్న ఒకేఒక్క వ్యవ సాయ యూనివర్సిటీ కూడా ఉంది. దీన్ని కాపాడుకోవడంతో పాటు, భవిష్యత్ తరాల కోసం నేటి విద్యార్థులు చేస్తున్న పోరాటానికి మద్దతు తెలపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉన్నది.



> హైకోర్టు నూతన నిర్మాణానికి రూ. వెయ్యి కోట్లు ఖర్చు చేసే బదులు రాష్ట్రంలో 120 కింద కోర్టులను ప్రాథమిక సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేయవచ్చు. హైకోర్టు అనేది నగరంలో ఇప్పుడున్న కోర్టులకు అందుబాటులో ఉండాలి. కానీ నూతనంగా నిర్మించేది నగర శివారు దూరమవుతుంది. కొత్త భవనం అవసరమనే భావన ఉన్నా, వ్యవసాయ అభివృద్ధిలో కీలకమైన పాత్ర పోషించిన, పోషిస్తున్న యూనివర్సిటీ భూములను తీసుకోవడం పరిష్కారం కాదు.

మెయిల్ @ నవతెలంగాణ

దొరికిందయ్యా... కోదండరామా...

గోతికాడి నక్క...ఏం దొరుకుతుందో తిందామని ఎదురుచూస్తుంది. రాజకీయాల్లో అయితే కుర్చీ మీద కూసున్నోడిని ఎప్పుడు గుంజుదామని కొంతమంది ఎదురుచూసే సందర్భంలో దీన్ని ఉపయోగిస్తారు. ఇదేకాకుండా నిత్య జీవితంలో కూడా అనేక సందర్భాల్లోనూ వాడుతుంటారనేది తెలిసిందే. కానీ తాజాగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి బీఆర్ఎస్ కూడా అలా తయారైంది. కాంగ్రెస్‌లో ఎప్పుడు కుమ్ములాటలు జరిగి సంక్షోభం వస్తుందో, అందులో ఎప్పుడెప్పుడు జొరబడతామనో బీఆర్ఎస్ నేతలు కండ్లకు ఒత్తులేసుకుని చూస్తున్నారు. అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే ఆ 'ప్రభుత్వం కూలిపోతుంది. కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు ఎప్పుడు బయటకొస్తారు. రాకపోతే మేమే కూల్చేస్తాం' అంటూ పెద్దపెద్ద మాటలు మాట్లాడారు. ఆ మాటలే ఆ పార్టీ నేతల పట్ల ఈటలుగా మారాయి. సర్కారొచ్చి పట్టుమని పది రోజులు కూడా కాకపాయే అదేది బీఆరేసోల్లు ఇట్లా మాట్లాడబట్టిరి అంటూ ప్రజల్లో చర్చ మొదలైంది. ఇది ఇట్లా ఉండగా ఆరు గ్యారంటీలు అమలు ఎప్పుడు చేస్తారని ప్రశ్నించి కారు బొక్కబోర్లపడింది. అసెంబ్లీలో కాంగ్రెస్ శ్వేతపత్రం పెడితే, తెలంగాణభవన్‌లో కేటీఆర్ స్వేదపత్రం పెట్టి తుస్సుమనించారు. అది కూడా ఆ పార్టీకి రివర్సయింది. లడ్డు కావాలా నాయనా అంటూ టీవీల్లో యాడ్ వస్తే మనకు నోరూరినట్టు... కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేయడం కూడా కాంగ్రెస్‌ను విమర్శించేందుకు బీఆర్ఎస్‌కు లడ్డు దొరికినంత పనైంది. ఓ పార్టీ అధ్యక్షుడికి ఎట్లా ఎమ్మెల్సీ పదవి ఇస్తారంటూ బీఆర్ ఎస్ నేతలు గగ్గోలు పెడుతున్నారు. వారి కడుపు మంటకు కారణం రాజకీయ నాయకులు దాసోజ్ శ్రవణ్, సత్యనారాయణ పేర్లను గవర్నర్ తిరస్కరించడమే. కానీ 35 ఏండ్లుగా ఆయన అధ్యాపక వృత్తిని గుర్తించడం లేదు. అంతేకాకుండా రాష్ట్ర సాధనలో రాజకీయాలకతీతంగా టీజేఏసీ అధ్యక్షుడిగా సేవలందించిన విషయాన్ని కూడా మరచిపోయి నట్టున్నారు. గతం మరచిపోతే భవిష్యత్తు ఉండదు.

\- గుడిగ రఘు

ఆడలేక మద్దెల ఓడు!

'ఆడలేక మద్దెల ఓడు' అన్నట్టు. తాను సరిగా పాట పాడలేక, మద్దెలను బాగా వాయించలేదని నిందించాడు ఓ ఘనుడు. శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపై గత కొద్ది రోజులుగా ఆ పార్టీ నేతలు చేస్తున్న పోస్టుమార్టం తీరు అలాగే ఉంది. రాష్ట్రాన్ని పదేండ్లపాటు ఏకచత్రాధిపత్యంగా పాలించిన గులాబీదళం తీసుకున్న నిర్ణయాలు. ప్రజలతో మమేకమైన తీరు ఒకవైపు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సమస్యలను పట్టించుకోకపోవడం, నియంతలా వ్యవహరించడం, అవినీతి, బంధుప్రీతి, అక్ర మాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. వీటన్నింటిపై లోతైన విశ్లేషణ చేయకుండా పూటకోమాట మాట్లాడుతున్నారు. 32 మెడికల్ కాలేజీలకు బదులు 32 యూట్యూబ్ చానళ్లు పెడితే గెలిచే వారమని ఒకసారీ, దళితబంధు కొంపముంచిందని, రాని వారు కక్షగట్టి ఓడించారని మరోసారీ తమ అసహనాన్ని వెళ్లగక్కుతున్నారు. ఆత్మస్తుతి, పరనింద.. రెండూ అనర్థాలే. తమ అసమర్థతను ఇతరులపై నెట్టేసే ప్రయత్నం మనల్ని మనం అతిగా పొగుడుకోవడం, ఇతరులపై అకారణంగా నిందలు వేయడం, తమను తాము గొప్పగా పదిమందిలో చెప్పుకోవడం తెలంగాణ సమాజం పదేండ్లుగా గమనిస్తోంది. 'అభివృద్ధికి బాటలు వేశాం... సంక్షేమాన్ని పరుగులు పెట్టించాం... దేశానికి రోల్‌మోడల్ తెలంగాణ అభివృద్ధి' అని తెగ పొగిడారు. అన్నింటా ఫస్ట్ అనే గులాబీ నేతలు వారిని జనం ఎందుకు ఓడించారో ముందు ఆత్మ విమర్శ చేసుకోవాలి.

\- ఊరగొండ మల్లేశం

మతులబు

గీ మధ్య మన పాత అమాత్యులు కేటీఆర్ అన్న మాటల్లో గోస ఇనిపిస్తున్నదా మీకు? గదే మేడమ్ గవర్నర్ మా మాట ఇన్లేదు.. గిప్పుడే గీ కొత్త సీఎం రేవంత్‌రెడ్డి మాట ఎట్ల ఇంటదీ అని పదేపదే అనబట్టే. మీకు ఆ మతులబు సమజైందా మరీ ! మేము గతంలో మోడీ సాబ్‌కు బరాబర్ ఊడిగం చేసినం లోపలంగా..అయిన తమిళిసై పట్టించుకోలే.. ఇప్పుడేమో రివర్స్ అయిందేంటి ? గట్ల రేవంత్ అమిత్‌షాను కలవంగనే, గిట్ల ఆర్డర్స్ పాస్ గాబట్టే అని శానా పరేషానైతుండు అన్న. మతులబు ఏంటా అని జుట్టుపీక్కునే పరిస్థితి వచ్చే. ఎందుకంటరా.. అందరేమో గులాబీ బాస్ ఎన్నికలల్ల ఓడిపోనీకి అహంకారం అనబట్టిరీ..అధికారంలో ఉన్నప్పుడమో సలామ్ కొట్టిరి.. ఇప్పుడేమో మొఖం తిప్పబట్టే.. పవర్ పర్మినెంట్ కాదు కదా మరీ.. సమజైందను కుంటా.. ఉంట మరీ. ! నాకెందుకు తంట !!

\- బి.బసవపున్నయ్య

5

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

కరీంనగర్

బుధవారం | జనవరి 31, 2024 | www.navatelangana.com

అచీవర్స్ పాఠశాలలో వార్షిక క్రీడోత్సవాల బహుమతుల ప్రధానం



బహుమతులు అందజేసిన అనంతరం విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్

నవతెలంగాణ-కరీంనగర్ : నగరంలోని స్థానిక కోతిరాంపూర్‌లో గల అచీవర్స్ ఆక్టివ్ పాఠశాలలో గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని వారం రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక క్రీడోత్సవాలలో భాగంగా మంగళవారం విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, టగ్ ఆఫ్ వార్, క్రికెట్ లాంటి ఆటలను నిర్వహించి, ఫైనల్స్‌లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని నింపడానికి, క్రీడలలో ప్రావీణ్యం పొందడానికి ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా నిర్వహించిన పోటీలలో విద్యార్థులు నైపుణ్యం ప్రదర్శించి బహుమతులు గెలిపొందారని తెలిపారు. ఇలాగే జాతీయ స్థాయిలో కూడా బహుమతులు గెలవాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.పల్లవి మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా అభివృద్ధి చెందాలని, క్రీడల ద్వారా క్రమశిక్షణ అలవడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అక్షిత కుటుంబానికి న్యాయం చేయాలి

- బాధిత కుటుంబానికి రూ.50లక్షల సాయం అందించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్ జిల్లా కేంద్ర శివారులోని చింతకుంట సోషల్ వెల్ఫేర్‌లో ఉరేసుకుని అనుమానాస్పదంగా మృతి చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థి అక్షిత కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేశారు. కరీంనగర్ సివిల్ ఆస్పత్రి ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ మాట్లాడుతూ అక్షిత మరణం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఆమె మృతికి గల కారణాలపై ప్రిన్సిపాల్ సరియైన సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్న పరిస్థితి కనిపిస్తోందని తెలిపారు. ఉరేసుకుని చనిపోయిన అక్షిత ఆత్మహత్య చేసుకుందంటూ ఆమె పుస్తకాల్లో ఓ సూసైడ్ నోట్ లభించిందని చెప్పడం అనుమానాలకు తావిస్తోందన్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే అక్షిత మృతదేహాన్ని ఎలా కిందికి దించి హుటాహుటిన నేరుగా సివిల్ ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదికి ఎలా తీసుకొచ్చారని ప్రశ్నించారు. అక్షిత మరణం వెనుక నిజానిజాలనుపోలీసులు విచారణలో తేల్చాలని, బాధిత కుటుంబానికి రూ.50లక్షల సాయం ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్, ఎస్ఎఫ్ఐజిల్లా ఉపాధ్యక్షులు రోహిత్, ఇరు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఒక్క రోజే!

నేటితో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం



జిల్లా	జీపీలు	వార్డులు
కరీంనగర్	313	3866
పెద్దపల్లి	263	2474
జగిత్యాల	383	3500
సిరిసిల్ల	255	2240
మొత్తం	1214	12080

గ్రామపంచాయతీల సర్పంచ్‌ల పదవీ కాలం నేటితో (జనవరి 31) ముగిసిపోతోంది. ఇక పార్లమెంట్ ఎన్నికలతరువాతనే పంచాయతీల్లో ఎన్నికల పోరు ఉంటుందనే సంకేతాలు వెలువుడుతున్నాయి. డిసెంబర్ చివరి వారం, లేదా జనవరిలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావాల్సి ఉండగా.. డిసెంబర్ 3న రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ అధికారంలోకి రావడం, వెనువెంటనే పంచాయతీ ఎన్నికల అంశం ముందుకు రాకపోవడంతో ఆయా పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లతో పాలన సాగించే యోచనలో కొత్త సర్కారు పడింది. మరోవైపు తాము సర్పంచ్‌లుగా కొలువుదీరిన కొత్తలోనే రెండేండ్లు కొవిడ్ కాలంతో గడిచిపోవడం, మిగిలిన కాలంలో చేయాల్సిన డెవలప్‌మెంట్‌లో వెనుకబడటం, చేసిన పనులకు బిల్లులు రాకపోవడం వంటి పరిణామాల్లో తమ పదవీకాలం పొడిగించాలన్న డిమాండ్ సర్పంచుల నుంచి వస్తుండటం గమనార్హం.

- పార్లమెంట్ ఎన్నికల తరువాతే పల్లెల్లో ఎన్నికల పోరు..
- పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించే దిశగా సర్కారు అడుగులు
- ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టరేట్లకు చేరిన జాబితా
- సొంతఖర్చుతో చేసిన పనులకు బిల్లులు రాక సర్పంచ్‌ల అవస్థలు
- కొవిడ్‌తో రెండేండ్లు పదవీకాలం గడిచిందని....
- మిగతా సమయంలోనూ చేసిన పనులకు బిల్లులు రాలేదని...
- పదవీకాలాన్ని పొడిగించాలని సర్పంచ్‌ల డిమాండ్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 1214 పంచాయతీలకు సర్పంచ్‌లు, 12080 వార్డులకు సభ్యుల పదవీ కాలం నేటితో ముగిసిపోతోంది. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీనియర్ అసిస్టెంట్, హెడ్మాస్టర్లు, మండల స్థాయి హోదా కలిగిన అధికారులతో ప్రత్యేకాధికారుల జాబితా సిద్ధం చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఇప్పటికే మౌఖిక ఆదేశాలు అందాయి. ఆ మేరకు మండలాల వారీగా సిద్ధమైన జాబితా ఆయా కలెక్టరేట్లకూ చేరాయి. నేడు లేదా రేపు సంబంధిత ప్రత్యేకాధికారుల నియామక ఉత్తర్వులు వెలువడే అవకాశం కనిపిస్తోంది.

పార్లమెంట్ ఎన్నికల తరువాతనే....

2019 పార్లమెంట్ ఎన్నికలకు ముందే గతంలో సర్పంచ్ ఎన్నికలు జరగగా.. అప్పటికే రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ దాదాపు 800 పంచాయతీల్లో తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులనే గెలిపించుకుంది. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ కొలువుదీరి రెన్నెళ్లు మాత్రమే గడిచింది. పైగా కొత్తగా 500పై జనాభా ఉన్న తండాలను జీపీలుగా మార్చడంతో పంచాయతీల సంఖ్య పెరిగింది. పైగా కొద్ది రోజుల్లోనే ఎంపీ ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తున్న నేపథ్యంలో పల్లె పోరులో తలపడేందుకు కాంగ్రెస్ సిద్ధంగా లేనట్టు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యాక గ్రామాల్లో పూర్తిస్థాయి పట్టు సాధించి బరిలోకి దిగి మెజార్టీ పంచాయతీలను కైవసం చేసుకునే మాస్టర్‌ప్లాన్ చేస్తోంది.

స్పెషల్ ఆఫీసర్ల నియామకానికి కసరత్తు...

పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలనపై ప్రభుత్వం నుంచి అధికారికంగా ఆదేశాలు వచ్చిన వెంటనే కలెక్టర్ తన వద్దకు వచ్చిన జాబితాకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ప్రధానంగా గెజిటెడ్ హోదా ఉన్న అధికారులు, ఆ తరువాత పంచాయతీరాజ్ కింద పని చేసే సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్ హోదా కలిగిన అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించబోతున్నారు. అయితే ఉమ్మడి జిల్లాలోని ఏ మండలంలోనైనా కనీసం 20 నుంచి 30 వరకు పంచాయతీలు ఉన్నాయి. ఈ లెక్కన పెద్దఎత్తున ఉన్న పంచాయతీలకు అవసరమైన స్థాయి అధికారులు లేకపోవడంతో జూనియర్ అసిస్టెంట్లు,లెక్చరర్లు, హెచ్ఎంలు, సీనియర్ ఉపాధ్యాయులను కూడా నియమించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

పెండింగ్‌బిల్లులపై ఆందోళన

సాధారణంగా గ్రామపంచాయతీలకు జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరు అవుతాయి. గ్రామాల్లో వీటితో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులతోపాటు ఇతరాత్ర అభివృద్ధి పనులు చేపడుతారు. కేంద్ర సర్కారునుంచి నిధులు వస్తున్నప్పటికీ కొంత కాలంగా రాష్ట్ర సర్కారునుంచి విడుదల చేయడం లేదని తెలుస్తోంది. దీంతో చాలా గ్రామాల్లో సర్పంచ్‌లే సొంత నిధులతో పనులు చేపట్టి పూర్తి చేశారు. చేసిన వాటికి బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.150కోట్లపైనే బకాయిలు రావాల్సి ఉన్నట్టు సర్పంచ్‌వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో నేటితో పదవీకాలం ముగుస్తున్న క్రమంలో బకాయి పడ్డ బిల్లులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. రూ.లక్షలు అప్పు తెచ్చి పనులు చేసిన కొందరు సర్పంచ్‌లు వాటికి వడ్డీలు కట్టలేక నానా ఇబ్బందులుపడుతున్నారు. ప్రభుత్వం మారడం, పదవీకాలం ముగస్తుండటంతో తమ బకాయిల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సర్పంచ్‌పై సస్పెన్షన్ వేటు



మరో రెండు రోజుల్లో పదవీకాలం పూర్తి కాబోతున్న సమయంలో నిధుల దుర్వినియోగం చేశారని సర్పంచ్ పై సస్పెన్షన్ వేటు వేస్తూ జగిత్యాల జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అధికారుల వివరాల ప్రకారం.. పెగడపల్లి మండలం నామాపూర్ సర్పంచ్ ఇనుగాండ్ల కరుణాకర్ రెడ్డి గ్రామంలో 'మానస్' స్వచ్ఛంద సంస్థ ద్వారా నాలుగు బోర్లు వేయించాడు. అవే పనులకు తప్పుడు తీర్మానం తయారు చేసి ఎమ్‌బీ రికార్డు చేసి పంచాయతీ నిధుల నుండి రూ.3.10లక్షలు డ్రా చేశారని ఫిర్యాదు రాగా అధికారులు విచారించారు. ఆ నిధుల దుర్వినియోగం నిర్ధారిస్తూ విచారణ అధికారులు తమ నివేదికను కలెక్టర్ కి ఇచ్చారు. ఈమేరకు కలెక్టర్ సదరు సర్పంచ్ ను సస్పెండ్ చేస్తున్నట్టు ఉత్తర్వులు జారీ చేశారు.

కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లకు జాయింట్ చెక్‌పవర్?

పాలకవర్గాల గడువు ముగియనున్న నేపథ్యంలో సర్పంచుల అధికారాలన్నీ స్పెషల్ ఆఫీసర్లకు ఉంటాయి. స్పెషల్ ఆఫీసర్‌తో పాటు పంచాయతీ కార్యదర్శికి చెక్‌పవర్ ఇవ్వనున్నట్టు అధికారవర్గాలు తెలుపుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తుండటంతో మళ్లీ తమనే కొనసాగించాలని ఇప్పటికే రాష్ట్రంలోని సర్పంచుల ఫోరం సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం సర్పంచులుబిల్లులు చెల్లింపు విషయమై ఆందోళన వ్యక్తం చేస్తుండగా.. ఎంబీ రికార్డు, పంచాయతీ తీర్మానాలు ఉంటే తప్పకుండా వస్తాయని అధికారులు చెబుతుండగా విషయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వివరించి వినతిపత్రాలను సమర్పించారు. దానిపై ప్రభుత్వం సుముఖంగా లేనట్టుగా కనిపిస్తోంది. ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభించాలని మౌఖిక ఆదేశాలు జారీ చేసిన సర్కారు అధికార ప్రకటన చేయాల్సి ఉంది.

బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకో...

- ప్రజల మనోభావాలతో రాజకీయాలు చేయొద్దు
- బీఆర్ఎస్ విద్యార్థి, యూత్ నాయకులు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సిరిసిల్ల జడ్పీ వైస్‌చైర్మెన్ సిద్ధం వేణు

నవతెలంగాణ - కరీంనగర్

'బండి సంజయ్ గారు... మీరు మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే బాగుంటుంది. నోరు ఉంది కదా అని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ గారిపై తప్పుడు కూతలు కూస్తే ఇక్కడ చూస్తూ ఊరుకునేవారు లేరు. ఎన్నికలు రాగానే మతం ముసుగులో రాజకీయాలు చేసే నువ్వు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో చేసిన అభివృద్ధి ఎంటో చెప్పు' అంటూ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మెన్ ఏనుగు రవిందర్ రెడ్డి బీఆర్ఎస్ విద్యార్థి, యూత్ నాయకులు డిమాండ్ చేశారు. కరీంనగర్ లోని మాజీ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రం నుంచి ఏడాదికోసారి రెగ్యులర్ గా వచ్చే నిధులు కూడా తానే తెచ్చినట్లు బిల్డప్ లు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2014లో వినోద్ కుమార్ ఎంపీ అయ్యాక రైల్వే లైన్ మంజూరు చేయించారని, తాను కనీసం కరీంనగర్ కు ఆర్ఓబి అయినా తెచ్చాడా అని ప్రశ్నించారు. అభివద్ధి చేయడం చేతకాని దద్దమ్మ బండి సంజయ్ అంటూ సంబోధిస్తూ ఎన్నికలు రాగానే మతం ముసుగు వేసుకుని రాజకీయాలు చేస్తున్నాడంటూ విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ విద్యార్థి, యూత్ నాయకులు జక్కుల నాగరాజు యాదవ్, భూక్య తిరుపతి నాయక్, ద్యావ మధుసూదన్ రెడ్డి, కేంసారం తిరుపతి, గవ్వ వంశీధర్ రెడ్డి, బండ వెనుయాదవ్, శ్రావణ్ పటేల్ ,సత్తినేని శ్రీనివాస్, ప్రదీప్, తరుణ్, నవీన్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శికి అక్షయ స్కూల్ కరెస్పాండెంట్ పరామర్శ



నవతెలంగాణ - చొప్పదండి : మండలంలోని కొలిమి కుంట గ్రామానికి చెందిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్ తండ్రి సత్తు నరసయ్య మృతి చెందాడు. కాగా మంగళవారం మల్లేష్ చిన్ననాటి మిత్రుడైన మండలంలోని ఆర్నకొండ అక్షయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ తమ్మడి కనుక రాజు పరామర్శించి, నరసయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మేడిశం భయ్యా ఉన్నారు.

గ్రామాల్లో మెడికల్ మాఫియాను అరికట్టాలి

సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి.



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

నవతెలంగాణ - గన్నేరువరం : మండలంలోని వివిధ గ్రామాలలో మెడికల్ షాపు నిర్వాహకులు చేస్తున్న మెడికల్ మాఫియాను అధికారులు తక్షణమే అరికట్టాలని సిపిఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గునుకుల కొండా పూర్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుపేద ప్రజలు చిన్న చిన్న వ్యాధులకు మెడికల్ షాపు నిర్వాహకులను ఆశ్రయిస్తే వారు తోచినట్టుగా మందులు అంటగట్టి అధిక మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారని, ఏమీ తెలియని ప్రజలు ఆ మందులను వాడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు చూసి చూడకుండా వదిలి వేయడం మూలంగానే మెడికల్ షాప్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా నకిలీ మందులు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే డ్రగ్స్ కంట్రోల్ అథారిటీ అధికారులు మెడికల్ షాపుల్లో తనిఖీలు చేపట్టి నకిలీ మందులు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి చొక్కల శ్రీశైలం, నాయకులు ఆంజనేయులు, చొక్కల శ్రీనివాస్, గుడెల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

గుమ్లాపూర్ సమ్మక్క- సారలమ్మ నూతన కమిటీ చైర్మన్ జీవన్



నూతనంగా ఎన్నికైన గుమ్లాపూర్ సమ్మక్క సారలమ్మ కమిటీ సభ్యులు

నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్ సమ్మక్క - సారలమ్మ నూతన కమిటీ చైర్మెన్‌గా దుంపల జీవన్, వైస్ చైర్మన్‌గా మండల తిరుపతి, బద్దెనపల్లి రాజేందర్, ప్రధాన కార్యదర్శి బొడిగె రాజశేఖర్, కోశాధికారిగా కోలాపురి హనుమంతు, సహాయ కార్యదర్శి సంకరి మోహన్, ప్రచార కార్యదర్శులు గా రామడుగు ప్రశాంత్, ఆకుల సత్తయ్య, గౌరవ అధ్యక్షులు గా సర్పంచ్ అప్పిడి సౌజన్య శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీటీసీ బత్తుల లక్ష్మీనారాయణ, ముఖ్య సలహాదారులు ముస్కే వెంకటరెడ్డి, మండల లక్ష్మయ్య, విలాసాగరం అంజయ్య, బొడిగె లక్ష్మా గౌడ్, రామడుగు విజయ్ కుమార్, వెల్మ బాపురెడ్డి సభ్యులు ఎన్నికయ్యారు.

భారత సేవారత్న పురస్కారం అందుకున్న గాలిపెల్లి కుమార్



గాలిపెల్లి కుమార్

నవతెలంగాణ-కరీంనగర్ : వైజాగ్‌లో భారత సేవారత్న పురస్కారం-2024 ను గాలిపెల్లి కుమార్ అందుకున్నారు. విశాఖపట్నంలో తాసుబెల్లి ఫౌండేషన్ చైర్మెన్ శంకర్ నాయుడు ఆధ్వర్యంలో తాసుబెల్లి ఫౌండేషన్ 25వ వార్షికోత్సవం సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా సమాజంలో రక్తదానంపై అత్యున్నతమైన సేవాలందిస్తున్న తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, ఒరిస్సా నాలుగు రాష్ట్రాలలో రక్తం దొరకకుండా ఎవ్వరు చనిపోకూడదని రక్తదానం చైతన్య కార్యక్రమాలు, రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు, రక్తదానం చేస్తున్న 109 మంది రక్తదాత సేవా మూర్తులకు విశాఖపట్నంలో 'భారత సేవారత్న పురస్కారం-2024' ఇచ్చారు. 12 సంవత్సరాలుగా రక్తదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్న బొమ్మకల్ గ్రామం (కరీంనగర్ జిల్లా) కు చెందిన గాలిపల్లి దుర్గయ్య-అంజమ్మ దంపతుల కుమారుడు, బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ సోషల్ ఆక్టివేట్ గాలిపెల్లి కుమార్ 12 సంవత్సరాలుగా 2008వ సంవత్సరం నుంచి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రక్తదాన చైతన్య యుద్ధంలో నేను సైతం అంటూ 48 సార్లు రక్తదానం చేయడం, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం అనేక రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం, అత్యవసర సమయంలో చికిత్స పొందుతున్న 6000 మందికి ఉచితంగా ప్రత్యేకంగా, పరోక్షంగా రక్తం అందించారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా కరోనా పేషెంట్లకు చిరంజీవి ద్వారా ఉచితంగా ఆక్సిజన్ సిలీండర్లు, అవసరమైన సహాయ సహకారాలు అందించి, బాధితులకు అవసరమైన రక్తం, 150 మందికి ప్లాస్మాదానం, నిత్యావసర వస్తువులు, మెడిసిన్స్, మాస్కులు, కరోనా సమయంలో కరోనా రాకుండా అవగాహన, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో సామాజిక మాధ్యమాల ద్వారా ఎంతో మందికి రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినందుకు తాసుబెల్లి ఫౌండేషన్ చైర్మెన్ శంకర్ నాయుడు, వెంకట లక్ష్మి, కళావతి చేతుల మీదుగా 'భారత సేవారత్న పురస్కారం-2024' ను అందుకున్నారు. నాకు సపోర్ట్ చేస్తున్న రక్తదాతలకు, సభ్యులకు సమాజ సేవ చేస్తున్న ప్రతి ఒక్క ఎన్జీఓ లకు భారత సేవా రత్న పురస్కారం -2024 అవార్డు అంకితం చేస్తున్నానని ఈ సందర్భంగా గాలిపెల్లి కుమార్ తెలిపారు.

నారాయణపూర్ రిజర్వాయర్‌కు చేరిన ఎల్లంపల్లి జలాలు



నారాయణపూర్ సంపుల వద్ద ఎగిసిపడుతున్న ఎల్లంపల్లి జలాలు



ఎమ్మెల్యే ఫ్లెక్సీ క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - గంగాధర : ఎల్లంపల్లి జలాల కోసం ఎదురు చూస్తున్న రైతులు ఎట్టకేలకు ఊపిరి పీల్చుకున్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషితో ఎత్తిపోతల ద్వారా ఎల్లంపల్లి జలాలు గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌కు చేరాయి. మేడారం నుండి లిఫ్టు ద్వారా ఎల్లంపల్లి నీటిని పంపింగ్ చేస్తుండగా నారాయణపూర్ సంపుల వద్ద ఎగిసి పడుతున్నాయి. నారాయణపూర్ రిజర్వాయర్ నీరు వస్తుందనే ఆశతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రామడుగు, గంగాధర, బోయినపల్లి, మల్యాల, కొడిమ్యాల, వేములవాడ మండలాల్లోని అనేక గ్రామాల రైతులు పంట పొలాలు సాగు చేశారు. కాని నీరందక పంటలు ఎండిపోయే స్థితికి చేరాయి. ఎల్లంపల్లి జలాలు నారాయణపూర్ చేరితే తప్పా సాగునీటి కాలువలు, చెరువులు, కుంటల్లోకి నీరు చేస్తుందని ఆశపడిన రైతులు గత నెల రోజులుగా నీటి కోసం ఎదురు చూస్తున్నారు. వరితోపాటు అనేక రకాల పంటలు సాగు చేసిన రైతాంగం ఓ వైపు ఎల్లంపల్లి ఎత్తిపోతల ద్వారా నీరందక మరోవైపు బావులు, బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి పంట ఎండిపోయే స్థితికి చేరాయి. దీంతో ఎల్లంపల్లి జలాలు వదిలితే తప్ప తమ పంటలు దక్కవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ నీటి కోసం ఎదురు చూశారు. రైతుల ఆందోళన, ఎండుతున్న పంటలను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సాగునీటి అధికారులతో చర్చించి ఎల్లంపల్లి నీటిని ఎత్తిపోతల ద్వారా నారాయణపూర్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేయాలని కోరారు. దీంతో ఎట్టకేలకు ఎల్లంపల్లి జలాలు మేడారం నుండి గంగాధర మండలం నారాయణపూర్ ప్రాజెక్టులోకి చేరుతోంది. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతుండగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నీళ్ల వద్ద పూజలు నిర్వహించి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతోపాటు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాణిజ్య పంటల సాగుతో అధిక లాభాలు..

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్
- మాదాపూర్‌లో డ్రాగన్ ఫ్రూట్స్ సాగు పరిశీలన



డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

నవతెలంగాణ - గన్నేరువరం : రైతులు వాణిజ్య పంటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. మండలంలోని మాదాపూర్ గ్రామంలో రైతులు కళ్లెం ముత్యంరెడ్డి, కళ్లెం అంజిరెడ్డిలు సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటలను డీఆర్డిఓ శ్రీలత, ఎంపీడీవో స్వాతి లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటల సాగు కాకుండా ఉద్యానవన పంటల వైపు మొగ్గు చూపాలని, డ్రాగన్ ఫ్రూట్ సాగుతూ అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలి



ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయుల సంఘం నాయకులు

నవతెలంగాణ - చొప్పదండి : ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని స్పెషల్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొలిపాక శివకుమార్ ఎమ్మెల్సీ తాటిపత్రి జీవన్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. హైదరాబాదులో మంగళవారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కలిసి రాబోయే మెగా డీఎస్సీలో జీవో నెంబర్ 97 ద్వారా1523 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. స్పందించిన జీవన్ రెడ్డి ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నోటిఫికేషన్ వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పంజాల ప్రశాంత్ గౌడ్, నరేష్, సుమలత పాల్గొన్నారు.

గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్ జమ్మికుంటలో హాల్టింగ్

నవతెలంగాణ - జమ్మికుంట : కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఈనెల 30నుంచి గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఇస్తున్నట్లు జమ్మికుంట స్టేషన్ మేనేజర్ బుర్ర నర్సయ్య గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

యశ్వంత్‌పూర్ టు గోరక్‌పూర్ రైలుకు స్వాగతం పలికిన బీజేపీ నాయకులు



ఎక్స్‌ప్రెస్ ట్రైన్ కు స్వాగతం పలుకుతున్న బిజెపి జిల్లా

నవతెలంగాణ - జమ్మికుంట : యశ్వంత్ పూర్ నుండి గోరఖ్ పూర్ వరకు ఎక్స్‌ప్రెస్ రైలు జమ్మికుంటలో మంగళవా రం నుంచి హాల్టింగ్ కావడంతో బిజెపి నాయకు లు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడారు. వ్యాపార కేంద్రమైన జమ్మికుంటలో రైలు హాల్టింగ్ కావడం సంతోషకరమన్నారు. జమ్మికుంటలో ఎక్స్ ప్రెస్ ట్రైన్ ఆగడానికి చొరవ తీసుకున్న కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ కు, అలాగే ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్విన్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాడ గౌతంరెడ్డి ,జీడి మల్లేష్, శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, రాజు, రాజ్ కుమార్, రాజేష్ ఠాకూర్, గణేష్ పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ - కరీంనగర్ డెస్క్ : కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం లోగల మల్యాల, వాగొడ్డు రామన్న పల్లె, గ్రామాల పరిధిలో శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర స్థల పరిశీలన చేసిన ఇల్లందకుంట ఎంపీడీవో, సర్పంచులు గురుకుంట్ల సాంబయ్య పుట్ట రాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఉడత వీరస్వామి, సమ్మక్క సారలమ్మ కమిటీ అధ్యక్షులు గురుకుంట్ల రాజీర్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు మేదరి నరేందర్ వార్డు సభ్యులు తాడెం సతీష్ కళ్యాణ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ హాస్టల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్‌లలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అవసర మైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులతో జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ళ నిర్వహణపై జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, దివాకరలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, ఇతర వసతులతో పాటు నాణ్యమైన విద్య అందించాల న్నారు. చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలని అలాగే వారికి వ్యక్తిగత పరిశుభ్రత, మోటివేషన్ తరగతులు, విద్య పట్ల అవగాహన తరగతులు నిర్వహించాలని, అలాగే పదవ తరగతి, ఇంటర్, డిగ్రీలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా హాస్టల్ వసతి గృహ అధికారులు, ప్రిన్సిపాల్స్ కషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

అవినీతి అధికారుల సమాచారం ఇవ్వాలి

ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తి

నవతెలంగాణ-జగిత్యాల

అవినీతి అధికారుల భరతం పడతామని, అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ వీవీ రమణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిన వారి పేర్లు నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చునని, వివరాలు చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఏ అధికారి అయినా లంచం ఇస్తేనే పని చేస్తామని, ఇబ్బంది పెడితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని, సదరు అధికారులను ట్రాప్ చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ అవినీతి జరిగిన అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ వీవీ రమణమూర్తి 9154388954, ఇన్స్పెక్టర్ రాము 9154388956, ఇన్స్పెక్టర్ తిరుపతి 9154388955, ఇన్స్పెక్టర్ రవీందర్9154388957అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఓబీసీ పట్టణ అధ్యక్షుడిగా ప్రవీణ్

నవతెలంగాణ-కోరుట్ల


నియామక పత్రం తీసుకుంటున్న ప్రవీణ్

కోరుట్ల పట్టణ ఓబీసీ అధ్యక్షుడిగా గుర్రాల ప్రవీణ్ నియామకం అయ్యారు. మంగళవారం జువ్వాడి భవన్‌లో ప్రవీణ్ కు నియామక పత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల అధ్యక్షుడు గంగాధర్, రాజం, మున్సిపల్ మాజీ చైర్మన్ శీలంవేణు, వెంకటేష్‌గౌడ్, నేమురి భూమయ్య, మచ్చ కవిత, సత్యనారాయణ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

నవతెలంగాణ-డెస్క్


జేసీబీతో అక్రమ నిర్మాణం తొలగింపు

రాయికల్ పట్టణం నుంచి జగిత్యాల వైపు వెళ్లే ప్రధాన రహదారికి ఎడమ వైపున అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఓ కట్టడాన్ని మంగళవారం జేసీబీతో తొలగిం చినట్టు మున్సిపల్ కమిషనర్(అ.భా) గంగుల సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు పట్టణంలో నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేసుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయనతో పాటు మేనేజర్ వెంకటి, జూనియర్ అసిస్టెంట్‌లు హరీష్, రజాక్, రాజ్ కుమార్ ఉన్నారు.

కళాశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు సౌదర్య

నవతెలంగాణ -డెస్క్


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్‌రావు పై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి సమాఖ్య జిల్లా శాఖ జిల్లా కలెక్టర్ యాష్మిన్ భాషాకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కళాశాల ఆవరణలో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్‌రావు మరుగుదొడ్లు వాడకుండా వాటికి తాళలు వేస్తున్నాడన్నారు. విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొన్న ఉపాధ్యాయులు ప్రిన్సిపల్‌ను అడిగితె తాళాలు ఇచ్చేది లేదని, మీ ఇష్టం వచ్చింది చేసుకొండంటూ పరుషపదజాలంతో విద్యార్థులను, ఉపాధ్యాయులను దుషిస్తూ అవమాన పరుస్తున్నారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పద్మ, వినోద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

నవతెలంగాణ-డెస్క్



ఆర్ బీఎస్‌కే ఆధ్వర్యంలో ఎనీమియా ముక్తభారత్ ప్రోగ్రాం లో భాగంగా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు మంగళ వారం హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న విద్యార్థులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక, ఫార్మసిస్ట్ మాధవి ,ఏఎన్ఎం సోనీ, కళాశాల ప్రిన్సిపల్ దాసరి నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరిలో జాగ్రత్తలు వహించాలి


నవతెలంగాణ-డెస్క్


పొలంలో పరిశీలిస్తున్న ఈఓ దీపిక

ప్రస్తుత యాసంగి సీజన్లో వరి పైర్లు నారుమడి దశలోను పిలక దశలోనూ రైతులు వారిపై జాగ్రత్త వహించాలని ఇబ్రహీంపట్నం వ్యవసాయ అధికారి దీపిక అన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతో పాటు వర్షకొండ గ్రామంలో పర్యటించి రైతులకు సలహాలు సూచనలు చేశారు. సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. యాసంగిలో నారుమడి పిలక దశలో కండంతో తొలిచే పురుగు ఉధృతి అధికంగా ఉంటుందన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి జాగ్రత్తలు వహించాలని కోరారు. ఆమెతోపాటు ఏఈఓ నరేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు

డ్రైనేజీ నీరు పోయేదెలా..?

నవతెలంగాణ-డెస్క్


విద్యుత్ స్తంభం ఎదురుగా చేపట్టిన మురుగు కాలువ నిర్మాణం

రాయికల్ పట్టణంలోని 1వ వార్డులో చేపట్టిన మురుగు కాలువ నిర్మాణం అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ స్తంభం ఎదురుగా చేపట్టడం వల్ల విద్యుత్ స్తంభానికి చెత్త అడ్డుపడి డ్రైనేజీ నీరు వెళ్లేందుకు అంతరాయం ఏర్పడుతుంది. సంబంధిత డ్రైనేజీపై కప్పు నిర్మాణ పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో ఇనుప సలకాలు బయటకు ఏర్పడుతున్నాయని, కనీసం మొరం కూడా పోయకుండా వదిలేశారని సంబంధిత డ్రైనేజీపై కప్పు నిర్మాణాలపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులు దుర్వినియోగంపై సర్పంచ్ సస్పెండ్

నవతెలంగాణ -డెస్క్

పెగడపల్లి మండల పరిధిలోని నామాపూర్ గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం చేసిన సర్పంచ్ ఇనుగండ్ల కరుణాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ పెద్ది సంతోష్, పంచాయతీ కార్యదర్శి తిరుపతిని సస్పెండ్ చేస్తున్నట్లు జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలో స్వచ్ఛత సంస్థ ద్వారా వేసిన బోర్లకు తప్పుడుగా గ్రామపంచాయతీ నుంచి తీర్మానం చేసి రూ.3,10,122 నిధులు దుర్వి చేసినందుకుగాను గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ కార్యదర్శి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రయోగ పరీక్షలకు వేళాయే

- ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు
- 51 కేంద్రాల్లో ప్రయోగాలకు ఏర్పాట్లు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు నిర్వహించనున్నారు. సోమ వారం జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు సకాలంలో బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి ఒక ఆశావర్కర్‌ను అందుబాటులో ఉంచాలని, మున్సిపల్ అధికారులు పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

జూనియర్ కళాశాలలు..

జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ కళాశాలలు మొత్తం 74 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 15, ఆదర్శ పాఠశాలలు 13, కేజీబీవీ 07, టీఎస్ఆర్‌జేసీ 02, టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ 05, టీఎమ్ఆర్ఐ 05, ఎమ్‌జెపీబీ 05, ప్రయివేట్ కళాశాలలు 22 ఉన్నాయి.



జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల వివరాలు..

జిల్లాలో జూనియర్ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 2280 మంది, బైపీసీలో 1272 మంది, ఒకేషనల్‌లో మొదటి సంవత్సరంలో 943 మంది, ద్వితీయ సంవత్సరంలో 1075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

ప్రయోగ పరీక్షలు..

ప్రయోగ పరీక్షలు ఫిబ్రవరి 1న ప్రారంభం కానున్నాయి. మూడు విడతల్లో నిర్వహిస్తుండగా 15న ముగుస్తాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు.

జిల్లాలో పరీక్ష కేంద్రాలు...

జిల్లాలో మొత్తం 51 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో జనరల్ విద్యార్థుల కోసం 38 కేంద్రాలు, ఒకేషనల్ విద్యార్థుల కోసం 13 కేంద్రాలు న్నాయి. ఇందులో మూడు విడతలలో పరీక్షలుంటాయి.

ఓటీపీ ద్వారా ప్రశ్నాపత్రం

ప్రాక్టికల్స్ రాసే విద్యార్థులకు అందజేసే ప్రశ్నా పత్రాన్ని ఇంటర్ బోర్డు నూతన ద్వారా అందజేస్తోంది. కేంద్రాలకు కేటాయించిన ఎగ్జామినర్ల ఫోన్‌లకు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ నమోదు చేసిన తర్వాతనే ప్రశ్నాపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. పరీక్షలకు అరగంట ముందు ప్రశ్నాపత్రాలు ఆన్‌లైన్‌లో ఉంటాయి. కళాశాలల వారీగా ప్రశ్నాపత్రాల కోడ్‌లు వేర్వేరుగా ఉంటాయి. పరీక్ష సమయానికి అరగంట ముందు హాల్‌టిక్కెట్ ఆధారంగా ఇన్విజిలేటర్ ప్రశ్నా పత్రాన్ని డౌన్‌లోడ్ చేసి ఇస్తారు. ప్రయోగ పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రయోగశాలల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయి. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

-నారాయణ.
జిల్లా ఇంటర్ బోర్డు నోడల్ అధికారి

లక్ష్మీపూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాలరూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మంగళవారం ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.3 లక్షల 50వేలతో నిర్మించనున్న ప్రహరీ గోడ, సీడీపీ నిధులు రూ.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, గంగమ్మ ఆలయం వద్ద సీడీపీ - డీఎంఎఫ్‌టీ నిధులు రూ.7 లక్షలతో బతుకమ్మ ఘాట్, సీసీ రోడ్డు నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. వరద కాలువను ఉపయోగించి కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా తెలంగాణ సస్యశ్యామలం చేసుకున్నామన్నారు. ఎస్సారెస్పీ నీరు ఇతర ప్రాంతాలకు మళ్లించి జగిత్యాల నియోజకవర్గ చిట్ట చివరి గ్రామాలకు అన్యాయం చేస్తున్నారు అని అన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు అని సంబంధం లేకుండా ప్రజల శ్రేయస్సు కోసం కొట్లాడాలన్నారు. డబల్ బెడ్ రూం ఇండ్లు నిర్మాణం నిరుపేదలు ఆత్మ గౌరవంతో ఉండే విధంగా నిర్మించామన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఆదర్శవంతమైన రైతులు ఉన్న గ్రామం లక్ష్మీపూర్ అని, మిషన్ కాకతీయతో భూగర్భ జలాలు పెరిగాయని, ప్రజలకు మార్పు కావాలని చెప్పిన ప్రతిపక్షాలు కరెంట్ కోతలతో మార్పు తెస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెరుకు జాన్, ఎంపీటీసీ సునీత లక్ష్మణ్, ఉపసర్పంచ్ రఘు, మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం, గ్రామ శాఖ అధ్యక్షుడు సత్తిరెడ్డి, ఆత్మ చైర్మన్ రాజీరెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరి, నాయకులు చంద్రరెడ్డి, సర్పంచ్‌లు గోడిసెల గంగాధర్‌గౌడ్, బొడ్డు దామోదర్, మహేశ్వరరావు, రజిత శేఖర్, ఏఈ రాజ మల్లయ్య, ఎంపీవో రవి బాబు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

కోరం లేక మున్సిపల్ సాధారణ సమావేశం వాయిదా

నవతెలంగాణ-డెస్క్

పట్టణ మున్సిపాలిటీలో మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి చైర్‌పర్సన్ మోర హన్మాండ్లుతో పాటు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవితో పాటు 10 మంది కౌన్సిలర్లు, నలుగురు కో ఆప్షన్ సభ్యులు కౌన్సిల్ సమావేశానికి హాజరు కావాల్సి ఉంది. కానీ అందరు గైర్హాజరు కావడంతో సరైన కోరం లేనందున్న కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మున్సిపల్ కమిషనర్ (అ.భా) గంగుల సంతోష్‌కుమార్ వాయిదా వేశారు.

సోమవారం అవిశ్వాసం..

రాయికల్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై కౌన్సిల్‌లో ఉన్న 8 మంది కౌన్సిలర్లు అవిశ్వాసాన్ని పెట్టారు. ఇందుకు సంబంధించిన అవిశ్వాస పత్రాన్ని సోమవారం కలెక్టర్ యాస్మిన్ భాషాకి సైతం అందజేశారు. కొంత కాలంగా మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ వర్సెస్ కౌన్సిలర్లు అన్నట్లు కొనసాగుతుంది. వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించకుండా, ప్రతి సమావేశంలో చైర్‌పర్సన్ తనకు ఇష్టం వచ్చినట్లు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని,అందుకే తాము అవిశ్వాసం పెట్టామని కొందరు కౌన్సిలర్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి సైతం 8 మంది బీఆర్ఎస్,ఒకరు కాంగ్రెస్,బీజేపీకి చెందిన కౌన్సిలర్లు హాజరుకాలేదనే చర్చ ఇప్పుడు పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది.


సమావేశానికి హాజరైన కమిషనర్

పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్

నవతెలంగాణ-డెస్క్


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్ నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రారంభోత్సావ కార్యక్రమంలో మమల్ని భాగస్వాములను చేసినందుకు చాలా సంతోషంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిధి పెంపు వంటి హామీలను ప్రభుత్వం వచ్చిన రెండు రోజుల్లోనే అమలు చేయడం జరిగిందని తెలిపారు. మిగిలిన వాటి అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందని, వెల్గటూర్ మండలంలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని, ఈ ప్రాంత ప్రజలకు సాగు,తాగు నీరు అందించెందుకు ఎక్కడ రాజీ పడేది లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అనంతరం ప్రభుత్వం నుండి శిక్షణ పూర్తి చేసుకున్న బ్యూటీషన్ కోర్సుకు సంబంధించిన సర్టిఫికెట్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడవోకు సంబంధించిన బోర్డు ప్రతి గ్రామ పంచాయతీ అందించగా వాటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూనమళ్ళ లక్ష్మి, జెడ్పీటీసీ సుధారాణి,గ్రామ సర్పంచ్ మెరుగు మురళిగౌడ్, ఉప సర్పంచ్ సందీప్, చెగ్యం ఎంపీటీసీ రంగు తిరుపతి, ఎంపిడివో సంజీవరావు, తహసీల్దార్ శేఖర్ బండెల ఉదయ్, మెరుగు నరేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నియంతృత్వ విధానం విడనాడాలి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

యాదాద్రి భువనగిరి జిల్లా జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిపై అధికారిక కార్యక్రమంలో ఆకారణంగా దుర్భాషాలాడడం, ఆయనపై దాడికి దిగడం కాంగ్రెస్ పార్టీ నియంతృత్వ పాలనకు నిదర్శనం అని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు దావ వసంత విమర్శించారు . జగిత్యాల జిల్లా కేంద్రంలో వసంత మాట్లాడుతూ.. సందీప్‌రెడ్డిపై దాడిని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాపాలన కార్యక్రమం లో సాటి ప్రజాప్రతినిధులను అవమానిస్తూ, దాడులకు దిగుతున్న కాంగ్రెస్ పార్టీ, మంత్రులు, నాయకుల వైఖరి గర్హనీయం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీ చైర్మన్‌కు మంత్రి కోమటిరెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ -డెస్క్


పాలాభిషేకం చేస్తున్న రైతు నాయకులు

నిజాం చక్కెర కర్మాగారాల పునరుద్దరణ కోసం కమిటీ వేసిన సందర్భంగా మంగళవారం మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో చెరుకు ఉత్పత్తి దారుల సంఘ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెరుకు ఫ్యాక్టరీ పునరుద్దరణ కమిటీ వేసినందుకు రైతుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. చెరుకు రైతుల బాధలు తెలిసిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కమిటీలో సభ్యుడిగా ఉండడంతో చక్కెర కర్మాగారం పునరుద్దరనపై ఆశలు సజీవంగా ఉన్నాయని అనందం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, పున రుద్దరణ కమిటీ అధ్యక్షుడు గురిజెల రాజారెడ్డి, న్యాయవాది బద్దం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గొల్లపల్లి రామాగౌడ్ సామ గంగారెడ్డి, నవనంది లింభారెడ్డి, చిట్యాల నవీన్, ఉత్కం వెంకట్‌గౌడ్, చెరుకు రైతులు పాల్గొన్నారు.

మల్లాపూర్ :మండల కేంద్రంలో స్థానిక భరతమాత కూడలి వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను త్వరలోనే అమలవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుండ్ర శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సుంకేటి నారాయణరెడ్డి, మరిపెళ్లి మల్లయ్య, కోటగిరి ఆనంద్‌గౌడ్, దూరిశెట్టి శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, క్యాతం మల్లారెడ్డి, పులేరి రాము, నుతిపెల్లి రాజం తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ

నవతెలంగాణ-డెస్క్

పెగడపల్లి మండల పరిధిలోని సుద్దపెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం మండల అధ్యక్షుడు నలువాల లక్ష్మణ్ తల్లి నర్సవ్వ సోమవారం మృతి చెందగా మంగళవారం కుటుంబ సభ్యులను జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్‌రావు పరామర్శించారు. ఆయన వెంట ఆ పార్టీ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, నేరెళ్ల గంగాధర్, తిర్మాని నర్సింహారెడ్డి, నక్క గంగాధర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎంఈ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)గా నూతనంగా నియామకం అయిన డాక్టర్ శివప్రసాద్ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ సైఫ్, సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహనా సదస్సు

పెగడపల్లి సిహెచ్ ఎస్సై సతీష్

నవతెలంగాణ- డెస్క్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ సతీష్

రోడ్డు ప్రమాదాల పట్ల జాగ్రత్తలు పాటించాలని ఎస్సై సిహెచ్ సతీష్ అన్నారు. జగిత్యాల జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు పెగడపల్లి మండల పరిధిలోని నంచర్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోడ్ సేఫ్టీపై అవగాహన సదస్సును మంగళవారం ఎస్సై సతీష్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటిం చాల న్నారు. కారు డ్రైవ్ చేస్తున్నప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను తప్పకుండా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శారద, పోలీస్ సిబ్బంది సంపత్, తిరుపతి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే పార్కింగ్

నవతెలంగాణ-జగిత్యాల టౌన్


రోడ్డుపై నిలిచిన వాహనాలు

జగిత్యాల జిల్లాగా మారటంతో దిన దినం అభివృద్ధి చెందుతోంది. దానికి తోడు జిల్లా కేంద్రంలో పలు ప్రాంతాలలో నివాస భవనాల్లోనే అరకొర వసతుల మధ్య ఆస్పత్రులూ నిర్వహిస్తున్నారు. కొన్ని ఆస్పత్రుల వారు పార్కింగ్ కోసం ఉన్న ఆ కొద్ది పాటి స్థలంను కూడా రిసెప్షన్, ప్రజలు కూర్చో వడానికి వినియోగిస్తున్నారు. దీంతో పలు ఆస్పత్రులకు వచ్చే వారికి ద్విచక్ర వాహనాలను నిలపటానికి కనీసం స్థలం కూడా ఉండడం లేదు. దీంతో వారు తమ ద్విచక్ర వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సి వస్తుంది. దీనివల్ల ఆ రహదారి ఇరుకుగా మారడంతో ఆ రహదారి వెంట వెళ్లే వారు ఇబ్బం దులకు గురవుతున్నారు. మరి కొన్ని ఆసుపత్రుల ముందు రోడ్డును ఆనుకుని జనరేటర్, డాక్టర్ల వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు.దీంతో ఆస్పత్రులో వచ్చే వారికి కనీసం ద్విచక్ర వాహనం నిలుపుకునేందుకు కూడా స్థలం లేకపోవడంతో వారు కూడా తమ వాహనాలను నడిరోడ్డు పైనే నిలుపుతున్నారు. ఇలా జిల్లా కేంద్రంలో పలు ఆస్పత్రులను ఎదుట వాహనాలను నిలవడంతో ఆయా మార్గాలలో రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

జూనియర్ లైన్‌మెన్‌కు సన్మానం

నవతెలంగాణ-డెస్క్


సన్మానిస్తున్న బిజెపి నాయకులు

మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామంలో విధులు నిర్వహిస్తున్న మల్లాపూర్ వాసి తుమ్మనపల్లి విష్ణు బిజెపి నాయకులు మంగళ వారం ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలో జరిగిన గణ తంత్ర దినోత్సవ వేడుకలను ఉత్తమ జూనియర్ లైన్‌మెన్‌గా ఉత్తమ విద్యుత్ ఉద్యోగి అవార్డు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.

ఆర్థిక సాయం అందజేసిన బిజెపి నాయకులు

మొగిలిపేట గ్రామానికి చెందిన ఆకారపు పెద్ద అశన్న అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా, దహన సంస్కారాలను బిజెపి నాయకులు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

నవతెలంగాణ-డెస్క్


తనిఖీ చేస్తున్న ఏడిఏ

మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో ఎరువుల దుకాణాలు కోరుట్ల ఏడీఏ దండ రమేష్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డీలర్లు ఎరువుల అమ్మకాలు తప్పనిసరిగా ఈపాస్ మిషన్ ద్వారానే చేయాలన్నారు. కోరుట్ల డివిజన్లో అన్ని మండలాలలో ప్రయివేట్ సొసైటీల్లో ఎరువుల నిల్వలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు. అతని వెంట వ్యవసాయ అధికారి లావణ్య వ్యవసాయ విస్తరణ అధికారి గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ ఉద్యోగికి సంతాపం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్


సంతాపం తెలుపుతున్న అధికారులు

మూడు రోజుల క్రితం పెద్దపెల్లి వ్యవసాయశాఖలో సూపరిం టెండెంట్‌గా పని చేస్తున్న నుగూరి సుధీర్ కుమార్ గుండెపోటుతో అకాల మరణం చెందాడు. మంగళారం జగిత్యాల జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్, జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీఎన్జీవో ఉద్యోగులు సంతాప సభ కార్యక్రమానికి హాజరై సుధీర్‌కుమార్ మరణానికి సంతాపం తెలిపి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

జగిత్యాల పట్టణ ట్రస్మా అధ్యక్షుడిగా జగన్మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణ ట్రస్మా అధ్యక్ష,కార్యవర్గ ఎన్నికలు మంగళవారం జగిత్యాలలో జరిగాయి. స్థానిక మానస హై స్కూల్‌లో జరిగిన ట్రస్మా పట్టణ ఎన్నికల్లో పట్టణ ట్రస్మా అధ్యక్షుడిగా జగన్మోహన్ రెడ్డి, కార్యదర్శిగా గొల్లపెల్లి రాజుగౌడ్, కోశాధికారిగా రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మోనా శ్రీలత, హరి రవీందర్, జాయింట్ సెక్రెటరీగా వనమాల గంగాధర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సుమిత రాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జిల్లా అధ్యక్షుడు బోగ రవి ప్రసాద్ తెలిపారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడు రవి ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమురవెల్లి కిషన్, ముఖ్య సలహాదారులు శ్రీధర్ రావులు వ్యవహరించారు. ఈ సమావేశంలో కస్తూరి రాంబాబు, జిల్లా ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా ముద్దం బాలయ్య

నవతెలంగాణ-డెస్క్

కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎర్దండి గ్రామానికి చెందిన ముద్దం బాలయ్యను నియమిస్తున్నట్టు మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. నియామక పత్రాన్ని అందించి, ఈ నియమకం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. తన నియమాకానికి కృషి చేసిన గూడ శ్రీకాంత్, లక్కడి నరసవ్వ , నాచుపల్లి రాజకుమారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రథమ స్థాయిలో నిలిచిన గుండ్లపల్లి విద్యార్థి

నవతెలంగాణ-డెస్క్



జగిత్యాల జిల్లా అథ్లటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలో మేడిపల్లి మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన గుడ్ల మనోహర్ ఉత్తమ ప్రతిభ చాటాడు. జిల్లా స్థాయి మొదటి బహుమతి పొంది, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మనోహర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోరుమళ్ళలో తొమ్మిదో తరగతి చదువు తున్నాడు. ప్రోత్సాహాన్ని అందించిన పీఈటీ విజయను మండల నాయకులు, గ్రామ సర్పంచ్ సంపత్‌కుమార్, ఎంపీపీ ఉమాదేవి రాజ రత్నాకర్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు అభినందించారు.

పెద్దింటి పెండ్లి పాట విడుదల

నవతెలంగాణ సిరిసిల్ల :

యువ నటుడు చైతన్య, నటి భూమి శెట్టి జంటగా నటించిన 'షరతులు వర్తిస్తాయి' సినిమాలో పెండ్లి పాటను ప్రముఖ డైరెక్టర్ శేఖర్ కమ్ముల రిలీజ్ చేశారు. ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ ఈ పాటను రాయగా దీనికి సురేష్ బొబ్బిలి సంగీతాన్ని సమకూర్చారు. గతంలో ఎన్నో సినిమాలకి అసిస్టెంట్ డైరెక్టర్గా పనిచేసిన అక్షర కుమార్ తొలిసారిగా దర్శకత్వం వహిస్తున్న వహిస్తున్న ఈ సినిమా వచ్చే నెలలో రిలీజ్ కానుంది. తొలిసారిగా తెలంగాణ పెండ్లి కార్యక్రమాల మీద విడుదలవుతున్న ఈ పాట ప్రతి పెళ్లిలో మార్మోగుతుందని ఇకముందు ఒక కొత్త చరిత్రను సృష్టించడం ఖాయమని ప్రముఖ దర్శకులు శేఖర్ కమ్ముల అభిప్రాయపడ్డారు. తెలంగాణ పెళ్లిలలో జరిగే ప్రతి


ఎండ్లి పాటను విడుదల చేస్తున్న ప్రముఖ డైరెక్టర్ శేఖర్ కమ్ముల

ఈవెంట్ను చూపిస్తూ పల్లె సంప్రదాయాన్ని ప్రతిబింబించే విధంగా పాట సాగుతుంది. ఇది ఒక కొత్త ఒరవడి అని సినీ విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

జల్సాల కోసం చోరీలు

- విద్యుత్ మోటార్లు, ట్రాక్టర్ ట్రాలీ చోరీ
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రవీందర్ రెడ్డి


పట్టుకొన్న మోటార్లు, ట్రాక్టర్ ట్రాలీని చూపుతున్న పోలీసులు

నవతెలంగాణ -మెట్పల్లి : జల్సాలకు అలవాటు పడ్డ నలుగురు యువకులు డబ్బుల కోసం దొంగలుగా మారి, పోలీసులకు చిక్కి కటకటల లోకి వెళ్లిన సంఘటన మెట్పల్లిలో జరిగింది. స్థానిక పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. మెట్పల్లి డివిజన్లో వరుస విద్యుత్ మోటార్ల చోరీ జరుగుతున్నాయన్న ఫిర్యాదు మేరకు ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో బృందం గాలింపు చేపట్టారు. మంగళవారం దొంగిలించిన ట్రాక్టర్, ట్రాలీలో 11 విద్యుత్ మోటార్లను నిజామాబాద్లో అమ్ము కోవడానికి తరలిస్తుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. మెట్పల్లి మండలానికి చెందిన గుగ్లావత్ నరేష్, గుగ్లావత్ అనిల్, గుగ్లావత్ రవిలాల్, జరుపుల ప్రకాష్లు గ్రూప్గా ఏర్పడి జల్సాలకు అలవాటు పడి డబ్బులు సరిపోక ఎలాగైనా డబ్బులు సంపాదించాలని దొంగతనాలకు అలవాటు పడ్డారన్నారు. ఈ క్రమంలో మూడు నెలల కిందట ఆత్మకూర్, జగ్గాసాగర్, వెల్లుల్ల, మల్లాపూర్ పరిసర ప్రాంతాలలో వ్యవసాయ మోటార్ల దొంగిలించారు. వీటిని తరలించడానికి ఒక ట్రాక్టర్ ట్రాలీని దొంగతనం చేసి దాన్ని మండలంలోని ఆత్మకూరు గ్రామంలో పొదల మధ్యన దాచారని, వివిధ ప్రాంతాల్లో దొంగిలించిన మోటార్లను ట్రాలీవద్దకు తరలించి ఒకేసారి ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో నిజామాబాద్ తరలిస్తుండగా పోలీసులు చాకచక్యంగా పట్టుకొని వారి వద్ద నుంచి 11 వ్యవసాయ విద్యుత్ మోటార్లు, ట్రాక్టర్ ట్రాలీ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. దొంగలను పట్టుకోవడంలో చాక చక్యంగా వ్యవహరించిన ఎస్ఐ చిరంజీవి బృందాన్ని డీఎస్పీ అభినందించారు.

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందజేత

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్ : మల్యాల మండలంలోని కొండగట్టు టౌన్ షిప్ ఆవరణలో వన్ క్రికెట్ లీగ్లో ముఖ్యఅతిథిగా కరీంనగర్ రీజియన్ ఆర్మ్ రిసర్వ్ (ఏఆర్) ఏసీపీ ప్రతాప్ పాల్గొని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మంగళ వారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్యాల సీఐ దామోదర్రెడ్డి, డాక్టర్ మహేష్రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు వెల్మ లక్ష్మారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ సర్పంచ్ బత్తిని శ్రీనివాస్గౌడ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సతీష్ రెడ్డి, కృష్ణారెడ్డి, సాయి అనిల్ పాల్గొన్నారు.

మంత్రి వర్సెస్ జెడ్పీటీసీ.. వాగ్వావాదం


వాగ్వావాదానికి దిగుతున్న పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాల గ్రామంలో ఏర్పాటు చేసి చేసిన వేదికపై మంత్రి పొన్నం ప్రభాకర్, ఎల్లారెడ్డిపేట జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్రావు మధ్య ఆసక్తికరమైన వాగ్వావాదం చోటుచేసుకుంది. మొదటగా జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్రావు మాట్లాడుతూ పలు అభివృద్ధి పనులు తమ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగాయని గుర్తు చేయగా మంత్రి పొన్నం ప్రభాకర్గౌడ్ జోక్యం చేసుకొని అందరూ అబద్దాలు ఆడుతారని అనుకున్న కానీ జెడ్పీటీసీ కూడా అసత్యం మాట్లాడుతున్నాడని అనడంతో ఇద్దరి మధ్య కొంత వాగ్వావాదం చోటుచేసుకుంది. గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని తమ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి జరిగిందని మంత్రి పొన్నం సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిని సముదాయించి తన ప్రసంగాన్ని పొన్నం ప్రభాకర్గౌడ్ ప్రారంభించారు.

వినతిపత్రాలిస్తే సమస్యలు పరిష్కరిస్తాం

మంత్రి పొన్నం ప్రభాకర్గౌడ్

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండలంలో పలు అభివృద్ధి పనులను మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మంగళవారం ప్రారంభిం చారు. రాగట్లపల్లిలో గ్రామంలో ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవం చేశారు. దుమాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీగోడ, రైతు వేదిక ప్రారంభించారు. రాజన్నపేట గ్రామంలో రైతు వేదిక ప్రారంబోత్సవం చేశారు. రాజన్నపేట గ్రామ మున్నురుకాపు సంఘం నాయకులు పిట్ల శ్రీశైలం ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ను ఘనంగా సన్మానించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్లో చేరారు. దుమాల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పొన్నం ప్రభాకర్గౌడ్ మాట్లాడుతూ తాను ఎంపిగా ఉన్నప్పటి నుండి ఇప్పటి వరకు ఎల్లారెడ్డిపేటను తన సొంత మండలంగా భావిస్తానన్నారు. నేను ఎంపిగా ఉన్నప్పటి నుండి ఎల్లారెడ్డిపేటకు ఎదో ఒక్క రూపంలో అభివృద్ధి చేస్తున్నానని, ఏ సమస్య ఉన్నా పార్టీలకతీతంగా చెప్పుకోవచ్చన్నారు.

పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేసిన ఇంటిగ్రేటెడ్ ఫ్లాట్ ప్యానెల్ బోధన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ పద్ధతి వలన విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాలు నేర్చుకోగల్గుతారని, విద్యార్థులు ప్రత్యక్ష అనుభూతి పొందేందుకు దోహదం చేస్తుందన్నారు. కంప్యూటర్ చాంప్స్ కార్యక్రమం అమలవుతున్న తీరు గురించి ఆరా తీశారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధన కోసం రోజు ప్రత్యేక అభ్యసనం చేయాలని సూచించారు. కలెక్టర్తోపాటు అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, డీఈవో రమేశ్ కుమార్, కోర్డినేటర్ శైలజ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లోకిని శారద, ఉపాధ్యాయ బృందం, తదితరులు ఉన్నారు.

అమరవీరులకు ఘన నివాళి

హాజరైన అదనపు కలెక్టర్లు

నవతెలంగాణ - సిరిసిల్ల : దేశ స్వాతంత్ర్య ఉద్యమ సాధనలో ప్రాణాలను త్యాగం చేసిన అమరులకు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సిరిసిల్ల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం ఘన నివాళి అర్పించారు. అదనపు కలెక్టర్ లు ఎన్ ఖీమ్యా నాయక్, పూజారి గౌతమి లు అమరులను స్మరించుకుంటూ 2నిమిషాలు మౌనం పాటించారు. జాతిపిత, మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమర వీరులను ప్రతి ఏటా జనవరి 30 వ తేదీన స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లు ఎన్ ఖీమ్యా నాయక్, పూజారి గౌతమి లు మాట్లాడుతూ... మహాత్ముడి గొప్ప ఆలోచనలను ప్రజల్లోకి మరింత తీసుకెళ్లేందుకు సమష్టిగా ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో డిపిఆర్ఓ మామిండ్ల దశరథం, కలెక్టరేట్ విభాగాల పర్యవేక్షకులు శ్రీకాంత్, రమేష్ , ఈడీఎం శ్రీనివాస్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించిన వైద్యులు


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న హుజురాబాద్ ,జమ్మికుంట వైద్యులు

నవతెలంగాణ - జమ్మికుంట : అమర వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక గాంధీ చౌరస్తా నుండి బస్టాండ్ వరకు ఐఎంఏ హుజురాబాద్, జమ్మికుంట అధ్యక్షులు అంకం సుధాకర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమర వైద్యుల చిత్రపటాలకు నివాళులర్పించి, సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోవిడ్ అమర వైద్యుల సంతాప కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులతో నివాళులు అర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ జమ్మికుంట, హుజురాబాద్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఉడుగుల సురేష్ వైద్యులు ముక్క రాజేశ్వరయ్య డాక్టర్ రమేష్ , ఆకుల శ్రీనివాస్ ,పచ్చిక శ్రీకాంత్ రెడ్డి, సుమన్, ముక్క వాణి , వొల్లాల రాణి, అనిత తదితరులు పాల్గొన్నారు.

టచ్చేసి చూడు..?

- ఇంత అహంకార మాటలు పనికిరావు కేటీఆర్కు..
- పేద బడుగు బలహీన కార్మిక కర్షక పార్టీ కాంగ్రెస్...
- దొరల పాలన పోయి ప్రజాపాలన వచ్చింది...
- ముస్తాబాద్లో మంత్రి పొన్నం


మాట్లాడుతున్న మంత్రి పొన్నం

నవతెలంగాణ-ముస్తాబాద్

బీసీలు, ఎస్సీలు ఎమ్మెల్యేలుగా ఉండకూడదా.. బట్టలు ఊడదీస్తానంటూ మంత్రి కేటీఆర్ ప్రస్తావించడం ఎంత అహంకార పూరితమైన మాటలు.. ప్రజల గమనిస్తున్నారు.. మమ్మల్ని టచ్ చేసి చూడు అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫైర్ అయ్యారు. ఇది దొరల పాలన కాదని ప్రజాపాలన అని గతంలో అధికారంలో ఉన్న మంత్రులు ఎమ్మెల్యేలు ఏ ఊర్లలోకి వచ్చిన ప్రతిపక్ష పార్టీ వాళ్ళను రాత్రికి రాత్రి అరెస్టు చేసే వారు. మా ప్రజా పాలనలో ప్రతిపక్షాల వారిని కూడా మంత్రులను ఎమ్మెల్యేలను కలిసి సమస్యలను చెప్పమని అడుగుతున్నామన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన పది నిమిషాల్లోనే ముండ్ల కంచెలను తొలగించి ప్రజలను ఆహ్వానించామన్నారు. ప్రజలు మీ పాలన వద్దనుకున్నారని అందుకే కాంగ్రెస్ పార్టీని గెలిపించి కాంగ్రెస్కు పట్టం కట్టారన్నారు. గతంలో ఉన్న పాలన ప్రస్తుతమున్న పాలన ఎలా ఉందో ప్రజలకు అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద బడుగు బలహీన కార్మిక కర్షకుల పార్టీ అని వారికి ఎల్లప్పుడూ దండుగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇప్పటికే రెండు అమలు చేశామని అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా గడవకుండానే హామీలు నెరవేర్చడం లేదని బీఆర్ఎస్ వాళ్లు మాట్లాడడం విడ్డూరంగా ఉందని పది సంవత్సరాల పాలనలో ప్రజలకు ఎంత మేలు చేశారో చెప్పాలన్నారు. ఎక్కడ చూసినా అవినీతిమయమేనని రాష్ట్రానంతా అప్పులపాలు చేసిందన్నారు. అనంతరం మండల జెడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ యాదగిరిగౌడ్, ముస్తాబాద్ సింగిల్ విండో చైర్మన్ రాజేందర్ రెడ్డి, డైరెక్టర్ ముత్యాల దేవేందర్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు కిషన్ రావు, మాజీ ఎంపీపీలక్ష్మి, ముస్తాబాద్ మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు, మాజీ ఎంపీపీ, మాజీ వార్డు సభ్యులతో కలిసి ముస్తాబాద్ మండల కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 1000 మందితో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కనిమేని చక్రధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు గజ్జల రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకులు ఒరగంటి తిరుపతి, దీటి నరసింహులు, బుర్ర రాములు గౌడ్, పెద్ది గారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- పెండింగ్ బిల్లులు ఇప్పించండి రుణపడి ఉంటాం
- అధికారులపై మండిపడిన సర్పంచ్లు


మాట్లాడుతున్న ప్రజా ప్రతినిధులు

నవతెలంగాణ - వీర్నపల్లి

వీర్నపల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మాలోతు భూలా అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్ దినకర్ 2018పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం సర్పంచ్ను పట్టుపట్టి అభివృద్ధి పనులును చేయించారు.. పనులు చేయకపోతే పనులు జాప్యం చేస్తే కలెక్టరులు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. బిల్లు రాకున్నా అప్పో సప్పో తెచ్చి అభివృద్ధి పనులు చేస్తే అయిదు సంవత్సరాలు పూర్తి అయినా బిల్లు రాలేదు.. ఇదే మాకు చివరి సమావేశం ఇప్పటికైనా చేసిన అభివృద్ధి పనులలో ఎంబీ రికార్డ్ చేసి ఈ రెండు రోజుల్లో అయినా మా పెడింగ్ బిల్లు చెల్లిస్తే మికు రుణపడి ఉంటామని అవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్లకు బిల్లు రాకుండా ఇబ్బందుల పెట్టిన అధికారులకు త్వరలోనే సరైన ఫలితాలు దక్కుతాయన్నారు. ఎంపీటీసీ అరుణ్ కుమార్ ఎసంగి పంట కాలంలో ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ముందస్తు ప్రణాళిక చేసి యాసంగిలో లారీల కొరత, గన్ని సంచుల కొరత లేకుండా రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని కోరారు. ఎర్రగడ్డ తండ సర్పంచ్ జగ్మల్, శాంతి నగర్ సర్పంచ్ మల్లేశం పెండింగ్ బిల్లులులో ముందస్తు హెచ్చరికలు జారీ చేయకుండానే ఇంటిటికి వెళ్లి కరెంట్ బిల్లు కట్టిన కరెంట్ వైర్లను తొలగించడంపై మండి పడ్డారు. తొలగించిన క్రమంలో ట్రాన్స్ ఫార్మర్పై ఉన్న లాక్ వేయకుండడంతో ఓవర్ లోడ్తో వైర్లు తెగిపోయయని గ్రామ హెల్పర్లకు ఫోన్ చేసిన స్పందించలేదు వైర్లు తెగి చావమంటరా? అని సర్పంచ్ జగ్మల్ సెస్ ఎఈపై మండిపడ్డరు. ఇలాంటి ఘటనలో గతంలో ఇద్దరు మరణించారు. అయినా మీ అధికారులు పట్టించుకోవడం లేదు మేము చెప్పినా పట్టించుకోరు మీకు పెండింగ్ బిల్లులు కావాలి కాని ప్రజల సమస్యలు మాత్రం పట్టవన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథగా కార్యక్రమం చేపట్టిన మిషన్ భగీరథ నీళ్లు మాత్రం అయిదు ఎండ్లలో ఒక్కసారి కూడా 30శాతం అందించిన దాఖలాల్లేవన్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాక బోరు మోటార్లకు రిపేర్కు ఎక్కువ ఖర్చు అయిందన్నారు. మిషన్ భగీరథ నీరు తాగాలని చెప్పిన అధికారులు మాత్రం టాటా వాటర్ తాగడం గమనార్హమన్నారు. చేసిన మిషన్ భగీరథ పనులకు బిల్లులు ఇప్పించాలని సర్పంచ్లు అధికారులను కోరారు. సర్పంచ్ వీర్నపల్లిపై అధికారులు ప్రజా ప్రతినిధులు కక్ష కట్టినట్లు అభివృద్ధి చేయలేదు శ్మశాన వాటికకు కరెంట్, సిసి రోడ్డు, బోరు బావి ఎలాంటి సౌకర్యం కొరకు ఎన్ని సార్లు విన్నవించినా స్పందించలేదన్నారు. వీర్నపల్లి కేంద్రంలో డబుల్ రోడ్డు కోసం మూడు సార్లు గ్రామ పంచాయతీ మార్కింగ్ ఇచ్చినా రోడ్డు పనులు చేయలేదని, రోడ్డుపై గుంతలు ఏర్పడిన ప్రతిసారీ మట్టి పోయడానికే లక్షలు ఖర్చు అయ్యాయని తెలిపారు. ఉపాధి హామీ, విద్య, ఆరోగ్య శాఖ, అంగన్వాడీపై చర్చించకుండానే సమావేశం ముగించారు. గైర్హాజర్ అయిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎంపీపీ తెలిపారు. ప్రతి సమస్యను పరిష్కరించి మండలంలో ఉన్న పెండింగ్ బిల్లులు, అభివృద్ధి పనులను పూర్తి చేసి మండల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీపీ భులా, జెడ్పీటీసీ కళావతి తెలిపారు. అనంతరం సర్పంచ్లకు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇసంపల్లి హేమ, ఏఎంసి చైర్మన్ రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ మల్లేశం, జెడ్పీ కో ఆప్షన్ చాంద్ పాషా, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు సాగర్, తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ నరేష్, ఏఓ భూమ్రెడ్డి, ఏపీఎం నర్సయ్య, ఏఈ అనిల్, ఏఈ వెంకన్న, ఎంఈవో రఘుపతి సర్పంచ్లు ఎంపీటీసీలు అధికారులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- మంత్రి పొన్నం ప్రభాకర్


నూతన గ్రామ పంచాయతీని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం


కాంగ్రెస్లోకి చేరిన గంభీరావుపేట సర్పంచ్ శ్రీధర్

నవతెలంగాణ - గంభీరావుపేట :

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. మంగళవారం గంభీరావుపేట మండల పరిధిలోని కోళ్లమద్ది గ్రామంలో 20లక్షల వ్యయంతో నూతన గ్రామపంచాయతీ కార్యాలయమును వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను ఖచ్చితంగా అమలు చేసి తీరుతుందన్నారు. రానున్న రోజుల్లో మరో రెండు పథకాలను అమలు చేసి నిరూపిస్తామని తెలిపారు. గత ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపెడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏనుగు కేశవరావు, అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, రాష్ట్ర సీనియర్ నాయకులు కొండూరు గాంధీ, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. గంభీరావుపేట మండల పరిధిలోని గ్రామపంచాయతీ సమీపంలో నూతన దుకాణ సముదాయాలను రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లు పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కటకం శ్రీధర్ పంతులు, రాష్ట్ర సీనియర్ నాయకులు కొండూరు గాంధీ, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ లోకి గంభీరావుపేట సర్పంచ్ చేరిక

గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కటకం శ్రీధర్ పంతులు మంగళవారం రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చేతుల మీదుగా కాంగ్రెస్ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. గత ప్రభుత్వంలో కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలోనే కాంగ్రెస్ మద్దతుతో గెలిచి అందరి దష్టిని తన వైపు తిప్పుకున్నాడు. గంభీరావుపేట అభివృద్దే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేరాడు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గంభీరావుపేట జాతీయ ఉత్తమ గ్రామ సర్పంచ్గా శ్రీధర్ అవార్డు అందుకున్నారు. తన రాజకీయ కుటుంబం కాంగ్రెస్ ప్రస్థానం ఉన్న నేపథ్యంలో తిరిగి కాంగ్రెస్లో చేరారు.

జిల్లాలో భూఅక్రమార్కులపై ఉక్కుపాదం

- సెస్ అక్రమాలపై ప్రభుత్వం సీరియస్
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం
- మంత్రి పొన్నం ప్రభాకర్


సిరిసిల్ల కలెక్టరేట్ లో జిల్లా అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - సిరిసిల్ల : జిల్లాలో భూఅక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలనీ జిల్లా యంత్రాంగానికి రాష్ట్ర రవాణా, బీసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మంగళవారం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో రాష్ట్ర రవాణా, బీసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్, జిల్లా ఫారెస్ట్ అధికారి బాలమనితో కలిసి సిరిసిల్ల ఐడిఓసిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2014కు ముందు ప్రభుత్వ భూమిగా రికార్డ్లో ఉండి.. తర్వాత అన్యాక్రాంతం అయిన భూముల పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అన్యాక్రాంతం అయిన భూములను భూ బకాసురుల కబంధ హస్తాల నుంచి విడిపించి తిరిగి స్వాధీనం చేసుకోవాలని జిల్లా యంత్రాంగానికి విస్పష్ట ఆదేశాలు జారీ చేశారు. స్వాధీనం చేసుకున్న స్థలాలను విద్యా సంస్థల నిర్మాణాలు, ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించుకోవాలన్నారు. జిల్లాలో బిడ్డ పెళ్లి కోసమో, తమ బిడ్డల ఉన్నత చదువుల కోసమో ముందు చూపుతో పైసా పైసా కూడ బెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లను సైతం రాజకీయ పలుకుబడి, అధికారుల అండ, కండ బలంతో కబ్జాకోరులు కైంకర్యం చేసిన ఘటనలు ఉన్నాయన్నారు. తమ స్థలాలను ఎవరైనా ఆక్రమించుకుంటే ప్రజలు తగు ఆధారాలతో జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేయాలనీ మంత్రి చెప్పారు. మీడియా దృష్టికి తేవాలన్నారు. భూ ఆక్రమార్కుల కోరలుపీకి భూములను నిజ యజమానులకు అప్పగిస్తామని చెప్పారు. సెస్లో అక్రమాలపై ప్రభుత్వం సీరియస్గా ఉందన్నారు. సెస్లో జరిగిన అక్రమాల గురించి ప్రజలకు ఏదైనా సమాచారం ఉంటే కలెక్టర్, ఎస్పి దృష్టికి ఆధారాలతో తీసుకువస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వేసవిలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలనీ మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటి సరఫరా అన్ని గ్రామాలకు నిరంతరరాయంగా జరిగేలా చూడాలన్నారు. చేప పిల్లల విత్తన ఉత్పత్తికి మధ్య మానేరు జలాశయం కేంద్ర బిందువు కావాలని తెలంగాణ మొత్తానికీ చేప పిల్లల విత్తన సరఫరా కు రాజన్న సిరిసిల్ల జిల్లా అన్ని విధాలుగా అనువుగా ఉందన్నారు. మధ్య మానేరు జలాశయం కేంద్రంగా చేప పిల్లల విత్తన ఉత్పత్తికి కేంద్ర బిందువుగా చేసి ఇక్కడి నుంచే తెలంగాణలోని అన్ని జలాశయాలకు చేప పిల్లలను సరఫరా చేసే కార్యచరణ సిద్ధం చేయాలని మంత్రి ఫిషరీస్ అధికారులకు సూచించారు.

అవినీతి అధికారుల భరతం పడతాం

ఏసీబీ డీఎస్పీ వివి రమణమూర్తి

నవతెలంగాణ - సిరిసిల్ల

అవినీతి అధికారుల భరతం పడతామని అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ వివి రమణమూర్తి సోమవారం పేర్కొన్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిన వారి పేర్లు నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చునని, వివరాలు చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఏ అధికారి అయినా లంచం ఇవ్వందే పని చేయమని ఇబ్బంది పెడితే, వెంటనే తమకు తెలియజేయాలని సదరు అధికారులను ట్రాప్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ అవినీతి జరిగిన అవినీతి నిరోధక శాఖ డిఎస్పి వివి రమణమూర్తి 9154388954, ఇన్స్పెక్టర్ రాము 9154388956, ఇన్స్పెక్టర్ తిరుపతి 9154388955, ఇన్స్పెక్టర్ రవీందర్ 9154388957 అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.

వేములవాడ రాజన్న ఆలయంలో శ్రీ త్యాగరాజ ఆరోధానోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ - సిరిసిల్ల డెస్క్:

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సద్గురు శ్రీ త్యాగరాజ స్వామివారి అరాధనోత్సవాలను ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉదయం స్వస్తి పుణ్యాహవాచనము నిర్వహించి పట్టణంలో నగర సంకీర్తన చేశారు. ఐదు రోజుల పాటు వైభవంగా ఉత్సవాలను జరిపించెందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కర్ణాటక సంగీతంలో ప్రఖ్యాతి గాంచిన ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాజు రచించిన శ్రీ రామ కీర్తనలు ఎంతో గుర్తింపు నిచ్చాయి. కర్ణాటక సంగీతంలో ఎంతో పేరు ప్రతిష్టతలు సంపాదించిన శ్రీ త్యాగరాజస్వామి వారి జన్మదినం రోజుని సంగీత దినంగా, అరాధనోత్సవాలను రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్నారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో గత 71 ఏళ్లుగా శ్రీ త్యాగరాజ స్వామివారి అరాధనోత్సములను ప్రతియేటా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ త్యాగరాజ ఉత్సవములలో తెలంగాణ రాష్ట్రంతో పాటు వివిధ ప్రాంతాలకి చెందిన సుప్రసిద్ధ కళాకారులచే శాస్త్రీయ, భక్తీ, సంగీత, జంత్రవాద్య, సోలో, హరికథ, నృత్యా, హరికథ, నాటక, ఉపన్యాస, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

జెడ్పీ కో ఆప్షన్ నిధులతో బోరు బావి ఏర్పాటు

నవతెలంగాణ - వీర్నపల్లి

వీర్నపల్లి మండలం అడవి పదిర గ్రామంలో జెడ్పీ కో ఆప్షన్ నిధులతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద జెడ్పీ కో ఆప్షన్ నిధుల నుంచి మంజూరైన బోరు బావిని సర్పంచ్ ఎడ్ల లక్ష్మీ రాజం ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎఎంసీ చైర్మన్ గుజ్జులా రాజిరెడ్డి, మండల కో ఆప్షన్ ఉస్మాన్, బంజార సంఘం రాష్ట్ర నాయకులు సురేష్ నాయక్, ఎస్సీ కమ్యూనిటీ అధ్యక్షులు బైరి భాస్కర్, వీర్నపల్లి సర్పంచ్ దినకర్, గర్జన పల్లి ఉప సర్పంచ్ రామస్వామి, బి అర్ ఎస్ మండల నాయకులు తిప్ప వరం భాస్కర్, వార్డు సభ్యులు రాజం తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేసే విధానంపై అవగాహన అవసరం

జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్


ఓటు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ - సిరిసిల్ల

ఈవీఎం, వీవీప్యాట్ల ద్వారా ఓటు వేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో ఈవీఎం, వీవీప్యాట్ల అవగాహన ప్రదర్శన కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి కలెక్టరేట్కు, ఐడీఓసీలోని ప్రభుత్వ శాఖలకు వచ్చే ప్రజలకు ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సెస్ చైర్మెన్ చిక్కాల రామారావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ పాషా, రహమాన్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి


బహుమతులను అందిస్తున్న జిల్లా ఎస్పీ

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ :

మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం గాంధీ వర్ధంతి సందర్భంగా విద్యార్థినుల కు మహాత్మా గాంధీ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. మహాత్మా గాంధీ పోరాడిన తీరును విద్యార్థినులు చాలా చక్కగా రాశారు. ఈ వ్యాసరచన పోటీలు తెలుగు విభాగంలో విజేతలైన విద్యార్థినులకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పుస్తకాలు అందజేశారు. విద్యార్థినిలు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన సూచించారు. గెలుపొందిన విద్యార్థినిలు సృజన మొదటి బహుమతి, రెండో బహుమతి భవ్య శ్రీ, మూడో బహుమతి కె రేణుక. ఆంగ్ల విభాగంలో హర్షిని మొదటి బహుమతి, కార్తిక రెండవ బహుమతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో మానేరు రచయితల సంఘము ప్రధాన కార్యదర్శి ఆడేపు లక్ష్మణ్, ఉపాధ్యక్షులు బురదేవానందం, చిటికెన కిరణ్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయులు ఎలగొండ రవి, సతీష్ బాబు నరేందర్, వెంకట్ రాములు, తిరుపతి, రాజలింగం పాల్గొన్నారు.

టీపీటీఫ్ విద్యా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్: ఖమ్మంలో వచ్చే నెల 11, 12 తేదీలలో జరిగే టీపీటీఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహా సభలకు సంబంధించిన పోస్టర్ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్క రించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కేకే మహేందర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాతూరి మహేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దోర్నాల భూపాల్ రెడ్డి, దుమల రమానాథ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఉమా బాల్ చందర్, పురెల్లి రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు పురం వాసుదేవరావు పురుషోత్తం, అంజయ్య, శ్రీధర్, వివిధ మండల ప్రధాన బాధ్యులు, ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్ను విజయవంతం చేయండి

ఆల్ ట్రేడ్ యూనియన్స్ నాయకుల పిలుపు


అభివాదం చేస్తున్న ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల డెస్క్ : ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్ ను విజయవంతం చేయాలని ఆల్ ట్రేడ్ యూనియన్స్ నాయకుల పిలుపునిచ్చారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం సుభాష్ నగర్ లోని ఏఐటీయూసీ కార్మిక భవనంలో ఆల్ ట్రేడ్ యూనియన్స్ నాయకుల సమావేశం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో గత పది సంవత్సరాల నుండి అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వ నిరంకుశ పాలనలో దేశంలో అసమానతలు, నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయాయన్నారు. కార్మికుల, రైతుల హక్కులు కాలరాయపడ్డాయని పేద సామాన్య ప్రజల బతుకులు అస్తవ్యస్తమయ్యాయని అన్నారు. ఫిబ్రవరి - 16 న జరిగే దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్ లో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు, రైతులు, నిరుద్యోగులు ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి జిందం ప్రసాద్, ఐఎన్టీయూసీ జిల్లా కార్యదర్శి గొట్టె రుక్మిణి, బీఆర్టీయూ, నాయకులు పొరండ్ల రమేష్, టీఎస్టీయూసీ నాయకులు మోతె రాజు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి : జ్యోతి



నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్:
కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని అంగన్‌వాడీ ఎంప్లాయిస్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి జి జ్యోతి పిలుపునిచ్చారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో ఐసీడీఓస్‌కు బడ్జెట్ 60 శాతానికి తగ్గించిందన్నారు. అంగన్వాడీ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు రావడం లేదని, టీఏ, డీఏలు మొత్తానికి చెల్లించడం లేదన్నారు. ఆమె వెంట సీఐటీయూ నాయకులు బూడిద గణేష్,ఆర్ల సందీప్,తదితరులు ఉన్నారు.

అమరవీరులను స్మరిస్తూ ఉద్యోగుల మౌనం

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్:



భారత స్వాతంత్రోద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరిస్తూ రామగుండం నగర పాలక సంస్థ ఉద్యోగులు మంగళవారం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అమరవీరుల దినోత్సవం, మహాత్మాగాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ రాజలింగు, ఆర్ఐలు శంకర్ రావు, కరుణాకర్, హెల్త్ అసిస్టెంట్‌లు కిరణ్, వైకుంఠం తదితరులున్నారు.

కృష్ణవేణి స్కూల్లో నటుడు సోహెల్ హంగామా

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్:



మాట్లాడుతున్న సినీ నటుడు సోహెల్

బూట్ కట్ బాలరాజు మూవీ ప్రమోషన్‌లో భాగంగా సినీ నటుడు, బిగ్‌బాస్ విన్నర్ సోహెల్, రైటర్ రాకేష్ స్థానిక మార్కండేయ కాలనీలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో హంగామా చేశారు. విద్యార్థినీ, విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నాడు. ఈ సినిమా ఫిబ్రవరి 2న శుక్రవారం రోజు రిలీజ్ అవుతుందని, అందరూ చూసి తనను ఆశీర్వదించాలని కోరారు.

గోదావరిఖనిలో గాంధీ వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్:



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు మాలెం మధు

గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతిని దళిత మాల సంఘం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే మాలెం మల్లేశం తనయుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాలెం మధు మాట్లాడుతూ సత్యమేవ జయతే నినాదంతో మహాత్మా గాంధీ అహింసతో స్వాతంత్ర్యం తేవడంలో ప్రధాన పాత్ర వహించారని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పిట్టల వెంకటి, ఉపాధ్యక్షుడు నాగేష్, కొండ కుమార్, దాసరి రామస్వామి, దాసరి వెంకట్, సోగ్గాల వెంకట్, కొండయ్య, దాసరి రమేష్ తదితరులున్నారు.

జీఎంను కలిసిన అధికారుల సంఘం సభ్యులు

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్:



ఇటీవల జరిగిన సింగరేణి (సీఎంఓఏఐ) కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఇండియా ఎన్నికలలో ఎన్నిక కాబడిన అధికారుల సంఘం సభ్యులు ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో జీఎం చింతల శ్రీనివాస్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ సీఎంఓఏఐ ఎన్నికలలో ఎన్నిక కాబడిన అధికారులకు ముందుగా అభినందనలు తెలియజేశారు. అధికారుల సమస్యల సాధనలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బ్రాంచ్ పొనుగోటి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరి కిరణ్ రాజ్ కుమార్, ఆర్జీ-1 ఏరియా అధికారుల సంఘం సభ్యులు ప్రెసిడెంట్ బి.మల్లేష్, వైస్ ప్రెసిడెంట్ దుబాసి విష్ణు మూర్తి, పేరుమల్ల శ్రీనివాస్,అధికారులున్నారు.

అఖిలభారత సమ్మెలో అంగన్వాడీ ఉద్యోగులు పాల్గొనాలి

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్:



ఐసీడీఎస్‌లో, అంగన్వాడీ ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న జరిగే అఖిలభారత సమ్మెలో మంథని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రాజెక్టు కమిటీ విజ్ఞప్తి చేసింది.ఈ సందర్భంగా జిల్లా మంథని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారినికి సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి వనజారాణి,జి జ్యోతి, సహాయ కార్యదర్శి టి.కృష్ణకుమారి, నాయకులు బూడిద గణేష్, సందీప్,ప్రాజెక్టు నాయకులు సుగుణ,శోభ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే అడ్లూరి

నవతెలంగాణ-ధర్మారం



మండల సమాఖ్య భవనాన్ని ప్రారంభిస్తున్న అడ్లూరి లక్ష్మణ్

మండల కేంద్రంలో మహిళా సమాఖ్య సంఘ భవనం బొమ్మారెడ్డిపల్లి బంజరు పల్లి తండా మల్లాపూర్ బోట్ల వనపర్తి గ్రామాలలో గ్రామపంచాయతీ నూతన భవనాలను ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అట్లూరి లక్ష్మణ్ కుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మహిళా గ్రామైఖ్య సంఘాల నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మీటింగ్ హాల్ రెనోవేషన్ వర్క్‌కి సంబందించిన పనుల శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పీటీసీ కూసుకూరు పద్మజ జితేందర్ రావు ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాంపల్లి అపర్ణ కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

మహాత్మా గాంధీకి కాంగ్రెస్ నాయకుల నివాళులు

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్:



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మంథనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ సత్యం,అహింస గాంధీ నమ్మే సిద్ధాంత మూలాలని, అన్యాయాలకు సహాయ నిరాకరణ, సత్యాగ్రహం అతని ఆయుధాలని కొనియాడారు. ఒక్క రక్తపు బొట్టు చిందకుండా శాంతియుతంగా స్వాతంత్ర్యం తీసుకువచ్చిన ఘనత గాంధీజీది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్,జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుదుల వెంకన్న, మంథని డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంథని సత్యనారాయణ, మండల అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్, పట్టణ యూత్ అధ్యక్షుడు పెంటరి రాజు, పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

మహాత్మా గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు మంథని వాసవి క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ వల్లాల వెంకటేశ్వర్లు క్లబ్ కార్యదర్శి ఇల్లందుల కిషోర్ కుమార్‌లు పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ 76వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం మంథని పట్టణంలోని గాంధీ చౌక్ లో మహాత్మా గాంధీ విగ్రహానికి మంథని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ అమిత మార్గం అనుసరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు కొమురవెల్లి మహారాజ శ్రీనివాస్, నాయకులు దొంతుల ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

▸ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్:



జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఎస్‌డీఎఫ్, డీఎంఎఫ్‌టీ, సీడీపీ, సీఎస్ఆర్, సీబీఎఫ్ ఫండ్స్ అభివృద్ధి పనుల పురోగతిపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్‌డీఎఫ్, డీఎంఎఫ్‌టీ, సీడీపీ, సీఎస్ఆర్, సీబీఎఫ్ ద్వారా మంజూరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై ఇక నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి రివ్యూ నిర్వహించి పురోగతి సమీక్షించడం జరుగుతుందని, ఇప్పటివరకు ప్రారంభం కాని పనులలో అత్యంత అవసరమైన పనులను అధికారులు గుర్తించి వెంటనే ప్రారంభం చేసి రాబోయే సమావేశం నాటికి నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి గంప రవీందర్, ఈఈ పంచాయతీ రాజ్ బి.గిరీష్ బాబు, పంచాయతీరాజ్ శాఖ ఎస్. ఈసీహెచ్. రషీద్, ఈఈ ఆర్ అండ్ బీసీ రాములు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

తపాలాశాఖ భీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

▸ పది లక్షల ప్రమాద భీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్:
తపాలా శాఖ ద్వారా ప్రవేశ పెట్టిన భీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని తపాలా శాఖ పెద్దపల్లి డివిజన్ సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్ అన్నారు. పెద్దపల్లి మండలం గౌరెడ్డి పేట గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం పెద్దపల్లి డివిజన్ తపాలా శాఖ సూపరింటెండెంట్ ప్రభాకర్ ఆధ్వర్యంలో భీమా పాలసీలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తపాలా శాఖలో ప్రమాద భీమా పాలసీ తీసుకుని గత ఏడాది ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం ప్రమాదంలో మృతి చెందిన గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన మిట్టపల్లి శంకమ్మ కుమారుడైన మిట్టపల్లి సంతోష్ కు పది లక్షల ప్రమాద భీమా పాలసీ చెక్కును అందించారు.ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ తపాలా శాఖ ద్వారా భీమా పథకాలపై ప్రజలకు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆకుల సునీల్, పెద్దపల్లి పోస్టల్



ఇన్స్‌పెక్టర్ నరేష్ అరికాల, పెద్దపల్లి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ కొట్టే శ్రీనివాస్, మెయిల్ ఓవర్ సీయర్ బండారి కుమార స్వామి, గౌరెడ్డి పేట బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ పృధ్వీ పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్:



నివాళులర్పిస్తున్న నాయకులు

సుల్తానాబాద్‌లో మంగళవారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్య భవన్ ఎదుట గల మహాత్మా గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు కొమురవెల్లి రామ్మూర్తి, కొమురవెల్లి భాస్కర్, సెక్రటరీ పల్లా శ్రీనివాస్, వాసవి మాత దేవాలయం చైర్మన్ చకిలం మారుతి, శివాలయం చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, పట్టణ ఆర్యవైశ్య సంఘం యూత్ అధ్యక్షులు శివనత్రి ప్రసాద్, సామాజిక సేవకులు పల్లకిషన్, ముత్యాల కిషన్ పాల్గొన్నారు.

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవం

నవతెలంగాణ-జూలపల్లి



ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

జూలపల్లి మండల కేంద్రంలో మంగళవారం రోజున ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిని నిర్మూలించడానికి తీసుకోవా లసిన జాగ్రత్తలు, అవగాహన కల్పిస్తూ గ్రామంలో వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహిం చారు.అబ్బాపూర్ గ్రామంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు అవగాహన సదస్సు కల్పిస్తూ,ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అబ్బాపూర్ గ్రామ సర్పంచ్ ఇర్ల మల్లేశం, అంగన్‌వాడీ టీచర్ సత్యవతి, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నేటి నుంచి పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్

నవతెలంగాణ-ఓదెల



ఓదెల మండల కేంద్రంలో నేటి నుంచి పెంపుడు జంతువులకు యాంటీ రేబీస్ వ్యాక్సినేషన్ వేస్తున్నట్లు ఓదెల పశువైద్యాధికారి కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కుమార స్వామి మాట్లాడుతూ పెంపుడు జంతువులను పెంచుకుంటున్న యజమానులు పెంపుడు జంతువులను ఓదెల పశు వైద్యశాలకు తీసుకొని వచ్చి యాంటీ రేబీస్ వ్యాక్సిన్ చేయించాలని సూచించారు.

ఓదెల మల్లికార్జున స్వామి ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-ఓదెల
జిల్లాలోనే అతిపెద్ద శైవ క్షేత్రమైన ఓదెల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున హుండీ ఆదాయాన్ని మంగళవారం రోజున ఆలయ అధికారుల సమక్షంలో లెక్కించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ హుండీ ఆదాయం 30 లక్షల 77 వేల 643 రూపాయలు వచ్చినట్లు ఆలయ ఈవో సదయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ సుజాత, ధర్మకర్తలు మ్యాడగొని శ్రీకాంత్ గౌడ్, బత్తుల రమేష్, చింత కుమార్ స్వామి, దేవాలయ సిబ్బంది, వాసవి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మాదిగ శక్తి జిల్లా కో కన్వీనర్‌గా ఈదునూరి ప్రేమ్

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్:



పెద్దపల్లి పట్టణానికి చెందిన ఈదునూరి ప్రేమ్‌ను పెద్దపల్లి జిల్లా మాదిగ శక్తి కో కన్వీనర్ గా నియామకం చేసినట్లు మాదిగ శక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రజా ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటున్న ఈదునూరి ప్రేమ్‌ను మాదిగ శక్తి జిల్లా కోకన్వీనర్‌గా నియామకం చేయడం జరిగిందని, జిల్లాలో నూతన కమిటీలను ఏర్పాటు చేసి మాదిగలకు న్యాయంగా రావాల్సిన రాజకీయ వాటా కోసం,మాదిగలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగే విధంగా కృషి చేయాలని సురేందర్ సన్ని సూచించారు.

ఆర్జీ-2లో సర్వే మజ్దూర్ రాత పరీక్ష నిర్వహణ

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్:



పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఆర్జీ.2 అధికారులు

ఆర్జీ-2 సెక్టర్-3 సింగరేణి హైస్కూల్ నందు ఆర్జీ-2 ఏరియా లో పని చేస్తున్న జనరల్ మజ్దూర్ ఇంటర్నల్ ఉద్యోగులకు సర్వే మజ్దూర్‌గా ఎంపికకై రాత పరీక్షను అధికారులు నిర్వహిం చారు.ఈ రాత పరీక్షను ఎస్ఓటు జీఎం అబ్దుల్ సలీం ప్రశ్న పత్రాలను సీల్ ఓపన్ చేసి, పరీక్షలు జరుతున్న సరళిని పరిశీలించారు.మొత్తం 5 ఖాళీలకు గాను 137 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 119 మంది రాత పరీక్షకు హాజరయ్యారు.

ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు

నవ తెలంగాణ-జూలపల్లి



మౌనం పాటిస్తున్న అధికారులు

జూలపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో మంగళవారం రోజున జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జాతికి వారు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించి వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వారు జాతికి చేసిన సేవలను గుర్తు చేశారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాలరావు,సూపరిండెంట్ వాణి శ్రీ,సీనియర్ అసిస్టెంట్,జూనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

అతివేగానికి రెండు నిండు ప్రాణాలు బలి

నవతెలంగాణ-ఓదెల:



ఓదెల మండలంలోని గోపరపల్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. పొత్కపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రోజున సుమారు రాత్రి 9 గంటల సమయంలో ముగ్గురు యువకులు ఒకే మోటార్ సైకిల్ పై అతివేగంగా నడపడం వల్ల గ్రామా శివారులో అదుపుతప్పి కింద పడి ఇద్దరు మృతిచెందారు. మృతి చెందిన వారిలో గోపరపల్లి గ్రామానికి చెందిన దాసరి వంశీకృష్ణారెడ్డి, పెగడపల్లి గ్రామానికి చెందిన జీల మహేష్ మృతి చెందారు. దాసరి నరసింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మోటార్ సైకిల్‌ను అజాగ్రత్తగా అతివేగంగా నడిపి ప్రమాదానికి కారణమైన సుగ్గంపల్లి గ్రామానికి చెందిన పసిడ్ల సంజయ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్. శ్రీధర్ తెలిపారు.

పది సంవత్సరాల తర్వాత ఎమ్మెల్సీ కవితకు పూలే జ్ఞాపకమొచ్చారా ?

పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ కార్యదర్శి గొటికారి కిషన్

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్:



జి.కిషన్

పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం కొత్తగా శాసనసభ ఆవరణలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని ఆవిష్కరించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ కార్యదర్శి గొటికారి కిషన్ జీ పేర్కొన్నారు.బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు విగ్రహ ఆవిష్కరణ ఆలోచన చేయకపోవడం విడ్డూరం అని తెలిపారు.

మరణించిన కార్మికుల వారసులకు తగిన ఉద్యోగం ఇవ్వాలి

▸ ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్:
సింగరేణిలో గని ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల వారసులకు వారి చదువులకు తగిన ఉద్యోగం ఇవ్వాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గుర్తింపు సంఘం కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన ఏఐటీయూసీ కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ 2ఎ ఇంక్లైన్ గని ప్రమాదంలో



మాట్లాడుతున్న గుర్తింపు సంఘం నాయకులు

మైనింగ్ సర్దార్ మాందాడి సమ్మిరెడ్డి మృతి చెందడం అత్యంత బాధాకరమని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వారు వ్యక్తం చేశారు. సింగరేణిలో రిటైర్డ్ కార్మికులకు క్వార్టర్ వెకేషన్ సర్టిఫికెట్ ఇవ్వకుండా నెలల తరబడి జీఎం ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటూ గ్రాట్యుటీ చెల్లించకుండా ఆర్జీ-1 యాజమాన్యం వేధింపులకు గురిచేస్తుందని వారు ఆరోపించారు. ముఖ్యంగా ఆర్జీ-1 పర్సనల్ డిపార్ట్మెంట్, క్వార్టర్ సెక్షన్లు తీవ్ర జాప్యం చేస్తున్నాయని వారు విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగులకు సీపీఆర్ ఎంఎస్ ట్రస్ట్ బోర్డు ఈ నెల 25న కోల్‌కతాలో జరిగిన సమావేశంలో ఔట్ పేషెంట్ ట్రీట్మెంట్ కోసం భార్య భర్తలిద్దరికి చేరి 25 వేల రూపాయలు చెల్లించుటకు అంగీకారం తెలిపిందని వారు పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు ఎస్.వెంకట్ రెడ్డి, గండి ప్రసాద్, కన్నం లక్ష్మి నారాయణ, బండారి శ్రీనివాస్, గొడిశల నరేశ్, పదాల కనకరాజు, బుర్ర భాస్కర్ తదితరులున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్



ఆవిష్కరిస్తున్న రామగుండం ఎమ్మెల్యే

అఖిల గాండ్ల తెలికుల రాష్ట్ర మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, మహిళా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సర్వ సుహాసిని మంగళవారం ఆవిష్కరించారు. రామగుండం నియోజకవర్గంలో గాండ్ల కుల సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో అఖిల గాండ్ల తెలికుల ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జక్కం మారుతి, చంద చంద్రమోహన్ పాల్గొన్నారు.

గుజ్జుల రాజిరెడ్డికే మా పూర్తి మద్దతు

జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ నాయకత్వంలో పని చేస్తాం

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్



మాట్లాడుతున్న పోతిపెద్ది రమణారెడ్డి

ముత్తారం సింగల్ విండో అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డికే మా పూర్తి మద్దతు ఉంటుందని సింగల్ విండో ఉపాధ్యక్షుడు పోతిపెద్ది రమణారెడ్డి, డైరెక్టర్లు గిరి వీరేందర్, కొంకటి మల్లయ్య, అల్లం నిర్మల్ పాపయ్యలు స్పష్టం చేశారు. ముత్తారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మంగళవారం వారు గుజ్జుల రాజిరెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ని ప్రయత్నాలు చేసి, ఎన్ని కుట్రలు,కుతంత్రాలతో, అధికార దాహంతో భయభ్రాంతులకు గురి చేసిన తమ పూర్తి మద్దతు జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ వైపు ఉంటుందని అన్నారు. సమావేశంలో ముత్తారం ఎంపీపీ జక్కుల ముత్తయ్య, వైస్ ఎంపీపీ సుదాడి రవీందర్ రావు, ముత్తారం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి తదితరులున్నారు.

డాక్టర్ సురభి శ్రీధర్‌కు భీమ్ రావు అంబేద్కర్ ఇంటర్నేషనల్ అవార్డు ప్రధానం

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్



అవార్డు అందుకుంటున్న డాక్టర్ సురభి శ్రీధర్

వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో సోమవారం సాయంత్రం హైదరాబాద్ ముషీరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సిటీ కల్చరల్ సెంటర్ ఆడిటోరియంలో భారతరత్న భీమ్ రావు అంబేద్కర్ ఇంటర్నేషనల్ అవార్డును అందించారు. ఈ అవార్డును, కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పంచాయతీరాజ్ శాఖ మాజీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ యాదయ్య గౌడ్, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్, డాక్టర్ జి.నరసింహారావు, డాక్టర్ ఆర్ఎస్ కుమార్, డాక్టర్ వల్లం భారత్ చేతుల మీదుగా భారతరత్న భీమ్ రావు అంబేద్కర్ ఇంటర్నేషనల్ అవార్డును వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్‌కు అందించారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్



పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నమస్తే తెలంగాణ పాత్రికేయుడు దేవర్నేని శ్రీధర్ రావు తల్లి ప్రమీల ఇటీవల మరణించింది. మంగళవారం ముత్తారం మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ పాత్రికేయుడు దేవర్నేని శ్రీధర్ రావును, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి,ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ముత్తారం సర్పంచ్ తూటి రజిత రఫీ, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు గాదం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడి కొండాల్ రెడ్డి తదితరులున్నారు.

మున్నూరు కాపు గ్రామ అధ్యక్షునిగా తొగరి శంకర్

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్



మాట్లాడుతున్న తొగరి శంకర్

ముత్తారం మండల మున్నూరు కాపు అధ్యక్షుడు చల్ల సమ్మయ్య ఆధ్వర్యంలో ముత్తారం గ్రామ సభ్యుల సమావేశం నిర్వహించారు. గ్రామ అధ్యక్షునిగా తొగరి శంకర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం తొగరి శంకర్ మాట్లాడుతూ కుల అభివృద్ధికై అహర్నిశలు కష్టపడతానన్నారు. ఈ కార్యక్రమంలో రాగుల సతీష్, పశుగంటి శంకర్, రాగుల రాజేశం తదితరులున్నారు.

ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్



మహాత్మా గాంధీ 76వ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భూషణ వేణి సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు హాజరై మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఏలువక రాజయ్యలు మాట్లాడుతూ మహాత్మా గాంధీ దేశ స్వతంత్రం కొరకు అహింసా మార్గాన్ని ఎన్నుకొని బ్రిటిష్ వారిని తరిమి కొట్టేందుకై క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహం చేస్తూ ప్రజలను ఏకం చేసి స్వాతంత్రాన్ని సాధించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సుభాష్ రావు, భూతగడ్డ సంపత్, పుష్పకళా శ్రీమాన్,కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు నిట్టెట్లా కుమార్ యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి దొడ్డుపల్లి జగదీష్, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ మస్రత్ పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మాగాంధీ 76వ వర్ధంతి

నవతెలంగాణ-ధర్మారం



మండల కేంద్రంలోని బస్టాండ్ ముందుగల మహాత్మా గాంధీజీ విగ్రహా నికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తాటిపెల్లి ఈశ్వర్ ఆధ్వర్యంలో పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పీటీసీ పూసుకూరు పద్మజ, సర్పంచ్ పూసు కూరు జితేందర్ రావు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మెడవేణి తిరుపతి, ఎంపీటీసీ తుమ్మల రాంబాబు, పాల్గొన్నారు

సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరే విధంగా కృషి

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు

నవతెలంగాణ-కరీంనగర్ డెస్క్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడు తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరే విధంగా కృషిచేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. మంగళవారం కాల్వ శ్రీరాంపూర్ మండలం అంకంపల్లి, మల్యాల గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణ రావు శంకుస్థాపన చేశారు. మండలంలోని అంకంపల్లి గ్రామంలో 20 లక్షల నిధులతో నూతనంగా నిర్మించే గ్రామ పంచాయతీ భవనానికి, MGNREGS నిధులు 19 లక్షల రూపాయలతో పలు సీసీ రోడ్లను, మల్యాల గ్రామంలో 10 లక్షల రూపాయలతో మహిళా భవనానికి, 30 లక్షల రూపాయలతో పలు సీసీ రోడ్లను,డీఎంఎఫ్టీ నిధులు 20 లక్షల రూపాయలతో గ్రామ పంచాయతీ భవన మిగులు పనులకు, ప్రహరీ గోడ, పలు సీసీ రోడ్లకు శంఖుస్థాపన చేశారు. ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించినప్పుడు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, గ్రామాల అభివృద్ధి కోసం తన వంతుగా కృషి చేస్తానని అన్నారు.

అమరుల త్యాగాలు మరవలేనివి

అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్

నవతెలంగాణ-కరీంనగర్ : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించి అమరులైన వారి త్యాగాలను గుర్తిస్తూ భావితరాలకు తెలియజేయడం మన బాధ్యత అని అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ అన్నారు. అమరవీరుల సంస్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని అమరవీరుల సంస్మరణ దినోత్సవం అధికారులు, ఉద్యోగులు పాల్గొని స్వాతంత్రోద్యమ అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామనే ధృఢ సంకల్పంతో వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించి అమరులైన అమర వీరుల సంస్మరణార్థం ప్రతి సంవత్సరం జనవరి 30న అమర వీరుల సంస్మరణ దినోత్సం సందర్భంగా 2నిమిషాలు మౌనం పాటిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ పవన్ కుమార్, కలెక్టరేట్ ఏఓ సుధాకర్, సిబ్బంది, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో విద్యార్థిని ఆత్మహత్య

- లేఖ రాసి సూసైడ్
- మృతిపై తల్లిదండ్రుల అనుమానాలు
- విద్యార్థి సంఘాల ఆందోళన


సూసైడ్ చేసుకున్న విద్యార్థిని

నవతెలంగాణ - కొత్తపల్లి : జిల్లా కేంద్రానికి సమీపంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని అక్షిత సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. చదువులో వెనుకబడటం అవమానంగా భావించి, సూసైడ్ చేసుకుంటున్నట్లు రాసిన లేఖ ఆమె వద్ద లభించింది. ఆత్మహత్య విషయం తెలుకున్న కుటుంబ సభ్యులు కళాశాల వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వివరాలోకి వెళ్తే..

జగిత్యాల జిల్లా మల్యాల మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన అక్షిత కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది.చదువులో వెనుకబడిపోవటంతో అధ్యాపకులు విద్యార్థినిని ఫ్యూచర్ లెర్నర్స్ బ్యాచ్‌లోకి మార్చారు. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. కాగా విద్యార్థిని మృతిపై తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కన్నీరు పెట్టిస్తున్న సూసైడ్ లెటర్

అమ్మా, నాన్న, బైబై... సాహితీ సారీరా నేను రాత్రి 11 గంటలకు చచ్చిపోతున్నాను.. అంటూ ఆ విద్యార్థిని రాసిన సూసైడ్ లెటర్ చదివిన ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యతం అవుతున్నారు. ఆత్మహత్య చేసుకునేముందు లేఖ రాసింది. 'సారీ అమ్మ నేను చనిపోతున్నాను, నాకన్న తక్కువ మార్కులు వచ్చిన వాళ్లు ఉన్నారు. కానీ నేను చనిపోతున్నాను. వద్దు నాకీ బతుకు అంటూ అక్షిత ఆ లేఖలో పేర్కొంది. సారీ అమ్మా, నాన్న, సాహితి సారీరా నిన్ను వదిలి వెళ్లిపోతున్నాను అంటూ రాసిన తీరు చదవి ప్రతి ఒక్కరు కంటతడిపెట్టుకున్నారు. 11గంటలకు చనిపోతా సారీ మామ్, డాడి బై అంటూ రాసిన అక్షిత తనువు చాలించింది.

చదువు విషయంలో వెనకబడి ఉన్నానన్న మనోవేధన ఆమెను వెంటాడినట్టుగా పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే అన్ని కోణాల్లో కూడా దర్యాప్తు చేసిన తరువాత వాస్తవాలు వివరిస్తామని చెప్పారు.

సంరక్షణ లేకే...

అక్షిత ఆత్మహత్యపై కుటుంబ సభ్యులు గురుకుల పాఠశాల యంత్రాంగంపై పలు ఆరోపణలు చేస్తున్నారు. సంరక్షణ సరిగా లేకపోవడం వల్లే ఆమె చనిపోయిందని, సంక్రాంతి సెలవుల్లో ఇంటికి వచ్చినప్పుడు కూడా తనకు పాఠశాలలో ఇబ్బందిగా ఉందని తన తల్లి చెప్పిందని అక్షిత తల్లి వివరించారు.

విద్యార్థి సంఘం ఆందోళన

విద్యార్థిని అక్షిత అనుమానాస్పద మృతి పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తూ, కళాశాల ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బాధ్యులైన సంబంధిత హౌస్ మాస్టర్, ప్రిన్సిపాల్‌ను సర్వీస్ నుంచి రిమూవ్ చేయాలని, బాధిత కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్, ఉపాధ్యక్షులు గడ్డం శ్రీకాంత్ డిమాండ్ చేశారు.

హరి అశోక్‌కుమార్‌కు వయో శ్రేష్ఠ పురస్కారం



నవతెలంగాణ-జగిత్యాల టౌన్ : 8వ తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పి.నర్సింహారావు, రిటైర్డు జస్టిస్ భాస్కర్‌రావుల చేతుల మీదుగా సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ వయో శ్రేష్ఠ పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆదివారం 8వ టాస్కా ఆవిర్భావ దినోత్సవం, రాష్ట్ర సీనియర్ సిటీజేన్స్ సమ్మేళనం వేడుకలు రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 80 ఏడ్లు దాటిన వారికి ఇంటి నుంచే ఓటు వేయడానికి ఇంటింటా అవగాహన కల్పించడం, వారి నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తులు తహశీల్దార్ కార్యాలయాల్లో సమర్పించడం వంటి ఓటర్ల అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా తానూ, తమ కమిటీ ప్రతినిధులతో చేయించడం, కౌన్సెలింగ్ కేంద్రంలో సీనియర్ సిటీజేన్స్ కేసులు కౌన్సెలింగ్ చేస్తూ పరిష్కరించడం వివిధ సీనియర్ సిటీజేన్స్ సేవా కార్యక్రమాలు నిర్వహణ కార్యక్రమాల దృష్ట్యా హరి అశోక్ కుమార్‌ను విశిష్ట వయో శ్రేష్ఠ పురస్కారంను పొందారు. ఈ కార్యక్రమంలో టాస్కా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నర్సయ్య, ఉపాధ్యక్షుడు ప్రకాష్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.అశోక్‌రావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ - కరీంనగర్ డెస్క్ : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పలు అభివద్ధి కార్యక్రమాలను శంఖుస్థాపన చేశారు. తిమ్మాపూర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయం, హెల్త్ సెంటర్,మినరల్ వాటర్ ప్లాంట్ , గ్రామీణ క్రీడా ప్రాంగణం, సిసి రోడ్లతో పాటు ,అలాగే మన్నెంపల్లి లో త్రాగు నీటి పైపు లైన్, క్రీడా ప్రాంగణం, పోచమ్మ ఆలయం, వైకుంఠ దామం తో పాటు జూగుండ్ల గ్రామంలో అంబేద్కర్ సంఘ భవనం కురుమ మహిళా సంఘ భవనాలతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే 2 గ్యారంటీలను అమలు చేసామని 100 రోజుల్లో మిగిలిన 4 గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. అంతకు ముందు తిమ్మాపూర్ సర్పంచ్ దుండ్ర నీలమ్మ రాజయ్య, మన్నెంపల్లి సర్పంచ్ మేడి అంజయ్య లను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతిరెడ్డి వనిత దేవేందర్ రెడ్డి, సర్పంచ్లు దుండ్ర నీలమ్మ రాజయ్య, మేడి అంజయ్య, సాయిల్ల ఎల్లేష్, ఎంపీటీసీలు వేల్పుల మమత, పుష్పాల కనకయ్య, కనుకం కొమురయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోరపల్లి రమణా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలు రాము,నాయకులు ఎడ్ల బుచ్చిరెడ్డి, కార్యదర్శి మహేందర్ రావు,సీనియర్ నాయకులు ఎస్ఎల్ గౌడ్, గంకిడి లక్ష్మారెడ్డి,దన్నమనేని సురేందర్ రావు,ఉప సర్పంచ్ లు కేతిరెడ్డి తిరుపతి రెడ్డి,పొన్నం అనిల్ గౌడ్, మండల నాయకులు గుంటి మధుకర్,పొట్ట శ్రీనివాస్ యాదవ్, మండల కో ఆప్షన్ తాజోద్దీన్, తూముల శ్రీనివాస్, ఎంపిటిసిలు కొత్త తిరుపతిరెడ్డి,బండారి రమేష్,రావుల క్రిష్ణ, తాళ్లపల్లి రమేష్ గౌడ్ ఉన్నారు.

ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు


సమావేశంలో మాట్లాడుతున్న జీవి రామకృష్ణారావు

నవతెలంగాణ - మానకొండూర్ : బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులపై స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, సోమవారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో జడ్పీటిసిని ప్రోటో కాల్ ప్రకారం వేదికపై అహ్వానించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. గతంలో ఏ ప్రభుత్వంలో కూడా ఇలా వ్యవహరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు వేదికపై కుర్చీ ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించిన జడ్పీటిసిని పోలీసులతో సమావేశం హల్ నుంచి బయటికి పంపించడం ఎంతవరకు సమంజసమని ఎమ్మెల్యేను సూటిగా ప్రశ్నించారు. లేదా కాంగ్రెస్ ప్రభుత్వంలో జడ్పీటిసిలకు వేదికలపై స్థానం లేదని బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పలు పార్టీలు మారిన ఎమ్మెల్యే సత్యనారాయణకు రాజకీయ అవగాహన లేదని ఎద్దేవా చేశారు. రాజకీయాలు, అభివృద్ధి వేర్వేరని ప్రజా ప్రతినిధులను సమన్వయపరచి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ప్రజా ప్రతినిధులను అగౌరవ పరిచే నీచ సంస్కృతికి తెర లేపారని మండిపడ్డారు. సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీకి జరిగిన అవమానానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని జీవీఆర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీలు సిద్ధం వేణు, శేఖర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సర్పంచ్ పృథ్వీ రాజ్, నాయకులు దేవేందర్ రెడ్డి, అమీరుల్లా ఖాన్, శ్రీనివాస్ గౌడ్, యాదగిరి, మధు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మండల బాలల పరిరక్షణ కమిటీ శిక్షణ కార్యక్రమం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

నవతెలంగాణ - కరీంనగర్ డెస్క్ : ఇల్లందకుంట మండల కేంద్రంలో కరీంనగర్ జిల్లా సంక్షేమ శాఖ సమగ్ర బాలల అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో హుజురాబాద్ పీడీపీవో భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఇల్లందకుంట ఎంపీడీవో కార్యాలయంలో మండల బాలల పరిరక్షణ కమిటీ కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎంపీపీ సారిగొమ్ముల పావని మాట్లాడుతూ బాలల పరిరక్షణ కమిటీల ఏర్పాటు విధి విధానాలు బాలల హక్కుల పరిరక్షణ, బాలల చట్టాల గురించి బాల కార్మిక, బాల్యవివాహాల నిర్మూలన, లైంగిక వేధింపులు, భ్రూణ హత్యలు నిర్మూలన, విద్యాహక్కు చట్టం వివిధ చట్టాలపైన ముఖ్యంగా గ్రామ స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, వివిధ గ్రామస్థాయి అధికారులు అవగాహనా కలిగి ఉండాన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం అందరు సహకరించాలని, 18 సంవత్సరాల లోపు పిల్లలకు సంబంధించి ఏదైనా సమస్య దృష్టికి వస్తే కమిటీకి తెలియజేయాలని, లేదా పోలీసులకు100కు కానీ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఉచిత నెంబర్‌కు సమాచార ఇవ్వగలరన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట తహసీల్దార్ రాణి, ఎంపీడీవో శంకర్, సీడీపీవో భాగ్యలక్ష్మి, బాలల పరిరక్షణ అధికారి రమేష్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సూపర్వైజర్ దూడం కుమారస్వామి, ఐసీడీఎస్ సూపర్వైజర్ రమ దేవి, ఏపీఎం రమ దేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తులసి దాసు, భాస్కర్ రెడ్డి, విద్యాశాఖ, హెడ్ కానిస్టేబుల్, పూజారులు, పాస్టర్లు, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

వారధి సొసైటీపై విచారణ చేయాలి

కలెక్టర్‌కు న్యాయవాది ఫిర్యాదు


న్యాయవాది ఏవీ రమణ

నవతెలంగాణ-కరీంనగర్ : వారధి సొసైటీపై విచారణ, సెక్రేటరీపై చర్యకై కలెక్టర్‌కు న్యాయవాది ఏవీ రమణ ఫిర్యాదు చేశారు. కరీంనగర్‌లో కలెక్టర్ చైర్మెన్‌గా రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి ఆంజనేయులు సెక్రెటరీగా నిర్వహణలో ఉన్న వారధి సొసైటీలో అనేక అక్రమాలు జరుగుతున్నట్టు ఆరోపణలు ఉన్నట్లు న్యాయవాది రమణ తన ఫిర్యాదులో తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీలను నిరుద్యోగులతో భర్తీ చేయుటకు, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనతో పాటు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు లక్ష్యంగా ఏర్పడిన సంస్థ కానీ ఆ సంస్థ ఆరంభంలో ఒకటి అర చేసినప్పటికీ దాని సెక్రెటరీ ఆంజనేయులు ఒంటెద్దు పోకడతో ఆ సంస్థపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపం కారణంతో డబ్బులు ఇస్తేనే ఉద్యోగ అవకాశం ఇస్తున్నట్టు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కలెక్టర్ తక్షణమే ఒక విచారణ కమిటీ వేసి విచారించాలని రమణ తన ఫిర్యాదులో కోరారు. వారధి సొసైటీ ఏర్పడ్డప్పటి నుంచి ఇప్పటి వరకు సొసైటీ ఆడిట్ రిపోర్ట్ బహిర్గత పర్చాలని కోరారు. సొసైటీ ఇప్పటి వరకు ఎంత మంది నిరుద్యోగులతో ఉద్యోగాల భర్తీ ఏఏ శాఖలలో భర్తీ చేశారో చెప్పాలన్నారు. సొసైటీ ఆదాయ, వ్యయాల వివరాలు ప్రస్తుతం సొసైటీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వారికి చెల్లిస్తున్న జీత భత్యాల వివరాలు, సెక్రెటరీ పొందుతున్న వేతనం ఎంతో కూడా చెప్పాలని ఫిర్యాదులో కోరారు. సొసైటీ సెక్రెటరీ ఆంజనేయులు ఉద్యోగ విరమణ చేసి నిరుద్యోగులకు ఉద్యోగాల పేరిట భారీ అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు రావడం పట్ల సమగ్ర విచారణ జరిపి భవిష్యత్‌లో నిరుద్యోగులకు న్యాయం జరిగేలా కలెక్టర్ చొరవ చూపాలని కోరారు.

విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను అధిరోహించాలి

శ్రీ చైతన్య వీడ్కోలు సమావేశంలో కరస్పాండెంట్ అమిరిశెట్టి రత్నాకర్ రెడ్డి



బహుమతులను ప్రదానం చేస్తున్న ప్రొడ్యూసర్ అనిల్ రెడ్డి

నవతెలంగాణ - చొప్పదండి : విద్యార్థులు సమయాన్ని వధా చేయకుండా కష్టపడి చదివి ఎంచుకున్న లక్ష్యాలను అధిరో హించాలని చొప్పదండి శ్రీ చైతన్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ అమిరిశెట్టి రత్నాకర్ రెడ్డి అన్నారు. చొప్పదండి మండల కేంద్రంలో ని వరలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం శ్రీ చైతన్య జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం, విద్యార్థులు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు సమావేశంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దశారి మూవీ ప్రొడ్యూసర్ ఆరోరా అనిల్ రెడ్డి విచ్చేసి మాట్లాడుతూ మంచి మార్కులు సాధించి ఉన్నత స్థానంలో ఉండి కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. కళాశాల విద్యార్థినీ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురుని అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గుండేటి వెంకటరమణ, డైరెక్టర్లు వెంగళ హరి ప్రసాద్, పంతగాని అనిల్ కుమార్, చొప్పదండి మండల ప్రవేట్ పాఠశాల ల యజమాన్యాల అధ్యక్షులు గుర్రం ఆనంద రెడ్డి, కరస్పాండెంట్లు కడారిరవికుమార్, కూనమల్ల దేవానంద్, కళాశాల అధ్యాపక బృందం ఆంజనేయులు, రాజేశం, జగన్, గంగాధర్, స్వప్న అనూష, మౌనిక, రేఖ, బంధారపు అజయ్ కుమార్ గౌడ్, లింగారావు, మేడిశం భయ్యా మల్లేశం గోపి పాల్గొన్నారు.

నేదునూరులో మధ్యాహ్న భోజన పథకం సోషల్ ఆడిట్


పలు రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ - కరీంనగర్ డెస్క్ : తిమ్మాపూర్ మండలంలోని నేదునూరు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెస్ ఆధ్వర్యం లో మధ్యాహ్న భోజనం సోషల్ ఆడిట్‌ను రవణీల, శారదలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనంకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజన వంట చేసే కుక్‌తో చర్చించి సూచనలు సలహాలు చేశారు. 7, 8వ తరగతుల విద్యార్థుల నుంచి అభిప్రాయాలను తీసుకోవడం జరిగింది. పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్ పెంపకాన్ని సెస్ టీం అభినందించారు. అలాగే ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో డాక్టర్ సుస్మిత 8, 9, 10వ తరగతి విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి ఐరన్, పోలిక్ యాసిడ్ మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చీటీ లక్ష్మణ్ రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బీసీలకు అధిక సీట్లు ఇవ్వాలి

బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు


మాట్లాడుతున్న రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్

నవతెలంగాణ-కరీంనగర్ : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీ లకు అధిక సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ కోరారు. మంగళవారం కరీంనగర్‌లోని స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో బీసీ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్ అధ్యక్షతన బీసీ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్ లు మాట్లాడుతూ..దేశంలో అధిక సంఖ్యలో ఉన్న బీసీ సామాజిక వర్గానికి ప్రతి ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు సీట్ల విషయంలో తీవ్ర అన్యాయం చేస్తున్నాయని అన్నారు. బీసీలు రాజకీయంగా ఎదగాలంటే బీసీ కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లు ఏర్పాటు చేయాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలని కోరారు. బీసీ జనగణన చేపట్టాలని ఫిబ్రవరి 8, 9వ తేదీల్లో ఢిల్లీలో అన్ని రాష్ట్రాల బీసీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెరుగు పరుశురాం, మధు, వాసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు అవగాహన కార్యక్రమం


మాట్లాడుతున్న ఆకుల నర్మద నర్సన్న

నవతెలంగాణ-కరీంనగర్ : మహాత్మా గాంధీ వర్ధంతి పురస్కరించుకొని జాతీయ కుష్టు నిర్మూలన దినోత్సవంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పర్శ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరీంనగర్ నగరపాలక సంస్థలోని 11వ డివిజన్ కట్టరాంపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సన్న ఆధ్వర్యంలో డివిజన్‌లోని మహిళలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించి, వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆకుల నర్మద నర్సన్న మాట్లాడుతూ.. కుష్టు మైక్రో బాక్టీరియా లెప్రి అనే బాక్టీరియా వలన వచ్చే అతి సామాన్యమైన వ్యాధి అన్నారు. ఈ వ్యాధి ముఖ్యంగా చర్మానికి, నరాలకు సోకి నెమ్మదిగా పెరిగి వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి (ఇంక్యు బేషన్) కాలం సగటు 3సంవత్సరాలు పడుతుందన్నారు. కుష్టు వ్యాధి ఎవరికైనా రావచ్చునని, దీనికి వయసు లింగ విభేదం లేదన్నారు. ఈ వ్యాధి ఎండీటీ (బహుళ ఔషధ చికిత్స)తో 6 నెలల నుంచి 12నెలలోపు పూర్తిగా నయం అవుతుందని, కుష్టు రోగులు పూర్తిగా సామాజిక జీవితం గడపవచ్చునని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్, డీఎంహెచ్ఓ మెడికల్ ఆఫీసర్ సాయి రాజ్, డీపీఎంఓ దేవేందర్ రెడ్డి, లింగారెడ్డి, శంకర్, సూపర్‌వైజర్ కిషోర్, సీఓ సాగర్, ఏఎన్ఎం సంపూర్ణ, ప్రజలు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

సదరం శిబిరానికి స్లాట్ బుక్..

నవతెలంగాణ-కరీంనగర్ : కరీంనగర్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో నిర్వహించే సదరం శిబిరానికి సంబంధించిన ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన స్లాట్ బుక్ కోసం ఫిబ్రవరి 2న ఉదయం 11:30 గంటల నుంచి మీ సేవా కేంద్రంలలో స్లాట్ బుక్ చేసుకోవాలని కరీంనగర్ జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ పర్యవేక్షకులు తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి ఫిబ్రవరి 6న ఆర్థో, 13న మానసిక రోగులు, 20న కంటి చూపు, 26న వినికిడి మూగ (చెవుడు), మార్చి 4న ఆర్థో, 12న మానసిక రోగులు, 19న కంటి చూపు, 26న వినికిడి మూగ (చెవుడు) లు నిర్ధారించిన తేదీలలో వాటికి సంబంధించిన వైద్య పత్రాలు, మీ సేవలో బుక్ చేసుకున్న రశీదుతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని సదరం క్యాంపుకు హాజరు కావాలని తెలిపారు.

మహాత్మా గాంధీ 76వ వర్ధంతి వేడుకలు


కరీంనగర్: మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి


తిమ్మాపూర్: గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కరీంనగర్ : సత్యాగ్రహమే ఆయుధంగా అహింస మార్గంలో పోరాడి యావత్ భారత జాతికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు అందించిన గొప్ప నాయకుడు మహాత్మా గాంధీ అని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి అన్నారు. మంగళవారం నగరంలోని స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి రాజ్యాంగ పీఠికను యువతతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేష్ పటేల్, తిరుపతిలు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా వర్ధంతి వేడుకలు నిర్వహించామన్నారు. కొన్ని మతోన్మాద శక్తులు రాజ్యాంగ పీఠికను కాలరాయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వతంత్ర ఉద్యమంలో పాల్గొనని వారు రాజ్యాంగ హక్కులను కాలరాయడానికి ప్రయత్నిస్తూ మతోన్మాద శక్తులను రెచ్చగొట్టి మత విద్వేషాలను రెచ్చగొడుతున్న వారిని దేశంలో యువత ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్న అమరుల స్ఫూర్తితో మత సామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి యువతపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు కిషన్ నాయక్, కృష్ణ, వెంకటేష్, నితిన్, రాజేందర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - కరీంనగర్ డెస్క్ : తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ 76వ వర్ధంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి కాంగ్రెస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు తూముల శ్రీనివాస్ నాయి, గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి రావుల శ్రీనివాస్ గౌడ్ , మండల్ నాయకులు బుర్ర కనకయ్య గౌడ్, గుంటి శ్రీనివాస్, తాళ్లపల్లి కిరణ్ గౌడ్, సుధ గొని శ్రీనివాస్ గౌడ్, గోదర చరణ్ కుమార్, సుధగొని పరశురాములు గౌడ్, సానగొండ కనకయ్య, సాన కొండ నరసింహస్వామి, సానకొండ ఐలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.


జమ్మికుంట: పూలమాలలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ - జమ్మికుంట : మహాత్మా గాంధీ 76వ వర్ధంతి వేడుకలను వాసవి క్లబ్ అధ్యక్షుడు లెంకలపల్లి శరత్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌరస్తాలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా మునిసిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు విచ్చేసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు ,బిజెపి నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ మాజీ అధ్యక్షులు బచ్చు భాస్కర్ , మహాసభ జిల్లా అధ్యక్షులు చందరాజు , రావి కంటి రాజు, బచ్చు మాధవి శివకుమార్, మద్ది లావణ్య సంపత్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - కరీంనగర్ : జాతిపిత మహాత్మా గాంధీ 76వ వర్ధంతి సందర్భంగా మంగళవారం నగరంలోని స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గాంధీ చిత్రపటానికి డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..మహాత్మా గాంధీ ఆశయాలను కాంగ్రెస్ కొనసాగిస్తుందన్నారు. మహాత్మా గాంధీని గాడ్సే చంపాడని, ఆర్ఎస్ఎస్ ముసుగులో బీజేపీ పని చేస్తుందని, నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీ ఆశయాల సాధనకు యువత పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడుపు మోహన్, పులి ఆంజనేయులు గౌడ్, శ్రావణ్ నాయక్, వెన్నరాజ మల్లయ్య, మల్యాల సుజిత్ కుమార్, మల్లికార్జున రాజేందర్, పడిశెట్టి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాలలో...

నవతెలంగాణ-జగిత్యాల : మహాత్మాగాంధీ సిద్ధాంతాలు నేటి పాలకులు, ప్రజలకు ఎంతో స్ఫూర్తిదాయకం, ప్రపంచ దేశాలకే అనుసరణీయమని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. మంగళవారం జగిత్యాల కలెక్టరేట్‌లో గాంధీవర్ధంతి పురస్కరించుకుని అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, దివాకరలతో కలిసి మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ. హన్మంతరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మి నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయం లో

జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో గాంధీ చిత్ర పటానికి పోలీసులు పూలమాల వేసిన నివాళలర్పించి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు (ఏఆర్) భీమ్‌రావ్, జనార్ధన్‌రెడ్డి, ఏవో అమర్నాథ్, ఆర్ఐలు జానీమియా, రామకృష్ణ వేణు, ఆర్ఎస్ ఐలు, డీపీవో, సాయుధ దళ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భీమారం గ్రామ పంచాయతీ ఆవరణంలో గాంధీజీ చిత్రపటానికి గ్రామ సర్పంచ్ చెక్కపల్లి అరుణ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గ్రామ సర్పంచ్ అరుణ, ఉపసర్పంచ్ రాజు, డాక్టర్ మహంత్, ఏఎన్ఎం సుశీల, సుమలత,కారోబర్ వనిత, ఆశావర్కర్ సంధ్య అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లి : మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్ఐ సతీష్‌లు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల : పట్టణంలోని జువ్వాడి భవన్‌లో మహాత్మాగాంధీ చిత్ర పటానికి జువ్వాడి కృష్ణారావు పూలమాల వేసి నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతమ్ రాజాం పెరుమాండ్ల సత్యనారాయణ, మచ్చ కవిత పాల్గొన్నారు.

ఎపిటోరియం పరిశ్రమలో కార్మికుడి మృతి

- మృతదేహంతో పరిశ్రమ ఎదుట కుటుంబీకుల ఆందోళన


(ఫైల్)

నవతెలంగాణ హత్నూర

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోర్పట్ల గ్రామ శివారులోని ఎపిటోరియం యూనిట్-1 పరిశ్రమలో విధులు నిర్వర్తిస్తూ కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోర్పట్ల గ్రామానికి చెందిన కొప్పు నరసింహులు(30) గ్రామ శివారులోని పరిశ్రమలో ఎప్పటిలాగే విధులు నిర్వహించేందుకు ఉదయం పరిశ్రమకు వెళ్లాడు. కాగా, మధ్యాహ్నం పరిశ్రమలో విధులు నిర్వర్తిస్తూ ఒకసారిగా కుప్పకూలాడు. వెంటనే పరిశ్రమ యాజమాన్యం హుటాహుటిన ఎమ్మెన్నార్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే నర్సింహులు మృతిచెందినట్టు వైద్యులు పరీక్షించి నిర్ధారించారు. వెంటనే కుటుంబీకులు, గ్రామస్తులు ఎపిటోరియం పరిశ్రమ ఎదుట మృతదేహంతో ఆందోళన చేపట్టేందుకు తీసుకురాగా.. సమాచారం అందుకున్న జిన్నారం సీఐ వేణుకుమార్ పరిశ్రమ వద్దకు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినా బంధువులు వినకుండా తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని పరిశ్రమ ఎదుట భీష్మించుకుకూర్చున్నారు. పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి నష్టపరిహారం ఇప్పిస్తామని సీఐ చెప్పడంతో ఆందోళన విరమించారు. కాగా, మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వేణుకుమార్ తెలిపారు.

సీఎం హర్షం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఫాక్స్‌కాన్ చైర్మెన్, సీఈవో యంగ్‌ల్యూ పద్మభూషణ్ అవార్డును స్వీకరించటం పట్ల ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలుపుతూ లేఖ రాశారు. భారతదేశానికి యంగ్‌ల్యూ అందిస్తున్న సేవలు విశిష్టమైన గుర్తింపు పొందుతున్నాయని ప్రశంసించారు. ప్రపంచంలో సెమీ కండక్టర్ టెక్నాలజీ విప్లవంలో అత్యంత కీలకమైన భాగస్వామ్యం అందించి ప్రత్యేకతను చాటుకున్నారనీ, ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవటంలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందని తెలిపారు. హైదరాబాద్ నగరానికి ఆయన్ని సాదరంగా ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఆరేండ్ల చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు

- గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు
- డ్రైవర్ నిర్లక్షమే ప్రమాదానికి కారణం
- ఆందోళన నిర్వహించిన స్థానికులు, కుటుంబీకులు


(ఫైల్)

నవతెలంగాణ - మెదక్

అల్లారుముద్దుగా పెంచుకున్న ఆరేండ్ల చిన్నారిని స్కూల్ బస్సు చిదిమేసింది. బస్సు చక్రాల కిందపడి పసి పాప ప్రాణం కోల్పోయిన సంఘటన మెదక్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మెదక్‌లోని తారకరామానగర్‌కు చెందిన భిక్షపతి-నవీన దంపతుల కుమార్తె అనుశ్రీ(6) పట్టణంలోని మాస్టర్ మైండ్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతోంది. ప్రతిరోజూ బస్సులోనే స్కూల్‌కు వెళ్లి వచ్చేది. మంగళవారం సాయంత్రం స్కూల్ అయిపోగానే స్కూల్ బస్సులో తిరిగి వచ్చింది. బస్సు దిగి ఇంటికి వెళ్లే సమయంలో అనుశ్రీ పడిపోయింది. బాలిక పడిపోయిన విషయం గమనించని డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును ముందుకు తీసుకెళ్లాడు. చిన్నారి పైనుంచి టైర్ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. బస్సు వచ్చినా కుమార్తె ఇంటికి రాకపోవడంతో తల్లి సంఘటనా స్థలానికి చేరుకుంది. బస్సు టైర్ కింద చిన్నారి విగత జీవిగా పడిపోవటాన్ని చూసిన తల్లి గుండెలవిసేలా రోదించింది. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే చిన్నారి మృతి చెందినట్టు తల్లిదండ్రులు ఆరోపించారు. చిన్నారి మృతి పట్ల స్థానికులు, కుటుంబీకులు ఆందోళన వ్యక్తం చేశారు.

కదులుతున్న రైలు ఎక్కబోయి.. ప్లాట్‌ఫాం,రైలు మధ్య ఇరుకున్న ప్రయాణికుడు

- కొద్దిదూరం లాక్కెళ్లిన రైలు
- బాధితుని పరిస్థితి విషమం
- వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో ఘటన



నవతెలంగాణ-వికారాబాద్ ప్రతినిధి

కదులుతున్న రైలు ఎక్కబోయిన ఓ ప్రయాణికుడు ప్లాట్ ఫాం, రైలు మధ్య ఇరుక్కు పోయాడు. రైలు అలాగే లాక్కెళ్లి పోయింది. తల్లడిల్లిన ప్రయాణికున్ని స్థానికులు అప్రమత్తమై రక్షించారు. రైల్వే అధికారులు వెంటనే ప్లాట్‌ఫాం తవ్వి బాధితున్ని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

రాయచూర్‌కు చెందిన సతీష్ వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో యశ్వంత్‌పూర్‌కు వెళ్లే కదులుతున్న రైలు ఎక్కే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో అదుపుతప్పి కింద పడిపోయి కదులుతున్న రైలు, ప్లాట్ ఫాం మధ్య ఇరుక్కుని నరకయాత అనుభవించాడు. రైలు అలాగే అతన్ని కొద్ది దూరం లాక్కెంది. గమనించిన స్థానికులు రైలును ఆపేశారు. ప్లాట్ ఫాం కట్టను తవ్వి బాధితున్ని బయటకు తీశారు. అనంతరం స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

తెలంగాణ ప్రయివేటు జూనియర్ కళాశాలల అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా గౌరీ సతీష్



- నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ - ముషీరాబాద్

తెలంగాణ ప్రయివేటు జూనియర్ కళాశాలల అధ్యక్షుడిగా గౌరీ సతీష్ రెండోసారి ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రయివేటు జూనియర్ కళాశాలల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక సమావేశం జరిగింది. ఎన్నికల అధికారులుగా వరదారెడ్డి, శ్రవణ్ కుమార్, నరేందర్ రెడ్డి, అఫ్సర్ పాషాల పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు తమ ఓటు హక్కు వినియోగించుకోగా.. ప్రస్తుత అధ్యక్షుడు గౌరీసతీష్‌కు 40 ఓట్లు పోలయ్యాయి. మరో అభ్యర్థి జగదీష్‌కు 9 ఓట్లు పోల్ కాగా, మూడు ఓట్లు నోటాకు వచ్చాయి. జనరల్ సెక్రటరీగా విష్ణువర్ధన్ రెడ్డికి 27 ఓట్లు వచ్చాయి. తిరుపతి రెడ్డి 13, నరేందర్ 12 ఓట్లు సాధించారు. అధ్యక్షుడిగా మరోమారు గౌరీ సతీష్ ఎన్నికకాగా, జనరల్ సెక్రటరీగా విష్ణువర్ధన్ రెడ్డి ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా గౌరీ సతీష్ మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి శాయశక్తులా ప్రయత్నిస్తానని తెలిపారు. తమ మీద పెట్టుకున్న నమ్మకాన్ని నెలబెట్టుకుంటామన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సమస్యలు సానుకూలంగా పరిష్కారమవుతాయన్న నమ్మకం ఉందన్నారు.

రాముడు నియంతృత్వాన్ని అంగీకరించడు

(మొదటిపేజీ తరువాయి)

మరిచిపోవడం వల్ల అన్ని దారులూ మూసుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ భావజాలం లేకుండా ఒక పిచ్చితో రాజ్యాంగం, వాటి విలువలను ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుంటే వెంటనే దానికి కారణాలను చెప్పాల్సిన అవసరం లేదంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. అణుఒప్పందానికి వ్యతిరేకంగా, బాబ్రీ మసీదు కూల్చివేసినపుడు లౌకికవాదం కోసం ప్రబీర్ పుర్కాయస్థ ఉద్యమాలను నడిపారని చెప్పారు. న్యూస్‌క్లిక్ మీద దాడి జరిగితే పోరాడకుండా న్యాయవ్యవస్థపై గౌరవం ఉందన్నారని అన్నారు. ఇప్పుడు కావాల్సింది సత్యాన్వేషణ అని అన్నారు. గాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యం, అంబేద్కర్ చెప్పిన కులనిర్మూలన ఏమయ్యాయని అడిగారు. ఎస్వీకేలో ఇలాంటి సమావేశాలు మళ్లీ జరుగుతాయా?అని ఆందోళన వ్యక్తం చేశారు. 'మీరు పది అడుగులు వేస్తే నేను ఒక అడుగు వేస్తాను'అని సుదర్శన్‌రెడ్డి అన్నారు.



ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉండాలి : మాడభూషి శ్రీధర్

ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉండాలని సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. ప్రశ్నించే వారికి అండగా ప్రజలు నిలబడాలని కోరారు. తాను జర్నలిస్టుగా ఉన్నపుడు పరిశోధన కథనాలను రాయొద్దన్నారని గుర్తు చేశారు. ఆర్టీఐ కమిషనర్ అయ్యాక వ్యాసాలు రాయొద్దన్నారని చెప్పారు. అయితే ఆర్టీఐ గురించే తాను వ్యాసాలు రాశానని అన్నారు. జర్నలిస్టు నిరంతరం ప్రశ్నించాలనీ, పరిశోధించాలని సూచించారు. అన్యాయాన్ని ఎదిరించేవాడు ఆరాధ్యుడు అన్న కాళోజీ మాటలను గుర్తు చేశారు. అందుకే అందరూ ప్రశ్నించాలని చెప్పారు. దేశంలో రాజ్యాంగం ఉందా?, ఆర్టికల్ 19 1(ఏ) ఉందా?అని ప్రశ్నించారు. అవి ఇంకా ఉన్నాయి కాబట్టే ఇంత స్వేచ్ఛగా మాట్లాడుతున్నాననీ, భావ ప్రకటనను వ్యక్తం చేస్తున్నానని వివరించారు.

ప్రగతి నిరోధక శక్తులకు అధికారం ప్రమాదకరం : హరగోపాల్

ప్రగతి నిరోధక శక్తులు అధికారంలోకి వస్తే దేశం ఎలా ఉంటుందో ఆనాడే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ హెచ్చరించిన విషయాన్ని ప్రొఫెసర్ హరగోపాల్ గుర్తుచేశారు. దేశానికే తలమానికంగా, సమగ్ర చర్చలకు నిలయమైన జేఎన్‌యూపై కావాలనే విషప్రచారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జేఎన్‌యూలో ఆయా శాఖల విభాగాల అధిపతులకు తెలియకుండానే ఒకే భావజాలానికి చెందిన 80 మందిని ఫ్యాకల్టీగా నియమించడాన్ని తప్పుబట్టారు. తమ భావజాలానికి వ్యతిరేకంగా ఉన్న ప్రగతిశీల ప్రొఫెసర్లపై గూండాలతో దాడులు చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీ కాలంలో కూడా ఇంతటి దుర్మార్గమైన పరిస్థితి లేదని చెప్పారు. 75 సెంట్రల్ యూనివర్సిటీలలో కనీసం సెమినార్లు కూడా నిర్వహించలేని పరిస్థితి లేదని పలు ఉదహరణలతో వివరించారు. ఎమర్జెన్సీ నుంచి ఆర్‌ఎస్‌ఎస్ చాలా నేర్చుకున్నదనీ, గుట్టుచప్పుడు కాకుండా వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ పోతున్నదని విమర్శించారు. నేరం చేసిన వాళ్లను సంస్కరించాల్సిన జైళ్లను పాలకులను ప్రశ్నించేవారితో నింపేస్తున్నారన్నారు. నేడు దేశంలో అమలవుతున్న అప్రకటిత ఎమర్జెన్సీ అత్యంత భయంకరమైనదనీ, సమాజంలో వచ్చిన మార్పుతో దేశమే ప్రమాదంలో పడిందని హెచ్చరించారు.

మాట్లాడటమే నేరమనే సమాజంలో మనమున్నాం : కె.నాగేశ్వర్

మాట్లాడటం, ప్రశ్నించడం నేరం, దేశద్రోహం, ధర్మద్రోహం అనే ప్రమాదకర సమాజంలో మనమున్నామని ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. భావప్రకటనా స్వేచ్ఛపైనే కాదు..అన్ని వ్యవస్థలపైనా దాడి జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో బిల్లులపై ఓటింగ్ అడిగితే ఎంపీలను సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. దేశ బడ్జెట్‌పై ఎలాంటి చర్చ లేకుండా కేవలం నాలుగున్నర నిమిషాల్లోనే ఆమోదింపజేయడం దారుణమని విమర్శించారు. పార్లమెంట్ కాదు..రాజ్యాంగమే సుప్రీం అని ఎలుగెత్తి చాటాలన్నారు. మతం, భావోద్వేగాలలో మునిగిపోయిన ప్రజల్లోకి ప్రత్యామ్నాయ ఐడియాలజీని తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఆలోచనల ఆధిపత్యాన్ని ప్రశ్నించాలనీ, హక్కుల ఉల్లంఘన లేని సమాజ నిర్మాణం కోసం ముందుకురావాలని యువతకు పిలుపునిచ్చారు. 95 శాతం ఈడీ, సీబీఐ కేసులు ప్రతిపక్ష పార్టీలపై ఉన్నాయన్నారు. మీడియా పూర్తిగా పాలక వర్గం గుప్పిట్లో ఉన్న సమయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆలోచనా ప్రపంచంలోకి ప్రత్యామ్నాయ భావజాలాన్ని జొప్పించాలన్నారు.

విద్యార్థి రాజకీయాలే దేశానికి అవసరం : తులసీ చందు

విద్యార్థి రాజకీయాలు దేశానికి ఎంతో అవసరమనీ, సమాజానికి ఉపయోగమని సీనియర్ జర్నలిస్టు తులసీ చందు అభిప్రాయపడ్డారు. ఎమర్జెన్సీ కంటే నేడు కనిపించని రీతిలో తీవ్రస్థాయిలో అణచివేత ఉందనీ, వాక్‌స్వాతంత్ర్యంపై తీవ్ర దాడి జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్వెస్టిగేషన్ జర్నలిజం నేడు చనిపోయిందనీ, ఉన్నది ఉన్నట్టు చెప్పే ధైర్యం చేయట్లేదని వాపోయారు. పలు పార్టీలకు ఐటీసెల్స్, ట్రోల్ ముఠాలున్నాయనీ, వాటి బుట్టలో పడి ప్రశ్నించేతత్వాన్ని యువత కోల్పోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అంబానీ, అదానీలకు దేశాన్ని రాసిస్తున్నా స్పందించని స్థితిలో యువత ఉందన్నారు. విద్యార్థులు బయటకు వచ్చి పాలకులను ప్రశ్నించాలనీ, మీడియా ప్రజల పక్షాన పనిచేయాలని పిలుపునిచ్చారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎ విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కె పార్థసారథి, 10 టీవీ మాజీ ఎండీ కె వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డికి పౌరస్పందన వేదిక వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రాధేశ్యాం. ఉపాధ్యక్షులు కె.ఎ. మంగ, ఎం.ఎ సమ్మద్, ఎసివి. రామకృష్ణ, టి. సురేష్ కుమార్, కోట, దాములు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రజలందరికీ నాణ్యమైన విద్య వైద్యం అందుబాటులో ఉండాలంటే అవి ప్రభుత్వ ఆధీనంలో ఉంటేనే సాధ్యమవుతుందని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో విద్య మెజారిటీగా ప్రయివేటు రంగంలోకి వెళ్లటం వల్ల సాధారణ కుటుంబాలకు నాణ్యమైన విద్య మోయలేని భారంగా మారిందని వివరించారు. ఈ కారణంగా విద్యలో అంతరాలు పెరుగుతున్నాయని తెలిపారు. చదువులో అంతరాలు సమాజంలో ఆర్థిక, సామాజిక అంతరాలను మరింత పెంచుతాయని పేర్కొన్నారు. మెరుగైన సమాజాన్ని నిర్మించటానికి ఈ విధానం అడ్డంకిగా మారుతుందని తెలిపారు. మూడు దశాబ్దాల క్రితం వరకు విద్యారంగంలో ఈ అంతరాలు పెద్దగా లేవని పేర్కొన్నారు. ఆ తర్వాత కాలంలో ప్రభుత్వాలు అనుసరించిన విధానాల కారణంగా రాష్ట్ర విద్యారంగంలో ప్రయివేటు శక్తులు పెరిగాయని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 2022-23 విద్యా సంవత్సరంలో ఒకటి తరగతి నుంచి పదో తరగతి వరకు 59,45,222 మంది విద్యార్థులు పాఠశాలల్లో నమోదయ్యారని తెలిపారు. వీరిలో 28,95,456 (48.7శాతం) మంది 30,307 ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రభుత్వ, మండల, జిల్లా పరిషత్, గిరిజన సంక్షేమ, కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీ ఎయిడెడ్ పాఠశాలల్లోనూ, 30,49,766 (51.3శాతం) మంది విద్యార్థులు 10,634 ప్రయివేటు పాఠశాలల్లో నమోదయ్యారని తెలిపారు. ప్రయివేటు పాఠశాలల వైపు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపటానికి ప్రధాన కారణాలు, ఇంగ్లీషు మీడియం, ప్రైమరీ తరగతులు, తరగతికి ఒక గది, ప్రతి తరగతికి ఒక టీచర్ ఉండటమేనని పేర్కొన్నారు. వీటికి అదనంగా పాఠశాల ప్రాంగణాన్ని అక్కడ శుభ్రంగా ఉంచుతారని తెలిపారు. ప్రభుత్వ బడుల బాగుకోసం ఇచ్చే సూచనలను పరిగణలోకి తీసుకుని వాటి అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని సీఎంకు వారు విజ్ఞప్తి చేశారు.

సీఐడీ పోలీస్ పేరుతో డ్రామా చేసిన వ్యక్తుల అరెస్ట్

- మాదాపూర్ డీసీపీ సిపి వినీత్



నవతెలంగాణ-మియాపూర్

తాను పనిచేస్తున్న కంపెనీలో ఉద్యోగం నుంచి తీసేశారనే కసితో అదే కంపెనీకి చెందిన ఆఫీస్‌పై నకిలీ సీఐడీ ఆఫీసర్లమంటూ సోదాలు నిర్వహించి, అనంతరం ఆ సంస్థ ఉద్యోగులను కిడ్నాప్ చేసిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సంఘటనకు పాల్పడిన ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మాదాపూర్ డీసీపీ సీపీ వినీత్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పొలిమెర మహేంద్ర కుమార్, షేక్ మొహమ్మద్ అబ్దుల్ క్వాదిర్‌తో పాటు విజయ్ శేఖర్, రంజిత్ కుమార్, తదితరులు పదిమంది ముఠాగా ఏర్పడ్డారు. కాగా, కర్నాటకకు చెందిన దర్శన్ సుగుణాకర శెట్టి, శ్రీకాంత్, అర్ణబ్ సేన్‌తో కలిసి గచ్చిబౌలిలోని జనార్ధనహిల్స్‌లో ఏర్పాటుచేసిన ఏజేపీ యాడ్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీపై ఈ ముఠా సభ్యులు.. ఆంధ్రప్రదేశ్ సీబీసీఐడీ అధికారులమంటూ దాడిచేశారు. ఈ నెల 26న మధ్యాహ్నం 1.30 గంట సమయంలో కంపెనీలోకి చొరబడగా.. కంపెనీ యజమాని సుగుణాకర శెట్టి వారిని ఎవరని ప్రశ్నించగా ఏపీ సీఐడీ(సైబర్ క్రైమ్)లో సహాయ దర్యాప్తు అధికారి షేక్ అబ్దుల్ ఖాదిర్‌గా తన గుర్తింపు కార్డు చూపించాడు. ఎందుకొచ్చారని అడగగా.. అమెరికా ప్రభుత్వం నుంచి కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు వచ్చిందని, ఏజేపీ యాడ్స్ తప్పుడు పనులు చేస్తోందని ఫిర్యాదు వచ్చిందని చెబుతూ కొన్ని ఈ- మెయిళ్లు చూపించారు. మరో వ్యక్తి వచ్చి వ్యవహారాన్ని సెటిల్ చేసుకుంటే ఇక్కడితోనే ముగిసిపోతుందని చెప్పారు. దాంతో సుగుణాకరశెట్టి తన వద్ద పనిచేసే కపిల్‌ను వారితో మాట్లాడాలని సూచించారు. మొదట రూ.10 కోట్లు డిమాండ్ చేసి బేరసారాల అనంతరం రూ.71.80 లక్షలు ఇస్తామనడంతో సుగుణాకరశెట్టి, కపిల్, రవిని వారు కారులో ఎక్కించుకొని మాదాపూర్‌లోని ఒక హోటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ గదిలో బాధితులను బంధించి వారి ఖాతాల నుంచి డబ్బును క్రిప్టో కరెన్సీ వ్యాలెట్లలోకి బదిలీ చేసుకున్నారు. కపిల్‌ను బయటకు పంపించి డెబిట్ కార్డుల ద్వారా డబ్బు విత్ డ్రా చేసుకురావాలని సూచించారు. కొద్దిసేపటి తర్వాత కపిల్ ఫోన్ ఎత్తకపోవడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. గది నుంచి బయటపడ్డ సుగుణాకరశెట్టి, రవి తర్వాత బ్యాంకు ఖాతాలు తనిఖీ చేయగా మొత్తం రూ.13.70 లక్షలు బదిలీ చేయించుకున్నట్టు గుర్తించారు. దాంతో బాధితులు నిందితులపై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అబ్దుల్ ఖాదిర్ సహా నలుగురిని అరెస్టు చేశారు. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల సర్వీసు క్రమబద్ధీకరించాలి

- ప్రభుత్వ జూనియర్ కాలేజీల సమస్యలు పరిష్కరించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి వినతి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమస్యలు పరిష్కరించి, కాంట్రాక్ట్ అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్సీ ఏ నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ (475) సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వీ శ్రీనివాస్, డాక్టర్ కుప్పిశెట్టి సురేష్‌లు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని 412 ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలనీ, ప్రతినెలా స్కాలర్‌షిప్పులు విద్యార్థులకు అందేలా చూడాలని కోరారు. రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 33కి పెరిగినందున ఇంటర్ విద్యను బలోపేతం చేస్తూ, జిల్లా ఇంటర్ విద్యా పర్యవేక్షకుల పోస్టులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలనీ, మరుగుదొడ్లు, ప్రహరీగోడల నిర్మాణం చేపట్టాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు కేపీ శోభన్‌బాబు, మహిళా కార్యదర్శులు సంగీత, విశాలాక్షి పాల్గొన్నారు.

గాంధీ హంతకులకు దేశంలో స్థానం లేదు: డివైఎఫ్ఐ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మహాత్మాగాంధీ హంతకులకు భారతదేశంలో స్థానం లేదని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటా రమేష్ ఆనగంటి వెంకటేష్ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్ ఎమ్‌జీ రోడ్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం రాజ్యాంగ పీఠిక పఠించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ భిన్న మతాలు, సంస్కృతులు, దేశ సమైక్యత కోసం పాటుపడ్డారని చెప్పారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని హరిస్తుందనీ, ప్రజాస్వామ్య హక్కులను కాల రాస్తూ, మతోన్మాద అజెండాతో పాలన కొనసాగిస్తున్నదని విమర్శించారు. ఇది గాంధీ చూపిన స్ఫూర్తికి పూర్తి విరుద్ధమని అన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ హైద్రాబాద్ జిల్లా కార్యదర్శి ఎమ్‌డీ జావెద్ నాయకులు విజయ్, హష్మీ, భాను, ప్రకాశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- 16న ఇంగ్లీష్ సబ్జెక్టుకు కూడా...
- 2032 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- 3,21,803 మంది విద్యార్థుల హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల 16 వరకు జరుగుతాయని తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండో విడత ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మొదటిసారిగా ఇంగ్లీష్ సబ్జెక్టుకు వచ్చేనెల 16న ప్రాక్టికల్ పరీక్షలుంటాయని వివరించారు. అదేనెల 17న ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నైతికత, మానవ విలువలు పరీక్ష ఉంటుందని తెలిపారు. వచ్చేనెల 19న ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పర్యావరణ విద్య పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రాక్టికల్ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2032 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. 3,21,803 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఎంపీసీ విభాగం నుంచి 2,17,714 మంది, బైపీసీ విభాగం నుంచి 1,04,089 విద్యార్థులున్నారని పేర్కొన్నారు. .

విద్యార్థుల కోసం టెలీమానస్ ఏర్పాటు

ఆరోగ్య, మానసిక సమస్యల పరిష్కారానికి సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులతో టెలీ మానస్‌ను ఏర్పాటు చేశామని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా తెలిపారు. వార్షిక, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యే వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షల ఒత్తిడి, ఇతర సమస్యలతో బాధపడే ఇంటర్ విద్యార్థులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. టోల్‌ఫ్రీ నెంబర్ 14416 లేదా 1800-914416 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

'దళితబంధు' కోసం లంచం..

తిరిగివ్వాలంటూ సర్పంచ్ ఇంటి ఎదుట బాధితుల ధర్నా



నవ తెలంగాణ-మద్దూరు

దళితబంధు పథకం మంజూరు కోసం తమ వద్ద వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిద్దిపేట జిల్లా దూళ్మిట్ట మండలం తోర్నాల గ్రామంలో సర్పంచ్ ఇంటి ముందు బాధితులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాధితులు మేక యాదగిరి, పంగ ఎల్లయ్య, పేరం రవి, మేక శేఖర్, పేరం పరశు రాములు, ఎర్ర మల్లేశం మాట్లాడుతూ.. తమకు దళితబంధు పథకం మంజూరు చేయిస్తామని తోర్నాల గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి రాజమ్మ ఆయన కుమారుడు భిక్షపతి తమ వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.6 లక్షలు తీసుకున్నారని ఆరోపించారు. డబ్బులు తీసుకొని రెండేండ్లు గడుస్తున్నా తమకు దళితబంధు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో సర్పంచ్ కుమారుడిని నిలదీయగా ఆ డబ్బులు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మంద యాదగిరి, ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికు ఇచ్చినట్టు చెబుతున్నాడన్నారు. తమకు ఎవరితో సంబంధం లేదని, తామిచ్చిన డబ్బులు భిక్షపతి ఇచ్చే వరకు సర్పంచ్ ఇంటి ఎదుట నుంచి వెళ్లే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. బాధితులకు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సుందరగిరి భాస్కర్ మద్దతు తెలిపి మాట్లాడారు. దళితబంధు పేరుతో దళితులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. దళితుల ఉసురు తాకే బీఆర్ఎస్ ప్రభుత్వం కూలిపోయిందని తెలిపారు. దళితబంధు కోసం వసూలు చేసిన ప్రతి పైసా తిరిగి వారికి చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దళిత బంధు డబ్బులు వసూలు చేసినవారి ఇండ్ల ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై సర్పంచ్ కుమారుడు భిక్షపతిని వివరణ కోరగా.. దళిత బంధు పథకం కోసం బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మంద యాదగిరి ఆదేశాల మేరకే ఆరుగురి దగ్గర రూ.లక్ష చొప్పున వసూలు చేసి ఆయనకిచ్చినట్టు తెలిపారు. అతను ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డికి ఇవ్వడంతో ఆయన జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి ఇచ్చినట్టు చెప్పారు. దళితబంధు లబ్దిదారుల దగ్గర తాను ఒక్క రూపాయి కూడా తినలేదన్నారు. ఆరుగురు దగ్గర వసూలు చేసిన డబ్బులు త్వరలోనే ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

సునంద పవార్... మహిళా హక్కుల కార్యకర్త. గ్రామీణ మహారాష్ట్రలోని మహిళల జీవితాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నారు. వారి కోసం స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేయడం, బాలికలలో రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం మొదలుకొని నీటి సంరక్షణ వరకు వారి జీవితాల్లో మార్పు కోసం విశేష కృషి చేస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...



గ్రామీణ మహిళలకు చేయూతనిస్తూ...



ఇరవై ఏండ్లుగా సునంద పవార్ మహారాష్ట్రలోని గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల జీవితాలను చాలా దగ్గర పరిశీలిస్తున్నారు. నిత్యం వారితో ఉంటూ సాధికారత కల్పించేందుకు కృషి చేస్తున్నారు. మహిళలను ఆర్థికంగా స్వతంత్రంగా ఉండేలా ప్రేరేపిస్తున్నారు. మంచి ఆరోగ్యం, పరిశుభ్రత అవసరాలను నొక్కిచెబుతున్నారు. ఇతరులకు చేతనైనంత సేవా చేయాలనే గుణం ఆమెను మహిళా హక్కుల కార్యకర్తగా మార్చింది. 64 ఏండ్ల సునంద మహిళలపై ప్రత్యేక దృష్టి సారించారు. అందునా గ్రామీణ మహిళల అభ్యున్నతికై నిరంతరం కృషి చేస్తున్నారు. 'మహారాష్ట్రలోని గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు సరైన విద్య ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. వారు తమ కాళ్లపై నిలబడాలని, సాధ్యమైనంత వరకు స్వశక్తితో బతికేలా చేయడం చాలా అవసరం' అని ఆమె చెబుతున్నారు.

మామ ప్రోత్సాహంతో

సాధారణ వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన సునందకు గ్రామీణ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అవగాహన ఉంది. విద్య లేకపోవడం, చిన్న వయస్సులోనే వివాహం, ఆర్థికంగా ఆధారపడటం లాంటివి గమనించారు. రాజేంద్ర దినకర్ పవార్‌ను వివాహం చేసుకుని ఆమె మహారాష్ట్రలోని బారామతిలో స్థిరపడ్డారు. మామయ్య అయిన అప్పాసాహెబ్ పవార్ సామాజిక కార్యకర్త. ఆయన 1971లో ప్రారంభించబడిన అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ స్థాపకులలో ఒకరు. బారామతి ప్రాంతంలో నీటి కొరతతో పాటు వ్యవసాయంలో రైతులకు వచ్చే సమస్యల పరిష్కారం కొరకు ఈ ట్రస్ట్ ప్రారంభించారు. పెండ్లి తర్వాత సునంద కుటుంబ బాధ్యతలతో బిజీ అయ్యారు. తన ఇద్దరు పిల్లలు కాస్త ఎదిగిన తర్వాత ఆమె మామ ఆమెను సామాజిక కార్యక్రమాల్లో ప్రోత్సహించాడు.

విద్యా అవకాశాలు

శారదా నగర్‌లోని రైతులు తమ అమ్మాయిలకు రక్షణ ఉండదనే ఉద్దేశంతో చదువుకోసం దూర ప్రాంతాలకు పంపేవారు కాదు. ఇది ఈ ప్రాంతంలో బాలికల అక్షరాస్యత రేటును తగ్గించింది. ఈ సమస్యను అప్పాసాహెబ్ పవార్ గమనించారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఆయన అమ్మాయిల కోసం రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ కాంప్లెక్స్‌ను స్థాపించాడు. ఇది 1989లో మహిళా కళాశాలతో ప్రారంభమైంది. దీనితో పాటు ప్రాథమిక, మాధ్యమిక, మహిళల కోసం శారదాబాయి పవార్ కళాశాల, ఆర్ట్ టీచర్ డిప్లొమా, డి.ఇడి. ఇలా ఎన్నో కోర్సులు ఉన్నాయి. ఇప్పుడు అక్కడ ఎనిమిది వందల మంది అమ్మాయిలకు కాలేజ్, నర్సింగ్ కాలేజ్, హాస్టల్స్ అందుబాటులో ఉన్నాయి. అప్పసాహెబ్ పవార్ అమ్మాయిలతో వారి వ్యక్తిగత సమస్యల గురించి కూడా మాట్లాడేవారు. వారికి సాయం చేయమని సునందను అడిగాను. ఆమె వెంటనే తన పని ప్రారంభించారు. హాస్టల్ కార్యకలాపాలు నిర్వహిస్తూ అమ్మాయిల సమస్యలను పరిష్కరించేవారు. 2000లో అప్పసాహెబ్ మరణించిన తర్వాత సునంద తన భర్తతో కలిసి ట్రస్ట్ బాధ్యతలు చూస్తున్నారు.

మహిళల కోసమే...

హాస్టల్‌ను నిర్వహిస్తున్నప్పుడు ఆమె చాలా మంది తల్లులతో మాట్లాడేవారు. అప్పటి వరకు వారికి తమ కోసం ఉన్న ప్రభుత్వ పథకాల గురించి తెలియదు. అందువల్ల ఆమె బారామతిలో 15,000 మంది మహిళలతో శారదా మహిళా సంఘ్‌ను ప్రారంభించారు. వివిధ ప్రభుత్వ పథకాల గురించి వారికి చెప్పారు. ఎస్‌జీహెచ్‌లో భాగంగా మహిళలు శిక్షణ పొందారు. ఉత్పత్తి, ప్యాకేజింగ్, విక్రయ పద్ధతులపై అవగాహన పెంచుకున్నారు. అయితే ఉత్పత్తులను విక్రయించడానికి వారికి వేదిక లేదు. అందుకే వారు తయారు చేసే కళాఖండాలు, ఆభరణాలు, గాజులు వంటి వాటిని ప్రదర్శించడానికి మహిళా పారిశ్రామికవేత్తల కోసం పవార్ భీమ్‌తడి జాత్ర అనే సాంస్కృతిక కార్నివాల్‌ను ప్రారంభించారు.

పోలీసు శిక్షణా కార్యక్రమం

హోమ్‌మేడ్ మసాలా అనే కంపెనీని నడుపుతున్న స్మితా సోలాస్కర్‌కు పదేండ్ల కిందట భీమ్‌తడి జాత్ర గురించి తెలిసింది. 'నేను నా ఉత్పత్తిని, దాని ప్యాకేజింగ్‌ను ఎలా మెరుగుపరచుకోవాలో సునంద నాకు సహకరించారు. అంతేకాదు ఈ జాత్ర నా ఉత్పత్తులను ఎక్కువ మందిని చేరేలా ఒక వేదికనిచ్చింది' అంటూ సంతోషాన్ని వ్యక్తం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లలకు చిన్నతనంలోనే పెళ్లిళ్ల చేస్తారని, దాంతో వారు ఇంటర్ చదువుకు దూరమవుతున్నారని సునంద చెప్పారు. అందుకే బారామతిలోని ఒక పోలీసు అధికారి పోలీసు పరీక్షలో ఉత్తీర్ణత సాధించడానికి, పోలీసు దళంలో చేరడానికి యువతులకు శిక్షణ ఇప్పించమని సునందకు సూచించారు. దాంతో ఆమె మహారాష్ట్రలోని గ్రామీణ బాలికల కోసం 2016లో పోలీసు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆరు నెలల పాటు అందులో శిక్షణా కార్యక్రమం ఉచితంగా ఉంటుంది. ఇప్పటి వరకు మహారాష్ట్రలో 800 మందికి పైగా యువతులు ఇందులో శిక్షణ పొందారు. 400 మంది బాలికలు లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో ఎంపికయ్యారు. 2023లో మహారాష్ట్రలో పోలీసు శిక్షణా కార్యక్రమంలో చేరిన తర్వాత దాదాపు 87 మంది బాలికలు పోలీసు శాఖలో చేరారు.

ఉచిత శస్త్ర చికిత్సలు

సునంద ప్రయత్నాలు రుతు పరిశుభ్రతతో ఆగలేదు. మహిళల కోసం ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఆమె తన తల్లి, చెల్లెలును క్యాన్సర్‌తో కోల్పోయారు. అందుకే కాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు, వార్షిక ఆరోగ్య పరీక్షలు, ఉచిత శస్త్రచికిత్సలను అందిస్తున్నారు. ఇంకా మెల్లకన్ను ఉన్న పిల్లలకు ఆపరేషన్లు చేయిస్తున్నారు. అంతేకాదు 50 ఏండ్ల కిందట అప్పాసాహెబ్ పవార్ స్థాపించిన నీటి సంరక్షణ కార్యక్రమాన్ని కూడా ఆమె ముందుకు తీసుకెళు తున్నారు. బారామతి, ఇందాపూర్, పురందర్‌లోని 50కి పైగా గ్రామాలలో నీటి సంరక్షణ వంటి కార్యక్రమాలను ఆమె పర్యవేక్షిస్తున్నారు.

సవాళ్లు - భవిష్యత్తు

సునంద ప్రయాణం అంత తేలికైనది కాదు. మహిళల్లో అవగాహన లేకపోవడమే ఆమెకెదురైన అతిపెద్ద సవాలు. 'వారి ఇళ్లు, గ్రామం గురించి తప్ప ఇతర విషయాల గురించి వారికి అవగాహన లేదు. మొదట్లో అవగాహన కల్పించడమే మాకు పెద్ద సవాలుగా ఉండేది' ఆమె జతచేస్తున్నారు. వీటితో పాటు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ సునంద ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. తన భవిష్యత్ ప్రాజెక్టల గురించి మాట్లాడుతూ ఇప్పటి వరకు చాలా పాఠశాలల్లో బాలికలకు సరైన టాయిలెట్లు, శానిటరీ న్యాప్‌కిన్‌లను మార్చుకోవడానికి ప్రత్యేక స్థలం లేదని ఆమె చెబుతున్నారు. అంతేకాదు మరుగుదొడ్డి లేకపోవడంతో చాలా మంది అమ్మాయిలు పాఠశాలలో నీళ్ల తాగడమే మానేశారని ఆమె అంటున్నారు. అందుకే పాఠశాలల్లో బాలికల కోసం కొత్త మరుగుదొడ్ల నిర్మించాలని ఆమె ఆలోచిస్తున్నారు.



మహిళల ఆరోగ్యం కోసం

చాలా మంది మహిళలు రుతుస్రావ సమయంలో వస్త్రాన్ని ఉపయోగించడం సునంద గమనించారు. దీనివల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి వారికి తెలియదు. దీనిని పరిష్కరించేందుకు పాఠశాలలు, కళాశాలల్లో రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన సదస్సులు ప్రారంభించారు. అవగాహనతో పాటు ఏడుగురు సభ్యులతో కూడిన ఆమె బృందం బయోడిగ్రేడబుల్ శానిటరీ నాప్‌కిన్ అయిన సోబాటిని పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు 2,50,000 మంది బాలికలకు ప్యాడ్స్ అందించారు. ఒక కంపెనీ ఆటోమేటిక్ ప్యాడ్ తయారీ యంత్రాన్ని కూడా విరాళంగా ఇచ్చింది. దీనితో ఎస్‌జీహెచ్ మహిళలు శానిటరీ న్యాప్‌కిన్‌లను ఉత్పత్తి చేస్తున్నారు.



బీజేపీతో ప్రమాదం..

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లు సాధించాలని పిలుపుని చ్చారు. కేసీఆర్ చీకట్లో ఖాళీగా లేడనీ, మోడీతో చీకటి చర్చలు జరుపుతు న్నారని విమర్శించారు. ఎంపీలుగా పోటీ చేసే అభ్యర్థుల నుంచి దరఖాస్తు లను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. మార్చి 3 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలపారు. దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక కమిటీ వేసినట్టు తెలిపారు.

ఇంద్రవెల్లి నుంచే ఎన్నికల ప్రచారం

ఫిబ్రవరి 2న ఇంద్రవెల్లి సభ నుంచి లోక్‌సభ ఎన్నికలకు శంఖారావం పూరిస్తున్నామని రేవంత్ ఈ సందర్భంగా తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు ఇంకా 60 రోజుల్లో జరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ వచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా రాజ్యసభ ఎన్నికల జరుగుతున్నాయని తెలిపారు. లోకసభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ప్రజల్లోకి వెళ్లేందుకు వచ్చే నెల 2 నుంచి సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వాటిని పెద్దఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా ఇన్‌చార్జిలను నియమించామని తెలిపారు. నియోజక వర్గాల వారీగా సభలు నిర్వహించి ముందుకు పోవాలని కోరారు. ఎమ్మెల్యేలు ఎవరు అడిగినా అప్పాయింట్‌మెంటు ఇస్తామని చెప్పారు. బీఆర్‌ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు కూడా సమయమిస్తామని వివరించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు సంబంధించి రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని చెప్పారు. భారీ నీటిపారుదల శాఖపై కూడా బడ్జెట్ సమావేశాల్లో శ్వేతపత్రం విడుదల చేస్తామన్నారు. ప్రజాగాయకులు గద్దర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని వెల్లడించారు. గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై చట్ట ప్రకారం విచారణ చేపడుతున్నాయని రేవంత్ వివరించారు.

డిస్కంల్లో తాత్కాలిక డైరెక్టర్ల నియామకం

(మొదటిపేజీ తరువాయి)

జనరల్ మేనేజర్లుగా పనిచేస్తున్న వారినే తాత్కాలిక డైరెక్టర్లుగా బాధ్యతలు అప్పగిస్తూ, ఉత్తర్వులు ఇచ్చారు. దానిప్రకారం దక్షిణ డిస్కంలో డైరెక్టర్ (కమర్షియల్, ఐపీసీ అండ్ ఆర్‌ఏసీ)గా సీజీఎమ్‌గా పనిచేస్తున్న కే రాములును నియమించారు. మరో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటీ, ఈఎ, డీపీఈ అండ్ అసెస్‌మెంట్స్)గా ప్రాజెక్ట్స్ విభాగం చీఫ్ జనరల్ మేనేజర్ కే నందకుమార్ నియమితులయ్యారు. డైరెక్టర్ (ఆపరేషన్స్, పీ అండ్ ఎమ్ఎమ్)గా ఓ అండ్ ఎమ్ సీజీఎమ్‌గా పనిచేస్తున్న ఎస్ నర్సింహులు, డైరెక్టర్ (ఫైనాన్స్, హెచ్‌ఆర్‌ఏ అండ్ ఐఆర్)గా రెవెన్యూ సీజీఎమ్‌గా పనిచేస్తున్న కే సుధామాధురికి బాధ్యతలు అప్పగించారు.

టీఎస్ఎన్పీడీసీఎల్‌లో...

ఉత్తర డిస్కం డైరెక్టర్ (ప్రాజెక్ట్స్)గా కమర్షియల్ విభాగం సీజీఎమ్‌గా పనిచేస్తున్న టీ సాదర్‌లాల్, డైరెక్టర్ (ఆపరేషన్స్)గా ఓ అండ్ ఎమ్-1 సీజీఎమ్‌గా పనిచేస్తున్న వీ మోహన్‌రావు, డైరెక్టర్ (హెచ్‌ఆర్‌డీ అండ్ ఐఆర్)గా మార్కెటింగ్ సీజీఎమ్ బీ అశోక్‌కుమార్ తాత్కాలికంగా నియమితులయ్యారు.

పార్లమెంట్ ప్రభారీల నియామకం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్ ప్రభారీలను నియమిస్తూ తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభారీలుగా నియమితులైన వారిలో ఎ.శ్రీనివాస్(ఆదిలాబాద్), కొప్పు భాష(పెద్దపల్లి), మీసాల చంద్రయ్య(కరీంనగర్), వెంకటరమణి(నిజామాబాద్), బాదం మహిపాల్‌రెడ్డి(జహీరాబాద్), బి.లక్ష్మినర్సయ్య(మెదక్), గోలి మధుసూదన్‌రెడ్డి(మల్కాజిగిరి), వీరెల్లి చంద్రశేఖర్(సికింద్రాబాద్), ఎ.రామకృష్ణ(హైదరాబాద్), ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి(చేవెళ్ల), కె.వి.ఎల్.ఎన్.రెడ్డి(మహబూబ్‌నగర్), ఎ.అశోక్‌రెడ్డి(నాగర్‌కర్నూల్), చాడ శ్రీనివాస్‌రెడ్డి(నల్లగొండ), పి.పాపారావు(భువనగిరి), వి.మురళీధర్‌గౌడ్(వరంగల్), నూకల వెంకటనారాయణరెడ్డి(మహబూబాబాద్), జె.శ్రీకాంత్(ఖమ్మం) ఉన్నారు.

నాలుగు జిల్లాలకు బీజేపీ అధ్యక్షుల నియామకం

మరో నాలుగు జిల్లాలకు బీజేపీ జిల్లా అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

ఫ్రంట్. బీహార్‌లో నితీష్ కుమార్ పార్టీ మినహా మహాకూటమి ఉంది. 'ఇండియా' ఫోరంకు చాలా రాష్ట్రాల్లో సాధారణ అభ్యర్థులు ఉన్నారు. కేరళ, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఇది సాధ్యం కాదు. బీహార్‌లో ప్రస్తుత పరిణామాలకు నితీష్ కుమార్ మాత్రమే బాధ్యత వహించాలి. మోడీ కేరళకు వచ్చి మాట్లాడితే ఏమీ జరగదు. ఎవరిని ఎన్నుకోవాలో ప్రజలే నిర్ణయిస్తారు. ఈడీ, సీబీఐని బీజేపీ, కేంద్ర ప్రభుత్వం రాజకీయ అస్త్రంగా వాడుకుంటున్నాయి. ఈడీ కేసు పెట్టిన వారు బీజేపీలో చేరితే కేసు క్లోజ్ అయ్యే పరిస్థితి ఉంది. 2019 తరువాత ఈడీ 5,500 కంటే ఎక్కువ కేసులను నమోదు చేసింది. 23 శాతం కేసులు మాత్రమే కోర్టుకు చేరాయి. ప్రత్యర్థులను భయపెట్టడానికి, వేధించడానికే ఈడీ ఉపయోగించబడుతుంది. కేరళను కష్టాల్లోకి నెట్టిన బిజెపికి సాయం చేయడమే కాంగ్రెస్ వైఖరిగా ఉంది" అని ఏచూరి అన్నారు.

ఈవీఎంల్లోని సీక్వెన్స్‌లో మార్పులు చేయాలి

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం) సిస్టమ్‌లోని యంత్రాల క్రమాన్ని రీఆర్డరింగ్ చేయాలని అన్నారు. ఈవీఎం వ్యవస్థలో బ్యాలెట్ యూనిట్ (బీయూ), కంట్రోల్ యూనిట్ (సీయూ), ఇటీవల జోడించిన ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వివిప్యాట్) ఉన్నాయి. ఈవీఎంల పనితీరుపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని సీపీఐ(ఎం) గుర్తించింది. అందుకే పోలింగ్ బూత్‌లో ఈ మెషీన్ల ప్లేస్‌మెంట్ సీక్వెన్స్‌లో మార్పును ప్రతిపాదించాం" అని ఏచూరి తెలిపారు. "ప్రస్తుతం, ఈ ప్రక్రియలో యూనిట్‌లో ఓటింగ్ ఉంటుంది. ఇది కంట్రోల్ యూనిట్‌కి బదిలీ చేయబడే ముందు ధ్రువీకరణ కోసం వివిప్యాట్‌కు పంపిస్తుంది. మేం ఓటరు యూనిట్ నుంచి వివిప్యాట్‌కు ప్రసారాన్ని ట్రాక్ చేయగలిగినప్పటికీ, వివిప్యాట్ నుంచి కంట్రోల్ యూనిట్‌కు ఏమి ప్రసారం చేయబడుతుందనే దానిపై అనిశ్చితి ఉంది. కాబట్టి, మేం మార్పును సూచిస్తున్నాం. ఓటర్ యూనిట్, తరువాత కంట్రోల్ యూనిట్, ఆ తరువాత వివిప్యాట్. ఈ విధంగా, ఓటర్లు తమ ఓటు ఖచ్చితంగా కంట్రోల్ యూనిట్‌లో నమోదైందని ధ్రువీకరించుకోవచ్చు" అన్నారు. 50 శాతం వివిప్యాట్‌లను ఓటింగ్ మెషీన్‌లో ప్రదర్శించే సమాచారంతో క్రాస్ చెక్ చేసుకోవాలనే అవసరాన్ని ఏచూరి నొక్కిచెప్పారు. "ఈ విధానంలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉంటుంది. అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సమానమైన అవకాశాన్ని అందించేలా, ప్రజలలో విశ్వాసాన్ని నింపడం లక్ష్యంగా పెట్టుకోవాలి" అని ఏచూరి తెలిపారు.

ప్రాజెక్టుల అప్పగింతపై కేంద్రం దుందుడుకు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) కేంద్ర జలశక్తి శాఖ లేఖలు రాసింది. ఈ సందర్భంగా ప్రాజెక్టుల అప్పగింత కోసం తీసుకోవాల్సిన చర్యలపై కేఆర్ఎంబీ చైర్మెన్, ఇతర ఉన్నతాధికారులు తెలుగు రాష్ట్రాల ఈఎన్సీల మధ్య చర్చలు జరగనున్నాయి. ఈమేరకు లేఖలో స్పష్టంగా ఏజెండాను పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజున ఏపీ సర్కారు నాగార్జునసాగర్ డ్యామ్‌పై ఉన్న దాదాపు 13 గేట్లను మా నీళ్లను మేమే తీసుకుంటామంటూ పోలీసులతో ఆక్రమించింది. అప్పట్లో తెలంగాణ ఆ చర్యను ఖండించింది. కేంద్ర జలశక్తి శాఖ సైతం ఏపీ చర్యను ప్రశ్నించింది. ఈనేపథ్యంలో పరిస్థితులను అదుపులోకి తెచ్చేందుకు అక్కడ సీఆర్‌పీఎఫ్ దళాలను పెట్రోలింగ్ కోసం ఏర్పాటు చేసింది. ఈ చర్య మూలంగా నాగార్జునసాగర్ డ్యామ్ నిర్వహణపై తెలంగాణ సర్కారుకు ఉన్న ప్రస్తుత అధికారం ప్రశ్నార్థకమవుతున్నది. సాగర్‌తోపాటు శ్రీశైలం డ్యామ్ నిర్వహణ కూడా కేఆర్ఎంబీ చేతుల్లో పెట్టేందుకే కేంద్ర జలశక్తి శాఖ గురువారం ఈఎన్సీల సమావేశం ఏర్పాటు చేసింది. ప్రాజెక్టులపై పెత్తనం చేసేందుకే కేంద్రం ఈతరహా చర్యలకు పాల్పడుతున్నదనే విమర్శలు వస్తున్నాయి. డ్యామ్‌ల అప్పగింతతో పాటు మరో 15 అంశాలపై చర్చించి యాక్షన్ ప్లాన్ తయారుచేయాలని కేంద్ర జలశక్తి శాఖ ఆదేశించింది. సీఆర్‌పీఎఫ్ నిఘాను సైతం కొనసాగించాలని ఆదేశించింది. ఒకవేళ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు చెందిన ఇంజినీర్లు నాగార్జునసాగర్ డ్యామ్‌ను సందర్శించాలంటే కచ్చితంగా కేఆర్ఎంబీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. డ్యామ్‌కు ఏవైనా తప్పనిసరి మరమ్మతు పనులు చేయాలన్నా కేఆర్ఎంబీ అంగీకరించాల్సిందే. ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా కేఆర్ఎంబీ చేయనుందని సమాచారం. ఇటీవల సీఎం సమీక్షలో ప్రాజెక్టుల నిర్వహణను ఏవరికీ అప్పగించలేదని రాష్ట్ర సాగునీటి శాఖ చెప్పిన విషయం విదితమే. కాగా నాగార్జునసాగర్ డ్యామ్ అప్పగింత వ్యవహారం మరోసారి రాజకీయ దుమారంలేపే అవకాశాలు లేకపోలేదు. ఈనేపథ్యంలో గురువారం జరిగే సమావేశం కీలకం కానుంది.

ఎమ్మెల్సీల ప్రక్రియపై స్టేటస్‌కో

(మొదటిపేజీ తరువాయి)

పిటిషన్లు హైకోర్టులో విచారణలో ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన కోదండరామ్, అమిర్ అలీ ఖాన్‌ల పేర్లను గవర్నర్ ఆమోదించారు. వీళ్లిద్దరూ ప్రమాణ స్వీకారం చేయబోయే దశలో హైకోర్టు మంగళవారం స్టేటస్‌కో అర్డర్ జారీ చేసింది. ఫిబ్రవరి 8న జరిగే విచారణ వరకు స్టేటస్‌కో (యథాతథస్థితి) ఉత్తర్వులు అమల్లో ఉంటాయని ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ మంగళవారం వెల్లడించింది. ప్రధాన పిటిషన్లు విచారణలో ఉండగా గవర్నర్ నియామక ప్రక్రియ కొనసాగింపుపై హైకోర్టు సందేహాలను వ్యక్తం చేసింది. గత విచారణ సమయంలో వాదప్రతివాదులు నియామక ప్రక్రియ విషయంలో ముందుకు వెళ్లబోమని హామీ ఇచ్చారనీ, ఇది కోర్టు రికార్డుల్లో కూడా ఉందనీ, ఇలాంటి పరిస్థితుల్లో నియామకాల విషయంలో ముందుకు ఎలా వెళతారని ప్రశ్నించింది. దీనిపై అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి స్పందిస్తూ, ఆ హామీ 24వ తేదీన జరిగిన విచారణలో పొడిగించలేదని చెప్పారు. హామీ కొనసాగించాలని పిటిషనర్లు కూడా కోరలేదన్నారు. హామీ కొనసాగలేదనీ, మధ్యంతర ఉత్తర్వులు కూడా లేవని అందుకే గవర్నర్ నియామకాల విషయంలో ముందుకు వెళ్లారని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యిందనీ, ఎలక్షన్ నోటిఫికేషన్ వెలువడ్డాక కోర్టులు జోక్యం చేసుకునే అవకాశం లేదని సుప్రీంకోర్టు రూలింగ్ ఉందని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యిందంటే కోర్టులు జోక్యం చేసుకునేందుకు వీల్లేదని వాదించారు. పబ్లిక్ రిప్రజెంటేషన్ యాక్ట్ రూల్స్ ప్రకారం ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలుపుదల చేసే అధికారం కోర్టులకు లేదని చెప్పారు.

పిటిషనర్ల తరపున సీనియర్ అడ్వొకేట్ ఆదిత్య సోంది వాదించారు. హైకోర్టులో పిటిషన్లు విచారణలో ఉండగానే గవర్నర్ నియామకాల ప్రక్రియలో ముందుకు వెళ్లి చట్ట వ్యతిరేకంగా వ్యవహరించారని చెప్పారు. హైకోర్టులో కేసు కారణంగా ఇక్కడ తుది ఉత్తర్వులు వెలువడే వరకు ఎమ్మెల్సీల నియామక ప్రక్రియను కొనసాగించబోమని గవర్నర్ ప్రత్రికా ప్రకటన వెలువరించిన తర్వాత కూడా నియామకాలకు ఆమోదం చెప్పారన్నారు.

న్యాయస్థానానికి ఇచ్చిన హామీకి భిన్నంగా గవర్నర్ చర్య ఉందన్నారు. ప్రమాణ స్వీకారం బుధవారం జరుగుతుందని, దీనిని అడ్డుకోవాలని కోరారు. వాదనల తర్వాత హైకోర్టు స్టేటస్‌కో ఆర్డర్ ఇచ్చింది. స్టే ఇవ్వడం లేదని తెలిపింది. విచారణను ఫిబ్రవరి 8కి వాయిదా వేసింది. అప్పటి వరకు స్టేటస్‌కో అర్డర్ ఇస్తున్నట్టు స్పష్టం చేసింది. ఎమ్మెల్సీగా ఇద్దరి పేర్లను గవర్నర్ తిరస్కరించిన వ్యవహారంపై సమగ్ర విచారణ చేస్తామని గత విచారణలో హైకోర్టు ప్రకటించింది. సాంకేతిక అంశాల పేరుతో వ్యాజ్యాలపై విచారణ ముగించబోమని చెప్పింది. గత ప్రభుత్వం శాసనమండలిలో రెండు ఖాళీల భర్తీకి చేసిన సిఫార్సులను గవర్నర్ తిరస్కరించడంపై సమగ్ర న్యాయ విచారణ చేస్తామని చెప్పింది. కేవలం సాంకేతిక కారణాల ఆధారంగా పిటిషన్లపై నిర్ణయం తీసుకోబోమని కూడా చెప్పింది. ఈ పరిస్థితుల్లో ఇద్దరిని ఎమ్మెల్సీగా నియమిస్తూ వెలువడిన ఉత్తర్వులు జారీ కావడంతో హైకోర్టు స్టేటస్‌కో ఆర్డర్ జారీ చేసింది.

మా డిమాండ్ వల్లే బీసీల జనగణన, రిజర్వేషన్లపై సీఎం రేవంత్ చర్చ

- భారత జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- యుపీఎఫ్ ఏర్పాటు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీలో మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తాము డిమాండ్ చేసిన మరునాడే సీఎం రేవంత్ రెడ్డి బీసీ సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. ఆ సమీక్షలో బీసీల జనగణన, రిజర్వేషన్లపై చర్చించారని గుర్తు చేశారు. ఇటీవల తాము నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమోదించిన 9 తీర్మానాలకు విశేష స్పందన వస్తున్నదని చెప్పారు. మంత్రులు తమపై విమర్శలు చేస్తున్నారంటే బీసీ ఎజెండాపై కదలిక వస్తున్నట్టేనని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో పలువురు బీసీ సంఘాల నాయకులు ఆమెను కలిశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తమ డిమాండ్లకు వామపక్ష పార్టీల నుంచి కూడా మద్దతు లభించిందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు తొమ్మిది నెలలపాటు ఉద్యమించి అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించిన చరిత్ర తమదని తెలిపారు. అదే స్ఫూర్తితో పూలే విగ్రహం కోసం పోరాటం చేసి సాధించుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో బీసీ హక్కుల కోసం యునైటెడ్ పూలే ఫ్రంట్ - యుపీఎఫ్ ఆవిర్భవించిందని తెలిపారు. భారత జాగృతి సమన్వయంతో ఈ ఫ్రంట్ ఉద్యమాలు చేస్తుందని తెలిపారు. ఫిబ్రవరి 5 నుంచి 10 వరకు అన్ని జిల్లాలతో పాటు విశ్వవిద్యాలయాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు,రెండో వారంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా, త్వరలో అన్ని జిల్లాల్లో ఫ్రంట్ కమిటీల నిర్మాణాన్ని చేపడతామని తెలిపారు. పోరాటానికి అన్ని బీసీ, ప్రజా సంఘాల నాయకులు కలిసి రావాలని ఆహ్వానించారు. ఏప్రిల్ 11 పూలే జయంతిలోగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వీ.ప్రకాశ్, గట్టు రామచందర్ రావు, పల్లె రవికుమార్ గౌడ్, జూలూరి గౌరిశంకర్, ఆంజనేయులు గౌడ్, గెల్లు శ్రీనివాస్, దూదిమెట్ల బాలరాజ్ గౌడ్, విప్లవ్ కుమార్, రాజారాం యాదవ్, సర్దార్ రవీందర్ సింగ్, దావ సురేశ్, మఠం భిక్షపతి, భారత జాగృతి నాయకులు రాజీవ్ సాగర్, నవీన్ ఆచారి, పద్మశాలి సంఘం నాయకుడు బొల్ల శివశంకర్ పాల్గొన్నారు.

ఈడీ దాడి

(మొదటిపేజీ తరువాయి)

నిషేధించారు. సెక్షన్ 144ను విధించారు. దాదాపు 7 వేల మంది పోలీసులు సీఎం ఇంటి ముందు మోహరించారు. అలాగే, రాజ్‌భవన్, రాంచీలోని ఈడీ ఆఫీసు ముందు కూడా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేసి ఆంక్షలు విధించారు.

మధ్యాహ్నం ప్రత్యక్షం

కనిపించకుండా పోయిన హేమంత్ సొరెన్ మంగళవారం మధ్యాహ్నం తన అధికారిక కారులో వెళ్తూ కనిపించారు. చిరునవ్వు చిందిస్తూ మీడియాకు చేతులు ఊపారు. కాగా, సోమవారం ఢిల్లీలోని హేమంత్ సోరెన్ అధికారిక నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించింది. ఆ సమయంలో హేమంత్ అక్కడ లేరు. దీంతో ఆయన అరెస్టు కావచ్చునే అనుమానాలు వచ్చాయి. రాంచీకి చేరుకున్న ఆయన.. గాంధీ వర్ధంతి సందర్భంగా బాపూ వాటికకు వెళ్లారు. అక్కడ గాంధీకి నివాళులు అర్పించారు. కనిపించకుండా వెళ్లటం, తిరిగి రాంచీలోని ఇంటికి చేరుకోవటంపై మీడియా ప్రశ్నలకు హేమంత్ సోరెన్ స్పందిస్తూ.. తాను మీ గుండెల్లో ఉన్నానని అన్నారు. "మనమంత జాతి పిత (గాంధీ) అడుగుజాడల్లో, ఆయన సిద్ధాంతాలను ఆచరించడానికి సిద్ధమై ఉన్నాం. వారు మన మధ్య జన్మించిడం, మనకు మార్గనిర్దేశనం చేయటం మనకు గర్వకారణం" అని జార్ఖండ్ సీఎం అన్నారు. హేమంత్ సోరెన్ ఈనెల 27న రాంచీ నుంచి ఢిల్లీకి వెళ్లారు. రాంచీలోని తన ఇంటిలో మధ్యాహ్నం ఒంటి గంటకు నేటి విచారణకు ఆమోదం తెలుపుతూ సొరెన్ ఈడీ అధికారులకు ఈమెయిల్ సైతం చేశారని ఈడీ వర్గాలు తెలిపాయి. ఈడీ సమన్లను హేమంత్ సొరెన్ ఇప్పటి వరకు తొమ్మిది సార్లు దాటవేశారు. కాగా, ఢిల్లీలోని హేమంత్ సొరెన్ నివాసానికి ఈడీ బృందం సోమవారం వచ్చిన తర్వాత ఆ రోజు రాత్రి వరకు జేఎంఎం ఎమ్మెల్యేలు అక్కడే ఉన్నారు.

పంచాయతీలకే తాగునీటి నిర్వహణ

అందని గ్రామాలపై సర్వే

- నియోజకవర్గానికి రూ.కోటి
- కృష్ణా, గోదావరితో పాటు కొత్త రిజర్వాయర్ల వినియోగం
- కనెక్టివిటీ లేని గ్రామాలకు తారురోడ్లు
- డ్వాక్రాలకు చేయూత
- సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కేవలం గోదావరి, కృష్ణా నదుల నుంచే గాక, కొత్తగా నిర్మించిన మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక్‌సాగర్ రిజర్వాయర్లనూ తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. అందుకు అనుగుణంగా కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. దీంతో చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు తక్కువ ఖర్చుతో తాగునీటి సరఫరా సులభమవుతుందన్నారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖపై సమీక్ష చేశారు. గ్రామాల్లో తాగునీటి నిర్వహణ విధులను సర్పంచులకు అప్పగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇంటింటికీ నీళ్లను అందించే బాధ్యతను వాళ్లకే ఇవ్వాలని చెప్పారు. అందుకు అవసరమైన విధివిధానాలు తయారు చేయాలని అన్నారు. గ్రామాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేసే బాధ్యత మిషన్ భగీరథ శాఖ తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి నిర్వహణ, నల్లాలు, పైపులైన్ల నిర్వహణ మాత్రం సర్పంచులకే అప్పగించాలని చెప్పారు. ఇప్పటివరకు మిషన్ భగీరథలో చేపట్టిన ఇంట్రా విలేజ్ పనులు, ఇంటింటికీ నల్లా నీటిని సరఫరా చేసే నిర్వహణ ఎవరూ పట్టించుకోవటం లేదని వ్యాఖ్యానించారు.

'జవాబుదారీతనం లేదు'

గ్రామాల్లో తాగునీటి నిర్వహణ అంశం ఎవరి పరిధిలో లేదని అధికారులు సీఎంకు వివరణ ఇచ్చారు. జవాబుదారీతనం లేకపోతే గ్రామాల్లో తాగునీటి సమస్య పెరిగిపోతుందని సీఎం అన్నారు. వందకు వంద శాతం రాష్ట్రంలో ఇంటింటికీ నల్లా నీళ్లు ఇచ్చినట్టు గత ప్రభుత్వం చెప్పుకోవటంతో నష్టమే తప్ప లాభం లేకుండా పోయిందని సీఎం అన్నారు. దీంతో అవకాశమున్నా, కేంద్రం నుంచి జల జీవన్ మిషన్ నిధులు రాకుండా పోయాయని అన్నారు. అందుకే వాస్తవాలను దాచిపెట్టి గొప్పలకు పోవాల్సిన అవసరం లేదని అధికారులను అప్రమత్తం చేశారు. ఇప్పటికీ రాష్ట్రంలో చాలాచోట్ల తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారనీ, తండాలు, గూడేలు, అటవీ గ్రామాలకు నీళ్లు అందటం లేదన్నారు. ఎన్నికలప్పుడు తాను ఖానాపూర్‌కు వెళితే తాగునీటికి ఇబ్బంది పడుతున్నట్టు చాలా గ్రామాల ప్రజలు తన దృష్టికి తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఏయే ప్రాంతాలకు, ఎన్ని హాబిటేషన్లకు తాగునీరు అందటం లేదో సమగ్రంగా సర్వే చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. నెలాఖరుతో సర్పంచుల పదవీకాలం ముగిసిపోతుందనీ, అధికారులే తాగునీటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని చెప్పారు. సంబంధిత ఇంజినీర్లు అన్ని గ్రామాలకు వెళ్లి నిజనిర్ధారణ బందం చేసినట్టుగానే పక్కాగా తాగునీరు అందని హాబిటేషన్ల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. జలజీవన్ మిషన్ నిధులు రాబట్టుకునేలా కొత్త ప్రతిపాదనలు తయారు చేసి కేంద్రానికి పంపించాలని ఆదేశించారు.

ప్రతి అసెంబ్లీకి రూ. కోటి

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్) కింద కేటాయించిన రూ.10 కోట్లలో రూ. కోటిని తాగునీటి అవసరాలకు ఖర్చు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్నీ ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో లభ్యమయ్యే నీటిని ప్రజల తాగునీటి అవసరాలకే మొదటి ప్రాధాన్యంగా అందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలనీ, వాళ్లకు ఆర్థికంగా చేయూతను అందించే కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, హాస్టళ్ల విద్యార్థినీవిద్యార్థులు, పోలీసులకు అందించే యూనిఫారాలు కుట్టించే పనిని ఈ సంఘాల మహిళలకు అప్పగించాలని సూచించారు. అవసరమైతే తగిన శిక్షణను ఇచ్చి వారిని ప్రోత్సహించాలనీ, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికీ రోడ్డు కనెక్టివిటీ లేని422 గ్రామ పంచాయతీలు, 3177 ఆవాసాలకు తారురోడ్లను నిర్మించాలని సీఎం ఆదేశించారు.



మనోళ్ల శుభారంభం

- రెండో రౌండ్లో త్రిసా, గాయత్రి
- థాయ్‌లాండ్ మాస్టర్స్

బ్యాంకాక్ : థాయ్‌లాండ్ మాస్టర్స్ టోర్నీలో భారత మహిళల డబుల్స్ జోడిలు శుభారంభం చేశాయి. ఆరో సీడ్ త్రిసా జాలి, పుల్లెల గాయత్రి జంట 16-21, 21-10, 21-18తో 74 నిమిషాల్లోనే హాంగ్‌కాంగ్ జోడిపై విజయం సాధించింది. సీనియర్ షట్లర్ అశ్విని పొన్నప్పతో కలిసి తనీశ క్రాస్టో సైతం మెరిసింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో 21-13, 21-17తో వరుస గేముల్లో చైనీస్ తైపీ జంటను చిత్తు చేసింది. పురుషుల సింగిల్స్‌లో భారత షట్లర్లు సమీర్ వర్మ, శంకర్ ముతుస్వామి ప్రధాన టోర్నీకి అర్హత సాధించారు. మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్, మిథున్ మంజునాథ్, కిరణ్ జార్జ్ సహా మాళవిక బాన్సోద్, ఇమద్ ఫరూకీ, అష్మిత థాయ్‌లాండ్ మాస్టర్స్ బరిలో నిలిచారు. పురుషుల డబుల్స్‌లో వరల్డ్ నం.1 సాత్విక్, చిరాగ్ జోడి ఆడటం లేదు. వరుస టోర్నీల అనంతరం అగ్ర షట్లర్లు విశ్రాంతి తీసుకున్నారు.

జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌కు భట్టికి ఆహ్వానం



హైదరాబాద్: వచ్చే నెలలో హైదరాబాద్ ఆతిథ్యమిస్తున్న నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆ సంఘం జాతీయ జీవితకాల అధ్యక్షుడు మర్రి లక్ష్మణ్ రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు ప్రజాభవనలో భట్టిని మర్యాదపూర్వకంగా కలిసి, పోటీల వివరాలను తెలియజేశారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత హైదరాబాద్‌లో ఈ ప్రతిష్టాత్మక పోటీలు నిర్వహిస్తుండడంతో ప్రభుత్వ సహకారం కావాలని భట్టిని లక్ష్మణ్ రెడ్డి కోరారు. ఈ పోటీలు ఫిబ్రవరి 8 నుంచి 11వ తేదీ వరకు గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్నాయి. 20 రాష్ట్రాలకు చెందిన సుమారు నాలుగు వేల మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు.



విశాఖ టెస్టుకు నలుగురు స్పిన్నర్లతో?!

ఇంగ్లాండ్ చీఫ్ కోచ్ మెక్‌కలమ్ సంకేతం

విశాఖపట్నం : భారత్‌తో హైదరాబాద్ టెస్టులో ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగి అందరినీ ఆశ్చర్యపరిచిన ఇంగ్లాండ్ జట్టు మేనేజ్‌మెంట్.. ఫిబ్రవరి 2 నుంచి ఆరంభం కానున్న విశాఖ టెస్టులో ఏకంగా నలుగురు స్పిన్నర్లను ప్రయోగించేందుకు సిద్ధమవుతోంది. ఇంగ్లాండ్ టెస్టు జట్టును బెన్ స్టోక్స్, మెక్‌కలమ్ భయమెరుగని ఫార్ములా నడిపిస్తున్నారు. ఈ జోడీ 19 టెస్టుల్లోనే ఏకంగా 14 విజయాలు నమోదు చేసింది. ఓ రేడియో షోలో మాట్లాడుతూ.. అవసరమైతే సిరీస్‌లో రానున్న మ్యాచులకు అందరు స్పిన్నర్లనే తీసుకుంటామని బ్రెండన్ వ్యాఖ్యానించాడు. 'బషీర్ ప్రతిభావంతుడైన స్పిన్నర్. అబుదాబి క్యాంప్‌లో బాగా ఆకట్టుకున్నాడు. భారత పిచ్‌లపై రాణించగల సత్తా అతడికి ఉంది. భారత్‌తో సిరీస్‌లో రానున్న టెస్టులకు సైతం పిచ్‌లు హైదరాబాద్ తరహాలో స్పిన్‌కు అనుకూలిస్తే.. ఇంగ్లాండ్ అందరు స్పిన్నర్లతో బరిలోకి దిగేందుకు వెనుకడుగు వేయదు' అని మెక్‌కలమ్ అన్నాడు. హైదరాబాద్ టెస్టులో ఇంగ్లాండ్ మార్క్‌వుడ్ రూపంలో ఒక్క పేసర్‌తోనే ఆడింది. 25 ఓవర్లలో మార్క్‌వుడ్ ఒక్క వికెట్ తీయలేదు. జాక్ లీచ్, టామ్ హార్ట్లీ, రెహాన్ అహ్మద్‌లకు తోడు జో రూట్ స్పిన్ బాధ్యతలు పంచుకున్నాడు. జాక్ లీచ్ మోకాలి గాయం నుంచి కోలుకుంటే విశాఖ టెస్టులోనే ఇంగ్లాండ్ ఆల్ స్పిన్ బౌలింగ్ బృందంతో బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

లౌకిక విలువలు కాపాడండి

ప్రజలకు కేరళ సీఎం పినరయి విజ్ఞప్తి

- జాతిపితకు ఘన నివాళి



తిరువనంతపురం : జాతిపిత మహాత్మా గాంధీ వర్థంతి సందర్భంగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మంగళవారం ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. గతంలో కంటే ఇప్పుడు శాంతిని, సామరస్యాన్ని కాపాడడం ఎంతో కీలకంగా మారాయని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన అభిప్రాయపడ్డారు. 'దేశంలో లౌకిక విలువలను కాలరాసేందుకు మతతత్వ శక్తులు ప్రయత్నిస్తున్నాయి. విభజనకు వ్యతిరేకంగా గాంధీ చేసిన హెచ్చరికలను మనం ఇప్పుడు గమనంలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. సమానత్వం కోసం సంఘటితంగా నిలవాలి. మహాత్మా గాంధీ ప్రాణాలను హరించిన మతోన్మాద శక్తుల కబంధ హస్తాల నుండి లౌకిక సామాజిక విలువలను కాపాడతామని మనమంతా ప్రతిజ్ఞ చేయాలి' అని పినరయి కోరారు.

టీ20 క్రికెట్ చాంప్ మార్షల్



హైదరాబాద్ : 5వ ఐఐపీపీఎల్ టీ20 క్రికెట్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను టీమ్ మార్షల్ సొంతం చేసుకుంది. సోమవారం జరిగిన ఫైనల్లో టీమ్ రాయల్‌పై మార్షల్ 14 పరుగులతో గెలుపొందింది. తొలుత 20 ఓవర్లలో 129/8 పరుగులు చేయగా.. రాయల్ 20 ఓవర్లలో 115/7 పరుగులకే పరిమితమైంది. 199 పరుగులు, నాలుగు వికెట్ల ప్రదర్శనతో అబ్దుల్ మునీర్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. ప్రవీణ్ కుమార్, విజయ్ కుమార్‌లు విజేతలకు బహుమతులు అందజేశారు.

ఫిబ్రవరి 8 నుంచి మాస్టర్స్ గేమ్స్



హైదరాబాద్ : 6వ జాతీయ మాస్టర్స్ గేమ్స్ చాంపియన్‌షిప్స్ ఫిబ్రవరి 8 నుంచి ఆరంభం కానున్నాయి. మహిళలు, పురుషుల విభాగాల్లో నేషనల్ చాంపియన్‌షిప్స్‌కు ఈ ఏడాది గోవా వేదిక కానుంది. తెలంగాణ రాష్ట్రం నుంచి 246 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరు కానున్నారు. జాతీయ టోర్నీలో తెలంగాణ అథ్లెట్లు ధరించే జెర్సీ సహా స్పోర్ట్స్ కిట్‌ను హైదరాబాద్ సంయుక్త కలెక్టర్ మధుసూదన్, ఉప కలెక్టర్ వేణు మాధవ్‌లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ వైస్ చైర్మెన్ జగజీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం



వినోదం + భావోద్వేగం


'బిగ్‌బాస్' ఫేమ్ సోహెల్ టైటిల్ రోల్‌లో శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్, కథ వేరుంటాది బ్యానర్స్ పై ఎం.డీ పాషా నిర్మిస్తున్న చిత్రం 'బూట్ కట్ బాలరాజు'. మేఘ లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఫిబ్రవరి 2న ఈ సినిమా విడుదల కానుంది.
ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. బ్రహ్మానందం, హీరోలు సందీప్ కిషన్, మంచు మనోజ్, రోషన్ కనకాల, దర్శకులు శ్రీకాంత్ ఓదెల, సాయి రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరైన ఈ వేడుకగా గ్రాండ్‌గా జరిగింది.
హీరో సోహెల్ మాట్లాడుతూ,'పాషా లాంటి నిర్మాత దొరకడం నా అదృష్టం. ఈ సినిమా నిర్మాణం యాభై శాతం పూర్తయిన తర్వాత ఫైనాన్సియల్‌గా కొంత ఇబ్బంది ఎదురవ్వడంతో నిర్మాత కాస్త ఒత్తిడికి లోనయ్యారు. ఆయన్ని ఒత్తిడి తీసుకోవద్దని చెప్పాను. మా నాన్న రిటైర్మెంట్ పైసలు, నేను సంపాదించినా పైసలు ఇల్లు కొనుక్కుందామని ఉంచుకున్నవి అన్ని ఈ సినిమాకు పెట్టాను. ఈ సినిమాతో నిర్మాతల కష్టాలు మరింతగా అర్థమయ్యాయి. నిర్మాత దిల్ రాజుకి మా పరిస్థితి చెప్పాం. ఆయన చాలా గొప్ప మనసుతో 'నైజాం నేను చూసుకుంటా, మీరు ఒత్తిడి తీసుకోవద్దు" అని చెప్పారు. ఆయనకి హృదయపూర్వక ధన్యవాదాలు. ఏలూరు విజయ్ సినిమా నచ్చి తీసుకున్నారు. వారికి ధన్యవాదాలు. థియేటర్స్‌లో ఈ సినిమాని చూసి ఎంజాయ్ చేస్తారు. చాలా ఫన్, ఎమోషన్ ఉంటుంది. ఇందులో చాలా మంచి డ్యాన్స్ కూడా చేశాను. మనం జీవితంలో ఓడినా, గెలిచినా తల్లికి కొడుకు మీద ప్రేమపోదు. అదే ఈ సినిమాలో అద్భుతంగా చూపించాం' అని తెలిపారు.
'వినోదంతో పాటు మంచి భావోద్వేగం ఉన్న చిత్రమిది. తప్పకుండా ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని దర్శకుడు శ్రీకోనేటి అన్నారు. నిర్మాత పాషా మాట్లాడుతూ,'దర్శకుడు అద్భుతంగా తీశారు. సోహెల్‌కి సినిమా అంటే చాలా ఇష్టం. తనతో సినిమా చేయడం గర్వంగా భావిస్తున్నాను. ప్రేక్షకులంతా థియేటర్స్ లో చూసి ఘన విజయాన్ని చేయాలి' అని చెప్పారు.
'ఈ సినిమాలో సోహెల్‌ని చూస్తుంటే తనలో పట్టుదల, తపన కనిపించింది. ఈ సినిమా ఘన విజయం సాధింస్తుందని చెప్పడానికి అదొక్కటి చాలు. నిర్మాత పాషా మంచి అభిరుచితో సినిమాని నిర్మించారు. ఈ సినిమా సూపర్ డూపర్ హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని బ్రహ్మానందం చెప్పారు.



ఫిబ్రవరి 16న రిలీజ్

సందీప్ కిషన్ తాజాగా నటిస్తున్న చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. విఐ ఆనంద్ దర్శకుడు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై అనిల్ సుంకర సమర్పిస్తున్నారు. బాలాజీ గుత్తా ఈ చిత్రానికి సహ నిర్మాత. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయాన్ని గౌరవిస్తూ, తెలుగు చలనచిత్ర పరిశ్రమ సంక్షేమం కోసం, మేకర్స్ మొదట ప్రకటించిన తేదీని మార్పు చేశారు. ఫిబ్రవరి 16న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదే విషయాన్ని ప్రకటించడానికి మేకర్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్ర టీజర్, ట్రైలర్, 2 చార్ట్‌బస్టర్ పాటలు 'నిజమే నే చెబుతున్నా, హమ్మా హమ్మాతో' ప్రేక్షకులలో హ్యూజ్ బజ్‌ను క్రియేట్ చేసింది.
తొలుత ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 8న విడుదల చేయాలనుకున్నారు. అయితే సంక్రాంతి సినిమాల విడుదల విషయంలో పరిశ్రమ సంక్షేమం కోసం రవితేజ నటించిన 'ఈగల్' సంక్రాంతి బరి నుంచి తప్పుకుని ఫిబ్రవరి 8న విడుదల చేయటానికి మేకర్స్ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని హర్షిస్తూ ఫిబ్రవరి 8న సోలోగా 'ఈగల్'ని రిలీజ్ చేయాలని, దానికి ఎక్కువ థియేటర్లు కేటాయించాని ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయించింది. ఇందులో భాగంగా మా సినిమాని ఫిబ్రవరి 16వ విడుదల చేస్తున్నాం అని మేకర్స్ తెలిపారు.
కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత: రాజేష్ దండా, సహ నిర్మాత: బాలాజీ గుత్తా, సంగీతం: శేఖర్ చంద్ర, డీవోపీ: రాజ్ తోట, ఎడిటర్: ఛోటా కె ప్రసాద్, ఆర్ట్ డైరెక్టర్: ఎ రామాంజనేయులు, సంభాషణలు: భాను భోగవరపు, నందు సవిరిగాన.

విడుదల తేదీలు ఎప్పుడంటే?


పవన్ కళ్యాణ్

పవన్‌కల్యాణ్, 'సాహో' ఫేమ్ సుజీత్ కాంబోలో డివివి ఎంటర్‌టైన్ మైంట్స్ పతాకంపై డివివి దానయ్య నిర్మిస్తున్న చిత్రం 'ఓజీ'. మంగళవారం మేకర్స్ ఈ చిత్ర విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు. సెప్టెంబర్ 27న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. గ్యాంగ్‌స్టర్స్ నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది.


నాని

నాని, వివేక్ ఆత్రేయ కాంబోలో 'సరిపోదా శనివారం' చిత్రాన్ని డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా చిత్రంగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఆగస్ట్ 15న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

విజయంపై నమ్మకంతో ఉన్నా..


సుహాస్

సుహాస్ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. ఫిబ్రవరి 2వ తేదీ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ చిత్రాన్ని జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేష్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మించారు. దుశ్యంత్ కటికినేని దర్శకుడు. మంగళవారం జరిగిన హీరో సుహాస్ మీడియాతో మాట్లాడుతూ, 'రైటర్ పద్మభూషణ్' మాదిరిగానే ఈ సినిమా కూడా విజయం సాధిస్తుందనే నమ్ముతున్నాం. ఈ మధ్యే బాబు పుట్టాడు. మంచి జరుగుతుందనే అనిపిస్తోంది. ఈ సినిమా కోసం బ్యాండ్ కొట్టడం నేర్చుకున్నా. రెండు సార్లు గుండు గీయించుకున్నా. మా నమ్మకం, రెండేళ్ల కష్టం సక్సెస్ రూపంలో మంచి ఫలితాన్ని ఇస్తుందని ఆశిస్తున్నాం. దుశ్యంత్ రాసిన కథ నన్ను కదిలించింది. మా డైరెక్టర్ చూసిన సంఘటనలు, తనకు లైఫ్‌లో జరిగిన కొన్ని సందర్భాల స్ఫూర్తి ఈ కథలో ఉంది. ఇది 2007 లో జరిగే కథ. ఈ సినిమా కథ ఇంటర్వెల్ ఇరవై నిమిషాల ముందు వరకు సరదాగా సాగుతుంది. అక్కడి నుంచి ఒక హైలోకి వెళ్తుంది. ఇంటర్వెల్ వరకు చూశాక సినిమా బాగా చేశారని ఫీల్ అవుతారు. ఆ తర్వాత మూవీ ఎమోషనల్‌గా ఫీల్‌తో సాగుతుంది. కలర్ ఫొటో సందీప్‌తో ఓ సినిమా చేయబోతున్నా. సుకుమార్ అసోసియేట్‌తో 'ప్రసన్నవదనం' అనే ఒక సినిమా చేశా. 'కేబుల్ రెడ్డి' అనే మరో మూవీ చేస్తున్నా. దిల్ రాజు బ్యానర్‌లో సలార్ రైటర్‌తో ఒక మూవీ జరుగుతోంది' అని తెలిపారు.

మంచి రిలీఫ్ ఇచ్చే సినిమా


అపూర్వ రావ్

యష్ పూరి హీరోగా నటించిన కొత్త సినిమా 'హ్యాపీ ఎండింగ్'. ఈ చిత్రాన్ని హమ్స్ టెక్ ఫిలింస్, సిల్లీ మాంక్స్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి. యోగేష్ కుమార్, సంజయ్ రెడ్డి, అనిల్ పల్లాల నిర్మాతలు. కౌశిక్ భీమిడి దర్శకుడు. ఈ సినిమా ఫిబ్రవరి 2న గ్రాండ్‌గా థియేటర్స్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.
ఈ సందర్భంగా హీరోయిన్ అపూర్వ రావ్ మీడియాతో ముచ్చటించింది.
'ఈ సినిమాకు యూత్ ఫుల్ మూవీ అనే పేరు వచ్చింది. కానీ సినిమాలో చాలా హ్యూమర్, ఫన్ ఉంటాయి. ప్రతి పది నిమిషాలకు బాగా నవ్వుకుంటారు. సినిమా చూసిన వాళ్లు బాగా ఎంజాయ్ చేస్తారు. ఎంటర్‌టైన్ అవుతారు. ఈ మూవీలో హీరోకు ఒక సమస్య ఉంటుంది. దాని వల్ల ఆయన చేయాలనుకున్న పనులు చేయలేకపోతాడు. ఈ కాన్‌ఫ్లిక్ట్‌ను హీరో ఎలా ఎదుర్కొన్నాడు?, అందుకు అతను చేసే ప్రయత్నాలు హ్యూమరస్‌గా ఉంటాయి. యష్ గుడ్ కోస్టార్. ఈ సినిమాలో హీరో క్యారెక్టర్‌కు శాపం ఉంటుంది. ఆయన ఎవరి గురించి ఆలోచిస్తాడో వాళ్లకు ప్రాబ్లమ్ వస్తుంది. అలాంటి అబ్బాయిని అర్థం చేసుకుని, అతనికి సపోర్ట్‌గా నిలిచే క్యారెక్టర్ నాది. ఇందులో యోగా ఇన్‌స్ట్రక్టర్ క్యారెక్టర్‌లో కనిపిస్తా. నా క్యారెక్టర్ 'ఆనంద్' సినిమాలో కమలినీ ముఖర్జీ క్యారెక్టర్‌లా అనిపించింది. హీరోయిన్‌గా ఫస్ట్ ఫిలింకే కథలో ఇంపార్టెన్స్ ఉన్న రోల్ లభించడం హ్యాపీగా ఉంది. దర్శకుడు కౌశిక్ మా అందరి సజెషన్స్, ఆలోచనలు తీసుకునేవారు. నా క్యారెక్టర్‌కు నేనే డబ్బింగ్ చెప్పాను. థియేటర్స్‌లో ఫ్రెండ్స్‌తో కలిసి సరదాగా చూడాల్సిన సినిమా ఇది. డైలీ లైఫ్‌లో ప్రెజర్ ఫీలయినవాళ్లు మా మూవీ చూస్తే రిలీఫ్ అవుతారు'.

యూనిక్ కాన్సెప్ట్‌తో గేమ్ ఆన్



కస్తూరి క్రియేషన్స్ అండ్ గోల్డెన్ వింగ్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై రవి కస్తూరి నిర్మించిన చిత్రం 'గేమ్ ఆన్'. గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన ఈ చిత్రానికి దయానంద్ దర్శకత్వం వహించారు. మధుబాల, ఆదిత్య మీనన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం గ్రాండ్‌గా ప్రీ గేమ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిర్మాత వివేక్ కూచిభొట్ల, నటుడు శివ బాలాజీ హాజరయ్యారు. నిర్మాత వివేక్ కూచిభొట్ల ఈ మూవీ రిలీజ్ ట్రైలర్‌ను, బిగ్ టిక్కెట్‌ను లాంచ్ చేశారు.
హీరో గీతానంద్ మాట్లాడుతూ,'ఇది చాలా యూనిక్ కాన్సెప్ట్. ఇలాంటి కాన్సెప్ట్ ఇప్పటి వరకు తెలుగు సినిమాల్లో రాలేదు. రియల్ టైంలో సాగే సైకలాజికల్ గేమ్ అందర్నీ ఆకట్టుకుంటుంది. సౌండ్, ట్విస్టులు, విజువల్స్ అన్ని చాలా కొత్తగా ఉంటాయి. ఈ సినిమాపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం' అని తెలిపారు. 'ఈ ప్రాజెక్టులో భాగమవడం గర్వంగా ఉంది. ఇందులో డిఫరెంట్ క్యారెక్టర్ చేశాను' అని హీరోయిన్ నేహా సోలంకి అన్నారు. డైరెక్టర్ దయానంద్ మాట్లాడుతూ, 'సినిమా అవుట్ పుట్ చాలా బాగా వచ్చింది. నేను చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నా. ప్రతి సీను కొత్తగా ఉండాలని ప్రయత్నిస్తూ.. ప్రేక్షకులకు నచ్చేలా ఈ చిత్రాన్ని రూపొందించా. చిన్న సినిమా, పెద్ద సినిమా అని తేడా లేకుండా ఈ కంటెంట్ గురించి మాట్లాడతారు. ఈ కాన్సెప్ట్ చాలా కొత్తగా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. స్క్రీన్ ప్లే, విజువల్స్ మ్యూజిక్ పరంగా అన్ని విషయాల్లో జాగ్రత్తలు తీసుకున్నాం. మా ప్రొడ్యూసర్ ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. ఈ సినిమాను ప్రేక్షకులు గెలిపిస్తారని నమ్ముతున్నాం' అని అన్నారు. 'థియేటర్లో సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు చాలా ఫ్రెష్ ఫీల్‌ను ఇస్తుంది. బొమ్మ బ్లాక్ బస్టర్.. అందరూ రాసి పెట్టుకోండి' అని నిర్మాత రవి కస్తూరి చెప్పారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.